అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శుక్రవారం 16-3 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 4 సంచిక : 77 | Published from Hyderabad, Rangareddy,Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు ధర : 5.00

బడాయి బడ్జెట్

రూ.1,74,453 కోట్లతో ఈటల పద్దు

రెవెన్యూ వ్యయం రూ.1,25,454 కోట్లు • మూలధన వ్యయం రూ.33,369 కోట్లు

టీఆర్ఎస్ సర్కారు మరోసారి భారీ బడ్జెట్‌తో ప్రజల ముందుకొచ్చింది. ధనికరాష్ట్రం పేరుతో లేని ఆదాయాన్ని వస్తున్నట్టు చూపిస్తున్నదన్న అపవాదు మళ్లీ మూటగట్టుకున్నది.కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏనాడూ రానంత ఇప్పుడు అంచనా వేశారు. గత నాలుగేండ్ల అనుభవం కూడా ఇందులో సగం కూడా రాలేదు. పన్ను ఆదాయం కూడా 15వేల కోట్లు అధికంగా చూపించారని విశ్లేషకుల అంచనా. ఆ మేరకు ఖర్చుచేయకుండా సర్దుబాటు చేసేది సంక్షేమరంగాల కేటాయింపులేననే విమర్శలకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వోద్యోగుల వేతన సవరణను కూడా ఈటల బడ్జెట్ పరిగణనలోకి తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. అంటే ఎన్నికలు అయిపోయేంతవరకూ ఉద్యోగుల వేతన సవరణ వైపు అడుగులు పడవన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. వ్యవసాయం,విద్య,వైద్యం,ఆరోగ్యం వంటి కీలకరంగాల కేటాయింపుల్లో కొత్తదనం లేకపోవడంతో..ప్రజలకు భరోసా కల్పించటంలో జయప్రదంకాలేకపోయారు. రూ.29వేల కోట్లు ద్రవ్యలోటు ప్రతిపాదించారు.ఇది ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా పూడ్చుకుంటారా..లేక ఇప్పటికే రెట్టింపైన అప్పులకు తోడు మరింత అప్పులు చేస్తారా..అన్న ప్రశ్నకు జవాబులేదు. ఎన్నికలకు ముందు ఏడాదికావటంతో సాగునీరు,ఉద్యోగాల విషయంలో ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చలేకపోయిన పాలకులు సంక్షేమంవైపు ప్రజల దృష్టి మళ్లించేందుకు మరోసారి ప్రయత్నించారు.



బడ్జెట్ ప్రవేశ పెడుతున్న ఈటల



బడ్జెట్ అంశాలను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

బడ్జెట్ వివరాలు 2,7,9,10లలో..

కేటాయింపులు సరే... ఖర్చుల సంగతేంటీ?



అంకెల గారడీ : ఎమ్మెల్యే సున్నం రాజయ్య 7

పేదలపై అప్పుల భారం



కాగితాల్లోనే కేటాయింపులు: కాంగ్రెస్ 7

బకాయిలు రూ. 35వేల కోట్లు



పథకాలు పెట్టి వదిలేయటం సీఎంకు అలవాటు : బీజేపీ 7

ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు



బీసీ, ఏంబీసీలను విడదీసి మోసం : టీడీపీ 7

చర్చించకుండానే మరో రెండు బిల్లులు

పార్లమెంట్‌లో అప్రజాస్వామిక పోకడలు

- లోక్‌సభలో కేంద్రం ఏకపక్ష వైఖరి
- అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన : రాజ్యసభలో టీడీపీ ఎంపీ వైఎస్ చౌదరీ
- కాంగ్రెస్ సభ్యుల అభ్యంతరం
- ఉభయసభలు నేటికి వాయిదా



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ప్రజాస్వామ్య దేవాలయం'గా అభివర్ణించే పార్లమెంట్‌లో... కేంద్రం అప్రజాస్వామిక చర్యలకు పూనుకుంటోంది. లోక్‌సభలో ఎలాంటి చర్చా చేపట్టకుండా ఆర్థికబిల్లు, ద్రవ్య వినిమియ బిల్లును ఆమోదించిన మరుసటి రోజే మరో రెండు బిల్లులను సైతం అదేవిధంగా బీజేపీ సర్కారు ఏకపక్షంగా ఆమోదించుకుంది. బిల్లులపై చర్చ చేపట్టాలని, ప్రతి ఒక్క పార్టీకీ మాట్లాడే అవకాశం ఇవ్వాలని విపక్షాలు చేసిన సూచనలు బుట్టదాఖలయ్యాయి. లోక్‌సభలో ఉన్న మెజార్టీ సంఖ్యాబలం అండతో పార్లమెంట్ ప్రజాస్వామ్య సూత్రాలకు మోడీ సర్కారు ...9లో



పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం : ఏచూరి 9

వేతనం పెంచాలని మున్సిపల్ సమ్మె

ర్యాలీలు, ధర్నాలు, దీక్షలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్‌లో

వివరాలు 9లో

అప్పు.. లక్షా 80 వేల కోట్లు

మరో రూ.41 వేల కోట్లకు గ్యారెంటీ ఇవ్వనున్న సర్కార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అప్పు...ఇప్పుడు అక్షరాలా రూ.లక్షా 80 వేల కోట్లు. బడ్జెట్‌తో సమానంగా మన అప్పులు దౌడు తీస్తున్న క్రమంలో వచ్చే సంవత్సరం నాటికి ఇవి రూ.2 లక్షల కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదని ఆర్థికశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గురువారం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత నాలుగేండ్ల అప్పుల చిట్టాను విశదీకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తర్వాత తెలంగాణ వాటాగా వచ్చిన అప్పు రూ.60 వేల కోట్లు.. అప్పటి నుంచి క్రమక్రమంగా, శరవేగంగా పెరుగుతూ వస్తున్న రుణభారం వచ్చే ఏడాది నాటికి రూ.లక్షా 80 వేల కోట్లకు చేరొచ్చని సర్కారు అంచనా వేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఇది 21.39 శాతంగా ...9లో

సగటున 9 శాతం వృద్ధిరేటు..

- ప్రభుత్వ క్రియాశీల విధానాలే కారణం : సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో సగటున 9 శాతం వృద్ధిరేటు నమోదవుతున్నదని సామాజిక, ఆర్థిక సర్వే పేర్కొన్నది. 2014-15 నుంచి 2017-18 దాకా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని విశదీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న క్రియాశీలక విధానాలే దీనికి కారణమని తెలిపింది. సర్వే వివరాలను గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను తదితర కారణాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు మందగించిందని సర్వేలో పేర్కొన్నారు. దీనికి భిన్నంగా తెలంగాణాలో వృద్ధిరేటు నిలకడగా ముందుకు పోతున్నదని నివేదికలో పొందుపరిచారు. మరోవైపు 2017-18లో రాష్ట్ర జీడీపీ (ప్రస్తుత ధరల ప్రకారం) రూ.7,32,657 కోట్లుగా నమోదైందని సర్వే తెలిపింది. 2016-17తో పోలిస్తే ఇది 14.1 శాతం అదనమని వివరించింది.

ప్రపంచంలోనే రెండో వీర బాదుడు...!

జీఎస్టీపై ప్రపంచ బ్యాంకు వ్యాఖ్య

వివరాలు 2లో

బాలికపై లైంగికదాడి

సిద్దిపేట జిల్లాలో దారుణం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వివరాలు 9లో

బ్రాండెడ్ బాటిల్స్‌లో వ్యర్థాలు

వాటర్ సీసాల్లో 10,000 వరకు ప్లాస్టిక్ రేణువులు



న్యూఢిల్లీ: సురక్షిత తాగునీటి కోసం ఎన్ని డబ్బులైన ఆలోచించకుండా వెచ్చించి.. బ్రాండెడ్ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసేందుకు సిద్ధపడతాం. ఎందుకంటే ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన తాగు నీటిని తీసుకోవడం అత్యవ సరమని భావిస్తాం. ఖరీదును లెక్కచేయకుండా కొనుగోలు చేసిన ఆ బ్రాండెడ్ వాటర్ బాటిళ్లే నేడు ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించాయి. మనం అనుకుంటున్నట్టు బ్రాండెడ్ వాటర్ బాటిళ్ల నీరు స్వచ్ఛమైంది కాదని, ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని తాజా నివేదిక ఒకటి తేల్చింది. ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న కంపెనీల వాటర్ బాటిల్స్‌లోనూ ఈ వ్యర్థాలు వెలుగుచూశాయి. అమెరికాలోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ...9లో


భారతీయులు సంతోషంగా లేరు

ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి- 156 దేశాల సూచీలో భారత్ స్థానం 133

న్యూఢిల్లీ: భారతీయులు సంతోషంగా లేరు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో సంతోషకర దేశాల జాబితాలో భారత్ స్థానం మరింత దిగజారింది. ఈ విషయం ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన సంతోషకర దేశాల జాబితా వెల్లడించింది. ఈ ఏడాది భారత్ స్థానం 11 స్థానాలకు పడిపోయింది. 156 దేశాలతో కూడిన ఈ జాబితాలో ప్రస్తుతం భారత్ 133వ స్థానంలో ఉంది. పాకిస్థానే కాదు, మన సరిహద్దు దేశాలైన భూటాన్, నేపాల్, చైనా, శ్రీలంకలు భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉండటం గమనార్హం. ఈ ఏడాది జాబితాలో మన దేశం సాధనం 133కు దిగజారితే... పాక్ 75వ స్థానానికి ఎగబాకింది. గతేడాది కూడా పాక్ మన కంటే మెరుగైన స్థానంలోనే ఉంది. ప్రపంచ సంతోషకర దేశాల జాబితాను ...9లో



United Nations



అడవిబిడ్డలకు పంటలక్ష్మి దూరం

- రాష్ట్రంలో 4లక్షల మంది పోడురైతులు
- 1.30 లక్షల మందికి దక్కని హక్కుపత్రాలు
- గిరిజన కౌలు రైతులకూ మొండి చేయే

హక్కుపత్రాలున్నా పథకానికి అనర్హులే

తరతరాలుగా పోడు గొట్టుకుని జీవిస్తున్న గిరిజన రైతులకు పంటలక్ష్మి పథకం అందని ద్రాక్షగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలమంది పోడుసాగు దారులుండగా వారిలో లక్షా 30వేల మందికి ఇంకా హక్కుపత్రాలివ్వలేదు. దీంతో భూములున్నప్పటికీ పంట లక్ష్మి పథకానికి దూరం అవుతున్నారు. మరోవైపు హక్కుపత్రాలున్నవారినీ అనేక సాకులు చూపించి భూముల నుంచి పంపించే కుట్రను సర్కారు చేస్తున్నది.



(ఫైల్)

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సమితి బహిరంగసభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 1970కి ముందున్న ఏజెన్సీలోని గిరిజనేతరులకూ పంట ప్రోత్సాహకం పథకాన్ని వర్తింపచేస్తామని చెప్పడం ఒకింత ఆనందం కలిగినా మెజారిటీ గిరిజనులు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కుప త్రాలు పొందిన గిరిజనులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉన్నా తెలంగాణ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్‌రూరల్, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆసిఫాబాద్, కామారెడ్డి, కొమరంభీం, తదితర జిల్లాల్లో 13లక్షల ఎకరాల పోడు భూములున్నాయి. కానీ, ఏడు లక్షల ఎకరాలకు మాత్రమే హక్కుపత్రాలిచ్చారు. ఇవి కూడా అసలైన గిరిజన రైతుల పేరున 2.50లక్షల ఎకరాలే పంపిణీ చేశారు. మిగిలిన 4.50లక్షల ఎకరాలను వీఎస్ఎస్ (వనసంరక్షణ సమితి) పేరున ఉమ్మడిగా హక్కుపత్రాలిచ్చారు. మరికొన్ని పట్టాలు పంపిణీకి నోచక ప్రభుత్వ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న కొందరు అర్హుల విన్నపాలు ఇప్పటికీ పరిశీలనకు నోచుకోవడం లేదు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే గ్రామ సభలు నిర్వ హించి అర్హులైన పోడు రైతులకు హక్కు పత్రాలు అందజేయాలి. ప్రభుత్వం ...9లో



కేటాయింపులు ఇవే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలీహౌస్, గ్రీన్ హౌస్‌కు రూ.120 కోట్లు
వ్యవసాయం, మార్కెటింగ్‌కు రూ.15,780 కోట్లు
కోల్డ్‌స్టోరేజీ, లింకేజీలు రూ.132 కోట్లు
పౌరసరఫరాలశాఖకు రూ.2946 కోట్లు
సాగునీటి ప్రాజెక్టులకు రూ.25 వేల కోట్లు
పంచాయతీలకు రూ.1500 కోట్లు
మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ. 1000 కోట్లు
ఫౌల్ట్రీ రంగానికి రూ.109 కోట్లు
ఆసరా పింఛన్లకు రూ.5300 కోట్లు
కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.1450 కోట్లు
ఆరోగ్యలక్ష్మి పథకానికి రూ.298 కోట్లు
మహిళాశిశు సంక్షేమానికి రూ.1799 కోట్లు
ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రగతి నిధికి రూ.9693 కోట్లు
ఎస్సీ అభివృద్ధి శాఖకు రూ.12709 కోట్లు
దళితులకు భూపంపిణీకి రూ.1469 కోట్లు
ఎస్టీల అభివృద్ధి శాఖకు రూ.8063 కోట్లు
వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ.5920 కోట్లు
రజక ఫెడరేషన్‌కు రూ.200 కోట్లు
నాయిబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు
ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు
మైనార్టీ సంక్షేమానికి రూ.2వేల కోట్లు
బ్రాహ్మణ సంక్షేమానికి రూ.100 కోట్లు
జర్నలిస్టుల సంక్షేమానికి రూ.75 కోట్లు
డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.2643 కోట్లు
అమ్మ ఒడి పథకానికి రూ.561 కోట్లు
వైద్య ఆరోగ్యశాఖకు రూ.7375 కోట్లు
పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు
ఉన్నత విద్యకు రూ.2448 కోట్లు
రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు రూ.2823 కోట్లు
మిషన్ భగీరథకు రూ.1801 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.15,563 కోట్లు
రోడ్లు, రవాణా, భవనాలకు రూ.5,575 కోట్లు
విద్యుత్ రంగానికి రూ.5,650 కోట్లు
చేనేత, టెక్స్‌టైల్ రంగానికి: రూ.1200 కోట్లు
పరిశ్రమలు, వాణిజ్యశాఖకు రూ.1286 కోట్లు
ఐటీశాఖకు రూ.289 కోట్లు
పట్టణాభివృద్ధిశాఖకు రూ. 7251 కోట్లు
వరంగల్ నగర అభివృద్ధికి రూ. 300 కోట్లు
ఇతర కార్పొరేషన్ల అభివృద్ధికి రూ. 400 కోట్లు
సాంస్కృతిక శాఖకు రూ. 58 కోట్లు
వేములవాడ దేవాలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు
భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు
బాసర ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు
ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు
అర్చకుల జీతభత్యాలకు రూ. 72 కోట్లు
సీజీఎఫ్‌కు రూ. 50 కోట్లు
హోంశాఖకు రూ. 5790 కోట్లు

ఈ ఏడాదీ ఒట్టిమాటేనా!

చేనేతకు కేటాయింపే.. ఖర్చేదీ

- ఏటా రూ.1200కోట్లు కేటాయింపు
- గతేడాది ఖర్చు చేసింది రూ.420కోట్లే
- అదీ 'బతుకమ్మ చీరల'కే !
- సిరిసిల్లలో ఇవ్వని సబ్సిడీకీ లెక్కలు
- నిర్దిష్ట రంగాలకు కేటాయింపుల్లేని చేనేత బడ్జెట్

నవతెలంగాణ- సిరిసిల్ల

చేనేత రంగానికి బడ్జెట్లో భారీగా కేటాయింపులు చూపుతూ.. ఖర్చు మాత్రం ఒక వంతు కూడా పెట్టడం లేదు. గతేడాది రూ.1283కోట్లు చేనేత వస్త్ర పరిశ్రమకు కేటాయిస్తే, అందులో ఖర్చు చేసింది రూ.420కోట్లు మాత్రమే. అదీ 'బతుకమ్మ చీరలకే రూ.230కోట్లు వెచ్చించగా, సిబ్బంది జీతభత్యాలు, ఇతరత్రా ఖర్చులకు మిగిలింది సరిపోయింది. ఇది మినహా చేనేత అభివృద్ధి ప్రణాళికలో నిర్దిష్టంగా భాగం కాలేకపోయింది. నూలు రంగులు, రసాయనాల కోసం ఇవ్వని 50శాతం సబ్సిడీ ఇచ్చినట్లు లెక్కల్లో చూపడంతో పరిశ్రమవర్గాలు నివ్వెరపోయాయి. ఈ బడ్జెట్‌లోనూ నిర్దిష్ట రంగాలకంటూ కేటాయింపుల్లేకపోవడం గమనార్హం.

రాష్ట్రంలోనే అత్యధిక మరమగ్గాలున్న ప్రాంతం సిరిసిల్ల కావడం ఒకెత్తయితే.. సాక్ష్యాత్తు చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆర్థిక శాఖ మంత్రి ఈటల ప్రవేశపెట్టిన 2018-19 రాష్ట్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న వస్త్ర పారిశ్రామికులు, కార్మికులకు నిరాశే మిగిలే పరిస్థితి. వస్త్ర పరిశ్రమలోని అన్ని విభాగాలనూ అభివృద్ధి చేస్తూ సిరిసిల్లను మెగాటెక్స్‌టైల్ పార్క్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి కేటీఆర్ అనేకమార్లు చెప్పారు. ఇదే క్రమంలో మరమగ్గాల కార్మికులను యజమానులుగా చేసేందుకు వర్క్‌షెడ్ స్కీంకు శ్రీకారం చుట్టారు. పెద్దూర్ సమీపంలో రూ.200కోట్ల పైచిలుకు నిధులతో ఈ పథకం అమలు చేస్తామని ప్రకటించారు. గతేడాది అనుభవాల రీత్యా ఈ ఏడాది బడ్జెట్‌లోనూ కేటాయింపులు నిర్దిష్టంగా లేకపోవడంతో పరిశ్రమవర్గాల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.

గత బడ్జెట్‌లో...

2017-18 బడ్జెట్‌లో రూ.1283 కోట్లు కేటాయించిన రాష్ట్ర సర్కారు దేశంలోనే చేనేత రంగానికి భారీగా నిధులు ఇస్తున్నామని చెప్పుకొచ్చింది. ఖర్చు మాత్రం అరకొరగానే చేసింది. రూ.1283 కోట్ల కేటాయింపులో రూ.420కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అదీ రూ.230కోట్లు బతుకమ్మ చీరల పథకానికే వెచ్చించింది. మిగిలిన నిధులు సిబ్బంది జీతభత్యాలకు, ఇతర అవసరాలకు వినియోగించింది. ఈ ఏడాది కేటాయించిన రూ.1200కోట్ల బడ్జెట్ నేపథ్యంలో ఇప్పటికే సిరిసిల్లలో ఏర్పాటవుతున్న గ్రూప్ వర్క్‌షెడ్ పథకంతోపాటు మరమగ్గాల పరిశ్రమ విస్తరణకు ఏ మేరకు నిధులు అందుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి మరమగ్గం కార్మికునికీ నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వేతనం వచ్చేలా చేస్తామంటున్న ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌లో



ఏ విభాగానికి ఎంత ఖర్చు చేస్తామన్నది ఎక్కడా ప్రస్తావించలేదు.

చేయని ఖర్చుకు చూపిన లెక్కలు

నూలు రంగులు, రసాయనాల కోసం 50శాతం సబ్సిడీ ఇచ్చినట్టు గత బడ్జెట్ ఖర్చులో చూపించడంతో వస్త్ర పరిశ్రమవర్గాలు నివ్వెరపోయాయి. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమలో 70 వరకు అద్దకం యూనిట్లు ఉన్నాయి. ఈ విషయంపై 'నవతెలంగాణ' పలువురు అద్దకం యూనిట్ల నిర్వాహకులను ప్రస్తావించగా, అసలు తమకు రంగులు, రసాయనాలపై సబ్సిడీ ఎప్పుడిచ్చారని ప్రశ్నించారు. 'పద్దుల్లో పొరపాటు దొర్లిందా..? అనామతుగా లెక్కల్లో వేశారా' అన్నది చర్చనీయాంశంగా మారింది.

సంక్షేమ నిధి ప్రస్తావన లేదు.. కార్పొరేషన్ల ఊసే లేదు

చేనేత సమగ్రాభివృద్ధి కోసం 'కొండా లక్ష్మణ్ బాపూజీ మిషన్' ఏర్పాటు చేస్తామన్న హామీ ఆచరణలో లేకుండా పోయింది. చేనేత మరమగ్గాల కార్మికుల సమస్యల అధ్యయనం కోసం ప్రత్యేకంగా కమిటీ వేసి సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామన్నది అమలు కాలేదు. మరోవైపు చేనేత, జౌళిశాఖలను వేరు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్న అంశం బడ్జెట్ ప్రస్తావనలో లేదు.

ఎంత ఖర్చు చేశారన్నదే ముఖ్యం

కూరపాటి రమేష్
తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతకు ఎన్ని కోట్లు కేటాయించిందన్నది ప్రధానం కాదు. ఎంత ఖర్చు చేశారన్నది ఆలోచించాలి. గత బడ్జెట్ కేటాయింపుల్లో రూ.420కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గతంలో ఇచ్చిన హామీలకు సంబంధించి ఒక్కటీ ఆచరణకు నోచలేదు. చేనేత, జౌళిరంగాలకు వేరువేరుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తామన్నారు మరిచారు.

సాగునీటి ప్రాజెక్టులకు రూ. 25,000 కోట్లు

- వరుసగా మూడవ సారి భారీ కేటాయింపులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగానికి మళ్లీ పెద్ద పీట వేశారు. వరుసగా మూడవసారి రూ. 25,000 కోట్లు కేటాయించారు. దీనిలో ప్రణాళికా వ్యయం రూ. 21,301 కోట్లు కాగా ప్రణాళికేతర వ్యయం రూ. 3,699 కోట్లుగా అంచనా వేశారు. ప్రణాళికా వ్యయంలో భారీ సేద్యపు నీటి ప్రాజెక్టులకు రూ. 17,750.45 కోట్లు, మధ్యతరహా ప్రాజెక్టులకు రూ. 7,133 కోట్లు, మిషన్ కాకతీయ సహా చిన్న నీటి వనరులకు రూ. 2,511.60 కోట్లు కేటాయించారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థకు రూ. 300 కోట్లు, భూగర్భ జల శాఖకు రూ. 96.60 కోట్లు, ఆయకట్టు అభివృద్ధికి రూ. 226 కోట్లు, వరద నివారణ చర్యల కోసం రూ. 100 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే భారీ, మధ్యతరహా, చిన్నతరహా సేద్యపు నీటి రంగాలకు కేటాయింపులు పెరిగాయి. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణం తీసుకుంటున్నందువల్ల రాష్ట్ర బడ్జెట్‌లో ఈ రెండు ప్రాజెక్టులకు కేటాయింపులు తగ్గాయి. రాష్ట్రంలోని నాలుగు భారీ, ఏడు మధ్యతరహా ప్రాజెక్టులకు ఏఐబీపీ ద్వారా కేంద్రం నిధులు కేటాయిస్తున్నందువల్ల ఈ నిధులతో కలిపి బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. కేంద్రం నిధులందిస్తున్న భారీ ప్రాజెక్టుల్లో నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ వరదకాల్వ, బీమా, దేవాదుల ప్రాజెక్టులు ఉన్నాయి.

భారీ సేద్యపు నీటి ప్రాజెక్టులకు కేటాయింపుల వివరాలు

ప్రాజెక్టు పేరు	కేటాయింపులు రూ. కోట్లలో
కాళేశ్వరం	6,104.00
పాలమూరు	3,035.00
సీతారామ	1,200.00
దేవాదుల	1,966.45
డిండి	525.00
కంతనపల్లి	500.00
ఎస్సెల్బీసీ	700.00
కల్వకుర్తి	500.00
నెట్టెంపాడు	200.00
బీమా	170.00
ప్రాణహిత-చేవెళ్ల	350.00
రాజోలిబండ	145.00
శ్రీరామ్‌సాగర్	285.00
నిజాంసాగర్ ఆధునీకరణ	110.00
ఎల్లంపల్లి	300.00
ఎస్సారెస్పీ వరద కాల్వ	650.00
లోయర్ పెన్‌గంగ	250.00
జూరాల	45.00
సింగూరు	55.00
కడెం	12.90
లెండి	40.00
అలీసాగర్	20.50
గుత్ప	26.00
చౌటుపల్లి హన్మంతరెడ్డి ఎత్తిపోతల	6.10
భక్త రామదాసు	25.00

కేటాయింపులు ఘనం.. ఖర్చు నామమాత్రం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతియేటా నీటిపారుదల రంగానికి భారీ కేటాయింవపులు చేస్తున్నప్పటికీ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి ఈ నిధులను ఖర్చు పెట్టక పోవటంతో ఆశించిన ఫలితాలు అందటం లేదు. 2014-15 బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి రూ. 6,500 కోట్లు కేటాయించగా రూ. 5,285 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 2015-16లో రూ. 8,000 కోట్లు కేటాయించగా రూ. 7,776 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టులను పూర్తి ప్రతియేటా రూ. 25,000 కోట్లు బడ్జెట్‌లోకేటాయిస్తామని 2015లో ముఖ్యమంత్రి ప్రకటించారు. 2016-17 బడ్జెట్‌లో మొదటి సారి రూ. 25,000 కోట్లు సాగునీటి రంగానికి కేటాయించారు. వీటిలో కేవలం 16,200 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 2017-18 బడ్జెట్‌లో కూడా రూ. 25,000 కోట్లు కేటాయించగా మూడవ త్రైమాసికం పూర్తయ్యే నాటికి రూ. 10,000 కోట్లు కూడా ఖర్చు కాలేదని నీటిపారుదల శాఖ అధికారులే అంటున్నారు. మార్చి నెలఖరు వరకూ 17,000 కోట్లు మాత్రమే ఖర్చవుతాయని తాజాగా అంచనా వేశారు.

2018-19 బడ్జెట్‌లో కూడా సాగునీటి రంగానికి రూ. 25,000 కోట్లు కేటాయించారు. కాళేశ్వరం, పాలమూరు వంటి ముఖ్యమైన ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచటానికి రూ. 35,000 కోట్లు కావాలని నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు పంపించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటికే బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 7,000 కోట్లు రుణంగా తీసుకుని ఖర్చు పెట్టారు. పాలమూరు ప్రాజెక్టుకు కూడా ఇదే తరహాలో బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని భావిస్తున్నారు. రుణం ఇవ్వటానికి బ్యాంకులు ముందుకు వస్తున్నందువల్ల సాగునీటి ప్రాజెక్టుల బడ్జెట్‌ను రూ. 25,000 కోట్లకే కుదించారు.

అంకెలతో మోసం : గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో తండాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా అంకెలతో మోసం చేసిందని తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్ విమర్శించారు. 2017-18లో గిరిజనులకు రూ.8,165 కోట్లు కేటాయించి పూర్తిగా ఖర్చు చేయలేదని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగేండ్లలో గిరిజనులకు రూ.23 వేల కోట్లు కేటాయించి రూ.13 వేల కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. మిగిలిన రూ.10 వేల కోట్లు దారిమళ్లించారని తెలిపారు. తండాల్లో కరెంటు సౌకర్యం, రోడ్లు సరిగ్గా లేక, విద్యావైద్యం అందక గిరిజనులు, ఆదివాసీలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సాగు, తాగునీరు లేక వలస వెళ్తున్నారని తెలిపారు. తండాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించకుండా గిరిజన అభివృద్ధికి అడ్డుకుంటోందని తెలిపారు. బడ్జెట్‌లో 9.91 శాతం నిధులు గిరిజనుల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు రూ.18 వేల వేతనమివ్వాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎస్ఎస్ఎ స్వచ్ఛ కార్మికుల యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌ను గురువారం యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించింది. సెలవుల్లోనూ వేతనమివ్వాలని కోరారు. వారికి నెలకు రూ.2 వేల నుంచి రూ.3,500 చెల్లిస్తున్నారని తెలిపారు. ఆ చెల్లించే కొద్ది వేతనంలోనూ రూ.వెయ్యి కోత విధించారని పేర్కొన్నారు.

తగ్గించిన రూ.వెయ్యి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇచ్చే వేతనం సరిపోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనం నేరుగా బ్యాంక్ ఖాతాలనే జమచేయాలని కోరారు. పాత వారిని తొలగించవద్దని సూచించారు. కార్మికులందరికీ పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, యూనిఫామ్స్ ఇవ్వాలని కోరారు.

బీసీ సబ్‌ప్లాన్ ఊసెత్తలేదు

బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసెత్తలేదని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ విమర్శించింది. ఈ మేరకు కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2018-19 బడ్జెట్‌ను రూ.1,74,453 కోట్లలో బీసీలకు రూ.5,920 (3.39 శాతం) కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. 52 శాతం ఉన్న బీసీలకు సబ్‌ప్లాన్ ప్రకటిస్తామని చెప్పి తీరా బడ్జెట్‌లో ఆ ఊసే లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. 2017-18 బడ్జెట్‌లో రూ.5,070 కోట్లు కేటాయించి రూ.1,500 ఖర్చు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం రూ.5,920 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్తున్నా ఎంత ఖర్చు చేస్తారన్నదే ప్రశ్నార్థకమని పేర్కొన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లోనే రూ.వెయ్యి కోట్లు కేటాయించారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించారని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులనే తిరిగి కేటాయించారా? లేక అదనంగా కేటాయించారా? అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల బడ్జెట్: రాంచందర్‌రావు, బీజేపీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా ఎన్నికల బడ్జెట్‌గా ఉందని శాసనమండలి సభ్యులు రాంచందర్‌రావు అన్నారు. గతంలో కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చు చేయలేదనీ, మళ్లీ ఇప్పుడు భారీ బడ్జెట్ పెట్టారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూముల కోసం కేటాయించిన నిధులు ఏమూలకు సరిపోవని చెప్పారు. వెల్ఫేర్ స్కీమ్స్‌కు గతం కంటే తక్కువగా నిధులు కేటాయించారని అన్నారు.

వృద్ధిరేటు పెరిగింది: పాతూరి సుధాకర్‌రెడ్డి, టీఆర్ఎస్

జాతీయ వృద్ధిరేటు కంటే తెలంగాణ వృద్ధిరేటు ఘనసీయంగా ఉందని శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్ పెరుగుతుందని చెప్పారు. వ్యవ సాయరంగానికి అధిక నిధులు కేటాయించారనీ, వ్యవసాయం దండగ కాదు పండగ అని ప్రభుత్వం నిరూపిస్తుందని చెప్పారు. వ్యవసాయ రుణాల మాఫీ చేశామనీ, వ్యవసాయ పెట్టుబడికి ఎకరాకు రూ.8వేలు ఇవ్వనున్నామని తెలిపారు.

వ్యవసాయ బడ్జెట్: పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఆర్ఎస్

తెలంగాణ బడ్జెట్‌ను వ్యవసాయ బడ్జెట్‌గా భావిస్తున్నామని శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ పెట్టుబడికి రూ.12వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని చెప్పారు. రైతు పెట్టుబడి పథకంతో పాటు వైద్య విభాగంలోనూ రెండు కొత్త పథకాలు తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జనరంజక బడ్జెట్: వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌రావు , సతీశ్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకమైన బడ్జెట్ అని శాసనమండలి సభ్యులు బోడపుంటి వెంకటేశ్వర్‌రావు, నారదాసు లక్ష్మణ్‌రావు, పురాణం సతీశ్ అన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ అధిక నిధులు కేటాయించారని చెప్పారు. అమెరికా తరహాలో హెల్త్ ప్రొఫైల్స్ ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. బ్రహ్మణుల అభివృద్ధికి రూ.70కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జాతీయం

'ద వైర్' పై ఏప్రిల్ 12 వరకు చర్యలొద్దు

- గుజరాత్ కోర్టును ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : ద వైర్ న్యూస్ పోర్టల్‌పై క్రిమినల్ పరువునష్టం చర్యలకు ఉపక్రమించవద్దని గుజరాత్‌లోని ట్రైల్ కోర్టును గురువారం సుప్రీం కోర్టు కోరింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జేషా కేసును ఏప్రిల్ 12న తామే విచారణ చేపడతామని, అప్పటి వరకు దానిపై విచారణ చేపట్టవద్దని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ కేసులో విలేకరి అభ్యర్థనపై రెండు వారాలలోగా తమ స్పందనలను దాఖలుచేయాలని అమిత్‌షాతో పాటు ఇతరులను కోరింది. మీడియా నోరు నొక్కేందుకు తాము వ్యతిరేకమని, అది బాధ్యతాయుతంగా ఉండాలని తాము భావిస్తామని, ఎలక్ట్రానిక్ మీడియా మరింత బాధ్యతాయుతంగా ఉండాలనుకుంటామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా వ్యాఖ్యానించారు. షా తరుపున హాజరైన సీనియర్‌అడ్వకేట్ ఎన్‌కె కౌల్ తన వాదనను వినిపిస్తూ ద వైర్ కథనం షా ప్రతిష్టను దెబ్బతీసిందన్నారు. దీనికి వైర్ తరుపు న్యాయవాది కపిల్‌సిబల్ స్పందిస్తూ షాని ప్రశ్నిస్తున్నామని మాత్రమే చెప్పారు.

'శంభాజీ భిడేను అరెస్ట్ చేయాలి'

ముంబయి: భీమాకోరెగావ్ అల్లర్ల కేసులో హిందూత్వ నాయకుడు శంభాజీ భిడేను అరెస్ట్ చేయాలని భరిప బహుజన్ మహాసంఘ్ నాయకుడు, అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. ఈ నెల 26లోగా ఆయనను అరెస్ట్ చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైతే వీధుల్లోకి వచ్చి నిరసనకు దిగుతామని హెచ్చరించారు. మిలింద్ ఏక్బోట్‌ను బుధవారం అరెస్ట్ చేసిన ప్రభుత్వం భిడేను ఇంకా కస్టడిలోకి తీసుకోలేదని ఆయన తెలిపారు. భీమాకోరెగావ్ కేసు విషయంలో రిటైర్డ్ జస్టిస్ జై నారాయణ్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడే కమిటీకి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) కింద అధికారాలు కల్పించాలన్నారు.

మైనర్లపై లైంగికదాడికి పాల్పడితే.. ఉరిశిక్షే

- హర్యానాలోనూ చట్టం

చండీగఢ్: 12 ఏండ్లలోపు బాలికలపై చోటు చేసుకుంటున్న లైంగికదాడులను అరికట్టేందుకు హర్యానా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. చిన్నారులపై లైంగికదాడికి పాల్పడే వారికి మరణశిక్ష విధించేలా చట్టం చేసింది. బడ్జెట్ సమావేశాల ముగింపు చివరిరోజు ఈ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. బాలికలపై లైంగికదాడులకు పాల్పడేవారికి సెక్షన్ 377 ఏఏ కింద కనీసంగా 14 ఏండ్లు జైలు శిక్ష విధించనున్నారు. వారి ప్రవర్తన మారకుంటే ఆ శిక్షను 20 ఏండ్లకు పొడగించనున్నారు.

ప్రపంచంలోనే రెండో వీర బాదుడు...!

జీఎస్టీపై ప్రపంచ బ్యాంకు వ్యాఖ్య

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోడీ సర్కారు గత ఏడాది జులై 1 నుండి అమలులోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన చట్టాలలో ఒకటి మాత్రమే కాక ప్రజలపై మోపిన అధిక పన్ను భారాలలో రెండో స్థానంలో వుందని ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో వెల్లడించింది. భారత్ జీఎస్టీ వ్యవస్థలో 0, 5%, 12%, 18%, 28% ఇలా ఐదు శ్లాబ్‌లున్న విషయం తెలిసిందే. పన్ను మినహాయింపు పొందిన వస్తువులు, ఎగుమతులను జీరో రేటెడ్ కింద చేర్చారు. ఇందులో ఎగుమతి దారులు తాము ఎగుమతులపై చెల్లించిన సుంకాలను ప్రభుత్వం వాపస్ చేస్తుంది. పై రేట్లు కాక బంగారంపై 3 శాతం, వజ్రా భరణాలపై 0.25 శాతం పన్ను విధించగా, ఆల్కహాల్, పెట్రోలియం ఉత్పత్తులు, రియలెస్టేట్ రంగానికిచెందిన స్టాంప్ డ్యూటీల వంటి వాటిని జిఎస్‌టి నుండి మినహాయించారు. అయితే వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం తమ పన్ను రేట్ల ప్రకారం పన్నులు వసూలు చేసుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 115 దేశాలలో పన్ను విధానాలపై సర్వే నిర్వహించిన ప్రపంచ బ్యాంకు దాదాపు 49 దేశాలలో జీఎస్టీకి సంబంధించి ఒకే శ్లాబ్ అమలులో వుందని తన నివేదికలో పేర్కొంది. 28 దేశాలలో రెండు శ్లాబ్‌లు, భారత్‌తో సహా కేవలం ఐదు దేశాలలో మాత్రమే నాలుగు నాన్ జీరో శ్లాబ్‌లలో అమలు చేస్తున్నాయి. నాలుగు, అంత కంటె ఎక్కువ శ్లాబ్‌లలో జీఎస్టీ అమలులో ఉన్న దేశాలలో ఇటలీ, లక్సెంబర్గ్, పాకిస్తాన్, ఘనా వున్నాయి. దీనితో ప్రపంచంలోనే అత్యధిక జిఎస్‌టి శ్లాబ్‌లు వున్న రెండోదేశంగా భారత్ రికార్డులకెక్కింది. పన్ను విధానం అమలు మెరుగుపడి, పన్ను వసూళ్లు పెరిగిన తరువాత 12, 18 శాతం శ్లాబ్‌లను విలీనం చేసి శ్లాబ్‌ల సంఖ్య తగ్గి స్తానని అరుణ్‌జైట్లీ లోక్‌సభలో హామీ ఇచ్చారు. గత ఏడాది నవంబర్‌లో గౌహతిలో భేటీ అయిన జీఎస్టీ కౌన్సిల్ గతంలో 28 శాతం పరిధిలో వున్న 228 వస్తువుల సంఖ్యను 50కి తగ్గించింది. ఈ నేపథ్యంలో భారత్ ఆర్థికాభివృద్ధిపై అంచనాలతో ప్రపంచ బ్యాంకు తన ద్వైవార్షిక నివేదికను బుధవారం నాడు విడుదల చేసింది. జీఎస్టీ ఆరంభించిన తొలి రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అనేక చిక్కులు ఎదుర్కొన్నాయని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో వివరించింది.

తీవ్రవాదులకు అడ్డాగా అరారియా

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బీహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానం తీవ్రవాదులకు కేంద్రంగా మారబోతున్నదని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బుధవారం ప్రకటించిన ఉప ఎన్నికల ఫలితాల్లో అరారియా స్థానాన్ని రాష్ట్రీయ జనతా దళ్(ఆర్‌జేడీ) పార్టీ తిరిగి సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 'అరారియా నేపాల్, బెంగాల్‌ల సరిహద్దులో ఉంది. అక్కడ నడిచే తీవ్రమైన సిద్ధాంతాలతో బీహార్‌కే కాకుండా దేశం మొత్తానికి ప్రమాదం. దీంతో అరారియా ప్రాంతం భవిష్యత్తులో తీవ్రవాదులకు కేంద్రంగా మారుతుంది. రాజకీయ లక్ష్యాల కోసం ఆర్జేడీ కొత్త సంస్కృతిని మొదలు పెట్టింది' అని ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలపై వివిధ రాజకీయనాయకుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. అరారియాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీహార్ మాజీ సీఎం జీతన్‌రాం మాంఝీ అన్నారు. అక్కడ ముస్లింలే కాకుండా షెడ్యూల్డు కులాలు, ఇతరులు కూడా ఉన్నారని, తీవ్రవాదులకు కేంద్రంగా ఎలా మారుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి వ్యాఖ్యల పై ఆర్‌జేడీ జాతీయ ఉపాధ్యాక్షురాలు రబ్రీదేవి మండిపడ్డారు. భారత్‌లో ఉండే తీవ్రవాదులంతా బీజేపీ కార్యాలయంలోనే కూర్చున్నారని విమర్శించారు. వెంటనే అరారియా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే 2019 ఎన్నికల్లో బీజేపీని క్షమించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌ని పరిపాలిస్తున్నది బీజేపీ మిత్రపక్షమేనని కేంద్రమంత్రికి తెలియకపోవడం దురదృష్టకరమని రబ్రీదేవి కుమారుడు, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ విమర్శించారు.

19న ఊబర్, ఓలా డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

ముంబయి: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్లు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నెల 19న తమ కుటుంబాలతో కలిసి ఆ సంస్థ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆ సంస్థలు తమ డిమాండ్లు నెరవేర్చేవరకు నిరసనలు ఆపబోమని మహారాష్ట్ర నవనిర్మాణ వాహతుక్ సేవా(ఎంఎన్‌వీఎస్) అధ్యక్షుడు సంజయ్ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఊబర్, ఓలా సంస్థలు వ్యాపారాన్ని ప్రారంభించినప్పుడు తమ(డ్రైవర్లు) వద్ద రూ. 1,25,000లు ష్యూరిటీగా తీసుకుని వాహనాలు ఇచ్చేవని, కానీ ఇప్పుడు ఆ సంస్థలు సొంత వాహనాలను మూసివేశా యన్నారు. దీంతో తామే బ్యాంకుల వద్ద అప్పు తీసుకుని కార్లు కొనుగోలు చేసి రుణాలు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కుటుంబం కోసం రోజుకు 12 గంటలు కష్టపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణీకులు తక్కువ రేటింగ్ ఇచ్చిన డ్రైవర్లను తీసివేస్తున్నారని, మిగతా ప్రయివేటు వాహనాలతో పోల్చుకుంటే తక్కువ రేటుకే క్యాబ్‌లు నడుపడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నామన్నారు. కేవలం ముంబయి నగరంలోనే 45వేల క్యాబ్ డ్రైవర్లున్నారు.

జేఎన్‌యూలో ఏడుగురు శాఖాధిపతులు తొలగింపు

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) బుధవారం ఏడుగురు శాఖాధిపతులను, ఒక కో ఆర్డినేటర్‌ను ఉద్యోగాల నుంచి తొలగించింది. జేఎన్‌యూ ఇటీవల 'కంపల్సరి అటెండెన్స్ సిస్టమ్"ను ప్రవేశపెట్టింది. జేఎన్‌యూకు ఉన్న అన్ని కేంద్రాలలోనూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఈ విధానానికి కట్టుబడి లేరన్న కారణంతో ఏడుగురు డిపార్ట్‌మెంట్ హెడ్‌లను, ఒక కో ఆర్డినేటర్‌ను ఉద్యోగాల నుంచి తీసివేసింది. అన్ని కోర్సులకు 75 శాతం హాజరును తప్పనిసరి చేస్తూ డిసెంబరు 2017లో జేఎన్‌యూ మేనేజ్‌మెంట్ ఒక సర్క్యులర్ జారీ చేసిన విషయం తెలిసిందే.

ఎంజిఆర్, అన్నాదురై, పెరియార్ విగ్రహాలకు కాషాయ వస్త్రం

చెన్నై: దేశంలో ఓ వైపు విగ్రహాల విధ్వంసం కొనసాగుతుండగా బీజేపీ కార్యకర్తలు చెన్నైలో మరో వివాదానికి తెరతీశారు. తమిళుల ఆత్మగౌరవ ప్రతీక పెరియార్ రామస్వామి, దివంగత ముఖ్యమంత్రులు ఎంజి రామచంద్రన్, అన్నాదురై విగ్రహాలకు బీజేపీ కార్యకర్తలు కాషాయ రంగు వస్త్రాన్ని కట్టారు. చెన్నైలోని నమక్కల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది వివాదం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఉపాధి హామీ.. 'ప్రజా ఆసక్తి' పథకం

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్‌జీఏ) దేశంలో అత్యంత ప్రజా ఆసక్తి కలిగిన పథకమని.. ఈ పథకం కోసం నిత్యం రూ. 10 లక్షల చెల్లింపులు జరుపుతోందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఉపాధి హామీ పనులకు నిధులు విడుదల చేయడం లేదని, నిధుల లేమితో ప్రజలకు పని దినాలు కల్పించడం సాధ్యం కాదని స్వరాజ్ అభియాన్ అనే ఎన్జీవో అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. కేంద్ర ప్రభుత్వం తరుపున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ సమాధానమిస్తూ.. ప్రపంచంలో ఏ దేశమూ ఒక పథకానికి ఇన్ని నిధులు ఖర్చు చేయడం లేదని, ఆహార భద్రత చట్టం లాగా ఇది చాలా గొప్ప పథకమని జస్టిస్ ఎంబి లోకూర్, ఎన్.వి.రమణలతో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి తెలిపారు. రాష్ట్రాలన్నింటికి నిధులు విడుదల చేశామని, కొన్ని సాంకేతిక లోపాల వల్ల నిధులు ఆగిపోయాయన్నారు. త్వరలోనే అన్ని రాష్ట్రాలకు రావలసిన నిధులు విడుదల చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించిన తదుపరి విచారణను కోర్టు ఈ నెల 19న చేపట్టనుంది.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు పెంచాలి

- ధర్నాలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదానాయక్, బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాఖలోని ఖాళీ పోస్టులన్నింటినీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సూచించారు. కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలకు గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సమ్మె కాలపు 47 రోజుల వేతనాన్ని చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి, పదో పీఆర్‌సీ ప్రకారం వందశాతం గ్రాస్ సాలరీ చెల్లించాలని తెలిపారు. ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, రెగ్యులర్ ఉద్యోగులతో మాదిరిగా వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, క్యాజువల్ లీవులు ఇవ్వాలని అన్నారు. 2018 నుండి అమలయ్యే 11వ పీఆర్‌సీని వర్తింపజేయాలన్నారు. చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణవేణికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు భూపాల్, జే.వెంకటేష్, ఫసీయుద్దీన్, సంజుజార్జి, సరోజ, సుధాకర్, భాస్కర్, కవిత, డాక్టర్ సరిత, జమున, సంగీత, రోజా, అనురాధ తదితరులు భారీగా పాల్గొన్నారు.

అఖిల భారత మహాసభలకు

విస్తృత ప్రచారం : సీపీఐ (ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించబోయే సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని మహాసభల ప్రచార కమిటీ నిర్ణయించింది. ప్రజా సమస్యలను ప్రతిబింబించే విధంగా గోడలపై రాతలు, అమరవీరుల స్మారక పోరాట ఘట్టాలతో బ్యానర్లను ఏర్పాటు చేయాలని ఆ కమిటీ నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో జూలకంటి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పాల్గొని ప్రచార కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మార్చి 24 నుంచి ఇబ్రహీంపట్నం, భువనగిరిల నుంచి రెండు బస్సు జాతాలను ప్రారంభించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. 12 రోజులపాటు ఈ జాతాలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నాయి. అన్ని మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లోని ప్రధాన కూడళ్లను జెండాలు, తోరణాలతో అలంకరించాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ అంశాలపై ప్రజల్ని చైతన్య పరుస్తూ సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జాన్‌వెస్లీ, జంగారెడ్డి, కిల్లె గోపాల్, అడివయ్యతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రచార కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

- అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్‌కు వ్యకాస వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్రవ్యాప్తంగా తునికాకు సేకరణకు టెండర్లను పిలవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు బి.పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సుదర్ఘీంగా చర్చించారు. రాష్ట్రంలోని 469 యూనిట్లల్లోని 28 సర్కిళ్ల పరిధిలో సుమారు 3 వేలకుపైగా కళ్లాలు ఉన్నట్టు చెప్పారు. దాదాపు 10 లక్షల మందికి ప్రత్యక్షంగా, 5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అందుతుందన్నారు. ఈ సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూలీలకు చెతినిండా పని లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం తునికాకు టెండర్లు వేయడం లేదని గుర్తు చేశారు. ఆకును సేకరించడం లేదని చెప్పారు. వెంటనే ప్రభుత్వం తునికాకు సేకరణకు పూనుకోవాలని కోరారు. కూలీలకు బోనస్ సైతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల దోపిడికి కూలీలు బలవుతున్నారని వివరించారు. ఆకు సేకరణపై ఆంక్షలు ఎత్తేయాలని, కట్ట ధరను ప్రభుత్వం నిర్ణయించి ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని కోరారు.

క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ.112.63కోట్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

క్రీడలు, యువజన సర్వీసుల విభాగానికి ఈసారి కూడా నామమాత్రంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. 2018-19 సంవత్సరానికి గానూ మొత్తం రూ.112.63కోట్ల ప్రతిపాదనలు చేశారు. వీటిలో 60.42కోట్లు నిర్వహణపద్దు కింద ప్రతిపాదించగా, ప్రగతిపద్దు కింద రూ.52.21కోట్లు కేటాయించారు. వీటిలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి రూ.57.89కోట్లు కేటాయించగా, యువజన శాఖకు రూ.24.34కోట్లు, మిగిలిన మొత్తం ఎస్‌సీసీ విభాగానికి ప్రతిపాదించారు.

దేశంలో 1500 ఐఏఎస్ అధికారుల కొరత



న్యూఢిల్లీ: దేశంలో 1,496మంది ఐఏఎస్ అధికారుల కొరత ఉన్నదని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గురువారం తెలిపారు. అధికారికంగా దేశంలో 6,500మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సెర్వీసెస్(ఐఏఎస్) అధికారులుండాలి. కానీ 2017 జనవరి 1నాటికి 5,004మంది ఐఏఎస్ అధికారులు మాత్రమే పదవుల్లో ఉన్నారని రాజ్యసభకు రాతపూర్వక సమాధానాన్నిచ్చారు. అంటే దాదాపు 1,496 అధికారుల కొరత ఉన్నదని కేంద్ర పర్సన్నల్ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. 2012 నుండి ప్రతియేటా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ నుంచి భర్తీ చేస్తున్న ఐఏఎస్ అధికారుల సంఖ్య 180కి పెంచామని చెప్పారు.


ఆశల పల్లకిలో...

సంపాదకీయం

టీఆర్ఎస్ పాలనకు నాలుగేండ్లు నిండుకున్నాయి. అందువల్ల రాష్ట్ర బడ్జెట్‌కు ప్రాధాన్యత ఉన్నది. గత నాలుగేండ్లలో చేసిందేమిటన్న ప్రశ్న కూడా ఇప్పుడు చర్చనీయాం శమే! కేవలం రాబోయే ఏడాదికి బడ్జెట్ కేటాయింపులు మాత్రమే చూస్తే నిజాలు నిగ్గుతేల్చలేము. ఎన్నికల సంవత్సరం కావటంతో సాధారణ ప్రజలను ఆశల ఊయల లో ఊపే ప్రయత్నం చేసింది ఈ టల బడ్జెట్. మరోవైపు ఆర్థిక సర్వే నూ పరిగణనలోకి తీసుకోలేదు. వెనుకబడిన జిల్లాల గురించి విస్మ రించారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో గత ఏడాది వరకు ఏం చెప్పినా జనం నమ్మారు. ఇప్పుడు కూడా నమ్మించాలన్నది పాలకుల ఆంతర్యం. పైగా ఆశలు చూపి ఓట్లు రాబట్టాలన్న లక్ష్యమే తప్ప చిత్తశుద్ధి కనబడదు.

ఆత్మహత్యలు ఆపేందుకు చొరవ కూడా ఈ బడ్జెట్‌లో లేదు. ఎకరానికి నాలుగు వేల పెట్టుబడి సాయం చూపించి సంబురపడాలంటున్నారు. రుణ మాఫీ పథకం రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోయింది. ఇది తెలిసి కూడా ఇంకా సమస్య మూలాలలోకి పోయేందుకు పాలకులు సిద్ధంగా లేరు.

ఆదాయాన్ని పెంచి చూపడం, సంక్షేమానికి ఎక్కువ కేటాయింపు లు చేసామని చెప్పుకోవటమే ఇప్పుడూ జరిగింది. నీళ్లు, నిధులు, నియామకాలన్న నినాదమే జనం చెవులలో గింగురుమం టోంది. కోటి ఎకరాలకు నీరు అందిస్తామన్న ప్రభుత్వం ఆశలు చూపడమే తప్ప అమలు లేదు. కేటాయిం పులు భారీగానే ఉన్నాయి. రూ.25వేల కోట్లు మళ్లీ చూపించారు. గత నాలుగు సంవత్సరాలలో కేటాయించిన మొత్తంలో ఖర్చు చేసింది కేవలం 63శాతం మాత్రమే. పైగా రీడిజైన్ పేరుతో ప్రాజెక్టుల అంచనా వ్యయం రెట్టింపు అయ్యింది. అంచనా వ్యయం పెరుగుతూ, ఖర్చు పెట్టేది తగ్గింది. ఈ ఒక్క సంవత్సరంలో కేటాయించిన మొత్తం ఖర్చు చేసినా సాధించే ఫలితం నామమాత్ర మే. కోటి ఎకరాలకు నీరు నినాదం కలగానే మిగిలింది. సాగునీటి ప్రాజెక్టుల కంటే కంపెనీ వ్యవసాయంవైపే బడ్జెట్ మొగ్గుచూపుతున్న ఛాయ లున్నాయి. సంక్షేమం గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పారు. కేటాయింపులూ పెంచి చూపారు. కానీ కోత పెట్టే బడ్జెట్ సంక్షేమ రంగానిదే కావటం గమనించాలి. గత నాలుగు సంవత్సరాలలో దళితులు, గిరిజనుల కోసం చేసిన బడ్జెట్ కేటా యింపులు గానీ, సబ్‌ప్లాన్ నిధులు గానీ ఖర్చు చేసిన తీరు గమనిస్తే ఇదే అర్థమవుతున్నది. కేటాయించిన నిధులలో సగం కూడా ఖర్చు చేయలేదు.




కేవలం 48 శాతం నిధులు ఖర్చు చేసి మిగిలిన నిధులు ఇతర శాఖలకు బదలాయించారు. ఈ 48శాతంలో కూడా తిమ్మిని బమ్మిని చేసే పద్ధతులు అనుసరించినట్టు తెలుస్తున్నది. పౌర సరఫరాల శాఖకు, ఉపాధి హామీ కోసం చేసిన ఖర్చు కూడా ఎస్సీ, ఎస్టీ నిధుల జాబితాలో చూపించారు. నిజానికి వివిధ శాఖల నుండి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం కేటాయించిన నిధులు వారి అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించి ఖర్చు చేయాలి. ఇందుకో సం నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేసి నిధులు అప్పగించాలి. ఇవేమీ చేయకుండానే ఇతర అవసరాలకు వాడుతున్నారు. చట్ట ప్రకారం గత బడ్జెట్‌లో ఖర్చు కాని నిధులు క్యారీ ఫార్వర్డ్ కూడా చేయలేదు. ఎంబీసీల కోసం కేటాయించిన వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదు.

రైతుల గురించి మాట్లాడని రోజు లేదు. కానీ ఆత్మహత్యలు ఆపేందుకు చొరవ కూడా ఈ బడ్జెట్‌లో లేదు. ఎకరానికి నాలుగు వేల పెట్టుబడి సాయం చూపించి సంబురపడాలంటున్నారు. రుణ మాఫీ పథకం రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోయింది. ఇది తెలిసి కూడా ఇంకా సమస్య మూలాలలోకి పోయేందుకు పాలకులు సిద్ధంగా లేరు. పెట్టుబడి సాయం తీసివేస్తే వ్యవసాయరంగానికి కేటాయించిన మొత్తంలో వ్యవసాయం అభివృద్ధికి మిగిలింది పెద్దగా లేదు. విద్యారంగంలో కేజీ టు పీజీ పేరుతో నాలుగేండ్లుగా ఊరించడ మే తప్ప సాధించింది పరిమితమే. ఇప్పుడు కేటాయింపులు కూడా గొర్రెతోక బెత్తెడన్నట్టే ఉన్నాయి. గత బడ్జెట్‌తో పోల్చుకుంటే పెద్దగా పెంచిందేమీ లేదు.

ఇప్పటికే అక్షరాస్యతలో రాష్ట్రం వెనుకబడి ఉన్నది. దేశంలో సగటు అక్షరాస్యత 74శాతం కాగా రాష్ట్రంలో 64శాతమే. వైద్య, ఆరోగ్య రంగానికి కేటాయింపులు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ బకాయిల పేరుతో కార్పొరేట్ వైద్యశాలలు మొండికేస్తున్నాయి.

రోగులు పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించనిదే వైద్యం నిరాకరిస్తున్నాయి. విద్యుత్ రంగంలో అప్పులకు, బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతన లేదు. ఆర్‌టీసీని పట్టించుకోలే దు. ఉపాధి అవకాశాలు పెరగలేదు. సంవత్సరంలో లక్షా ఏడు వేల ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఇప్పుడు నాలుగేండ్లలో ఆర్థిక మంత్రి చెప్పిన లెక్కల ప్రకారమే ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 27,588. పారిశ్రామిక రంగంలో కొత్తగా 3,703 పరిశ్రమలొచ్చాయన్నారు. ఎంతమందికి ఉపాధి లభించిం దన్నది అసలు సమస్య. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పారిశ్రామికవేత్తల సౌకర్యాల మీద ఉన్న శ్రద్ధ ఉపాధి కల్పన మీద లేకపోవడం గమనార్హం. పోలీసు శాఖ మీద మాత్రం ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఆధునీకరణ, సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లు, వాహనాల కొనుగోలు, ఆధునిక సాంకేతిక పరికరాలు అందించటంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పోలీసు శాఖను పటిష్ట పరిచింది. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు కూడా పెంచింది. ఇవన్నీ చేసింది నేరాలు అదుపు చేయడానికే అనుకుంటే పొరపాటే. ఆర్థిక మంత్రి అట్లా చెప్పుకున్నప్పటికీ నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం ఈ కాలంలో నేరాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. ప్రజా ఉద్యమాల మీద ఉక్కుపాదం మోపటంలో మాత్రం ప్రభుత్వం ముందుపీఠిన ఉన్నది.

బడ్జెట్ లెక్కల్లో వాస్తవం ఎంత...?



సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి 1,74,453.83 కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో వ్యవసాయానికి ఎప్పుడూ లేని విధంగా రూ.12,734 కోట్లు, దళితులకు రూ.12,708 కోట్లు, దళితుల సబ్‌ప్లాన్‌కు రూ.16,452 కోట్లు, గిరిజనులకు బడ్జెట్ కింద రూ.8063 కోట్లు, సబ్‌ప్లాన్ కింద రూ.9,693 కోట్లు కేటాయింపులు చూపారు. ఈ కేటాయింపులు చూ స్తుంటే ఆయా వర్గాల ప్రజలు తమ సమస్యలు పరిష్కారమ వుతాయని ఆశించడం సహజం. కానీ, గత బడ్జెట్ వ్యయాల ను పరిశీలిస్తే వ్యవసాయ రంగం, దళిత గిరిజనులు, వెనకబడిన తరగతులవారు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చేసిన కేటాయింపులు ఖర్చు కాలేదని తెలుస్తోంది. వ్యవసాయ ఉ త్పత్తిరేటు దినదినం కునారిల్లుతున్నది. 115 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూ పొందిస్తున్నది. కానీ ఏనాడూ 93లక్షల టన్ను లు దాటలే దు. 2015-16లో 48లక్షల టన్నులే ఉత్పత్తి అయింది. అతి విస్తీర్ణం 46లక్షల ఎకరాలకు పెరిగింది.


ఈ బడ్జెట్ వల్ల రాష్ట్రాభివృద్ధి కాకపోగా, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఉన్న ఉపాధి కోల్పోతున్న ప్రజానీకం వలసలు వెళ్తున్న గ్రామీణ ప్రజలు బీళ్ళుగా మారుతున్న భూములు ఈ బడ్జెట్ వల్ల లబ్ధిపొందే అవకాశం ఉందా? అందువల్ల బడ్జెట్ వ్యయంలో నైతికత అవసరం. ఉత్పత్తి రంగానికి వ్యయం చేయాలి. ఉత్పత్తి రంగం అభివృద్ధి ద్వారానే రాష్ట్రం అభివృద్ధి అవుతుంది. బడ్జెట్‌ను తిరిగి పరిశీలించడం అవసరం.

ఆహారధాన్యాల ఉత్పత్తులకు గిట్టుబాటు రావటం లేదని రైతులు పత్తిపంట వైపు మళ్లారు. కానీ 2017-18 లో 18లక్షల ఎకరాలలో వేసిన బీటీ-3 పత్తి కాతా పూతా లేకుండా దెబ్బతిన్నది. విత్తన ఉత్పత్తి రాష్ట్రానికి విత్తనచట్టం లేదు. వ్యవసాయ బడ్జెట్‌ను పరిశీలిస్తే... రుణమాఫీని కలు పుకొని ఏటా ఆరువేల కోట్లు కేటాయించారు. గత సంవత్స రంతో రుణమాఫీ చెల్లింపు అయిపోయింది. ఈ రుణమాఫీ తీసివేస్తే వ్యవసాయ ప్రణాళికా బడ్జెట్ కేటాయింపు రూ. 1800కోట్లు మాత్రమే. ఈ నిధులతో కోటి 13 లక్షల ఎకరా లలో ప్రభుత్వం పంటలు పండించింది. 2017-18లో వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ.17,734 కోట్లలో 500 కోట్లు పంటల బీమాకు, పెట్టుబడి సహాయ పథకం కింద (ఎకరాకు ఒక పంటకు రూ.4వేలు చొప్పున) రూ.8981 కోట్లు కేటాయింపు చూపారు. ఇవిగాక విత్తన సబ్సిడీ కింద 168 కోట్లు, యాంత్రీకరణ సహాయం కోసం 389 కోట్లు మాత్రమే కేటాయింపు చూపారు. వ్యవసాయం లో యంత్రా ల సామర్థ్యాన్ని పెంచి చిన్న రైతులకు కూడా సహాయం అందేవిధంగా చేపట్టాలన్న ప్రభుత్వ విధానానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవు. పై పద్దులను తీసివేస్తే వ్యవసాయానికి మిగిలింది గత సంవత్సరాలలాగే ప్రణాళికా బడ్జెట్ రూ.2వేల కోట్లలోపు మాత్రమే. ఇందులో ప్రకృతి వైపరీత్యాల పరిహారం కానీ, అధికోత్పత్తి పరిశోధనల కు కానీ కేటాయింపులు లేవు. కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయానికి 120 కోట్లు మాత్రమే కేటాయించారు. వాతావరణ పరిస్థితులు మారిపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. బడ్జెట్‌లో కూడా విత్తన చట్టం గురించి ప్రకటించలేదు. 2015లో చేసిన ముసాయిదా చట్టం నేటికీ పెండింగ్‌లోనే ఉంది. ఇప్పటికీ వ్యవసాయ రం గంపై 52శాతం మంది ఆధారపడి ఉన్నారు. కానీ వ్యవసా య ఉత్పత్తి మాత్రం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 14శాతం దాటడం లేదు. వచ్చే ఖరీఫ్‌లో రైతులు ఏ పంట వేయా లో తెలియని అయోమయంలో ఉన్నారు. విత్తనరంగాన్ని బహుళజాతి సంస్థల కబంధ హస్తాల నుండి తప్పించా లని రైతులు పెద్దఎత్తున కోరుతున్నా ప్రభుత్వానికి మాత్రం పట్టడం లేదు. ఈ 12వేల కోట్లు కేటాయింపు చూపినా వ్యవసాయ బడ్జెట్‌కు మాత్రం రెండువేల కోట్లే మిగులుతాయి. వ్యవసాయ రంగంలో 3,832 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 1200 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక కమిషన్లు ప్రతీ 2,500 ఎకరాలకు ఒక ఏఈఓ ఉండాలని సూచనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అందువల్ల వ్యవసాయాభివృద్ధికి పెద్దగా అవకాశాలు లేవు.

సంక్షేమ చర్యలు

దళితులకు 2018-19లో సబ్‌ప్లాన్ కింద 16,452 కోట్లు, బడ్జెట్ క్రింద 12,708 కోట్లు మొత్తం సుమారుగా 29వేల కోట్లు చూపారు. ప్రస్తుత సంవత్సరంలో సబ్‌ప్లాన్ నిధులు 82శాఖలలో ఖర్చుచేసిన వాటిని క్రోడీకరించి ఈ సబ్‌ప్లాన్‌లో చూపారు. ప్రజలందరికీ ఇస్తున్న సబ్సిడీ బియ్యం, ఉపాధి హామీ చట్టం, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు కూడా ఈ సబ్‌ప్లాన్‌లో కేటాయింపు చూపారు. బడ్జెట్‌లో సిబ్బంది వేతనాలు పోగా 50శాతం వ్యయం చేయలేదు. గత నాలుగేండ్లలో దళితుల సబ్‌ప్లాన్‌కు 40,527 కోట్లు, బడ్జెట్‌లో 25,067 కోట్లు కేటాయించారు. వాస్తవానికి ఇందులో ఖర్చుచేసింది 45శాతం మాత్రమే. ఈ నిధులు వ్యయం చేయడానికి నోడల్ ఆఫీసర్లను నియమించి, రూల్స్ రూపొందించి ప్రత్యేకంగా వారి అభివృద్ధికి ఖర్చు చేయాలని నిర్ణయించినప్పటికీ ఆచరణలో అమలు కావటం లేదు. ఈ సారి కేటాయించిన 29వేల కోట్లు ఆ దారిలోనే వ్యయం చేస్తారు. గిరిజనాభివృద్ధికి సంబంధించి సబ్‌ప్లాన్ కింద 9,693కోట్లు, బడ్జెట్ కింద 8,063 కోట్లు కేటాయించారు. గత నాలుగేండ్లలో గిరిజన సబ్‌ప్లాన్‌కు 24వేల కోట్లు కేటాయించారు. ఇందులో శాఖల ద్వారా ఖర్చు చేసింది 10,220 కోట్లు మాత్రమే. బడ్జెట్ కింద 14వేల కోట్లు కేటాయించగా, వేతనాలు పోగా 60శాతం మాత్రమే ఖర్చు అయ్యింది. దళిత గిరిజనులకు కేటాయింపులు ఘనంగా చూపటం, ప్రత్యేకంగా వారి అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. అలాగే వెనకబడిన తరగతుల వారికి గత సంవత్సరం 5,070 కోట్లు కేటాయించగా, వచ్చే సంవత్సరానికి 5,920 కోట్లు కేటాయించారు. 52శాతంగా ఉన్న వెనుకబడిన తరగతుల వారికి ఈ నిధులు ఏ పద్దులకు ఖర్చు చేస్తారు?

ముఖ్యంగా రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి అత్యంత హీనంగా ఉంది. దేశంలో అక్షరాస్యత 74శాతం కాగా, రాష్ట్రంలో 64శాతం దాటడం లేదు. మహబూబ్‌నగర్, అదిలాబాద్ జిల్లాల్లో మరింత అధ్వాన్నంగా ఉంది. విద్యార్థులు రావడం లేదని 6వేల పాఠశాలలు మూసివేత వైపు కొనసాగుతున్నాయి. ఒకవైపున ప్రభుత్వం కేజీ - పీజీ విద్యావిధానం అంటూ ప్రచారం చేస్తూ, మరో వైపున సాధారణ బాలబాలికలకు విద్యార్హత కల్పించడానికి వనరులు కల్పించడం లేదు. 2018-19 పాఠశాల విద్యకు 10,830 కోట్లు, ఉన్నత విద్యకు 2,025 కోట్లు, సాంకేతిక విద్యకు 422కోట్లు మాత్రమే కేటాయింపు చూపారు. ఇప్పటికి 80శాతం మంది పిల్లలు ప్రయివేటు పాఠశాలలకు వెళ్తున్నారు. హాస్టళ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పుస్తకాల పంపిణీ, మరుగుదొడ్ల ఏర్పాటు సక్రమంగా లేక ప్రభుత్వ పాఠశాలలకు బాలబాలికలు వెళ్ళడం లేదు. విద్యాస్థాయి కూడా తగ్గిపోయింది. రాష్ట్ర అభివృద్ధికి విద్య అభివృద్ధి అత్యం త కీలకం. ఇది పాలకులకు తెలియని విషయం కా దు. ఎక్కడ ప్రజలను అక్కడ ఉంచాలన్నదే లక్ష్యంగా ఉంది. 70 ఏండ్లు గడిచినా అక్షరాస్యత పెంపొందించ డంలో వామప క్షాలు పరిపాలనలో ఉన్న రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రా లలో అక్షరాస్యతపై ఏ ప్రభుత్వాలకూ దృష్టిలేదు. అలాగే వైద్యం, ఆరోగ్యానికి సంబంధించి రూ.7,375 కోట్లు మాత్ర మే కేటాయించారు. ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాలు, డాక్టర్లూ మందులూ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం పీజీ చేసిన డాక్టర్లు తప్పనిసరిగా గ్రామాలకు రెండేండ్లు సేవలు చేయాల్సిన షర తులు తొలగించి గ్రామీణులకు ఆరోగ్య సహకారం అంద కుండా చేస్తున్నారు.



అసలే అంతంతమాత్రంగా ఉన్న పల్లె ల్లో ప్రజల ఆరోగ్యం ప్రభుత్వాల విధానాలతో ఉన్నది ఊడి పోయే స్థితిలో ఉంది. కనీసం క్రీడలకైనా తగినన్ని నిధులు కేటాయించలేదు. యువకులు, యువతులకు ప్రోత్సాహం కల్పించడానికి క్రీడల అభివృద్ధి అవసరం. దీనికి రూ.112 కోట్లే కేటాయించారు. ఈ నిధులు నిర్వాహకులకే సరిపోతాయి.

రాష్ట్ర రుణభారం: మార్చి 2018 నాటికి 1,51,133.21 కోట్లు అప్పులు ఉంటున్నాయి. ఈ అప్పులు మార్చి 2019 నాటికి 1,80,238 కోట్లకు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. బడ్జెట్‌లో కూడా మార్కెట్ రుణాలు కేంద్ర రుణాలు కలిపి 32,300 కోట్లు తెస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టిన దగ్గర నుండి ఇప్పటికి లక్షా 20 వేల కోట్ల రుణభారం పెరిగింది. పాలకవర్గంలోని ప్రతీ నాయకుడు "రుణం లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యం" అని అంటున్నారు. కానీ ఆ తెచ్చిన రుణంతో స్థిరాస్థుల సంపాదన కానీ, ఉత్పత్తిరంగ అభివృద్ధి కానీ జరగడం లేదన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ఇరిగేషన్‌కు కేటాయించిన 25వేల కోట్లు కాకుండా బడ్జెట్‌లో చూపకుండా బ్యాంక్‌ల నుండి, ఆర్థిక సంస్థల నుండి అప్పులు తెచ్చే వ్యయం చేస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసినా, ప్రజలకు ఉపాధి, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు సాగునీటి వనరులు కల్పించ డంపై కేంద్రీకరించాలి. కానీ అనుత్పాదక రంగంపై ఈ రుణాన్ని వ్యయం చేస్తున్నారు. అంతే కాదు, ప్రపంచబ్యాం క్ రుణాలకు కూడా వెంపర్లాడుతున్నారు. ఇప్పటికే వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.600 కోట్లు తెచ్చారు. మరో 2 లక్షల కోట్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రభుత్వం కూడా ప్రపంచబ్యాంక్ వలలో కూరుకుపోయింది. బ్యాంక్ షరతులను పాటించడం వల్ల ఇప్పటికే దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. వాస్తవ రెవెన్యూ ఆదాయాన్ని లెక్కలోకి తీసుకోవాలి. 2016-17లో గ్రాంట్ల కింద 9,752 కోట్లు కాగా, 2018 -19లో 29,042 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో చూపారు. ఉమ్మడి రాష్ట్రానికే ఏనాడూ 12వేల కోట్లకు మించి గ్రాంట్లు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయం చేస్తే అది కేంద్ర ప్రభుత్వం నుండి ఆదాయంగా ప్రకటించాలి. వీటికితోడు మరో 32వేల కోట్ల రుణ ఆదాయాన్ని చూపుతున్నారు. ఈ రెండు ఆదాయాలు వాస్తవ ఆదాయాలకన్నా 50వేల కోట్లు ఆదాయం అదనంగా ఉంటున్నాయి. ఈ ఆదాయాన్ని చూసి సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్నారు. కానీ వాస్తవంగా ఈ ఆదాయం రాకపోవడంతో సంక్షేమ పథకాలకు కోతలు పడుతున్నాయి. ఈ బడ్జెట్ వల్ల రాష్ట్రాభివృద్ధి కాకపోగా, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఉన్న ఉపాధి కోల్పోతున్న ప్రజానీకం వలసలు వెళ్తున్న గ్రామీణ ప్రజలూ బీళ్ళుగా మారుతున్న భూములూ ఈ బడ్జెట్ వల్ల లబ్ధిపొందే అవకాశం ఉందా? అందువల్ల బడ్జెట్ వ్యయంలో నైతికత అవసరం. ఉత్పత్తి రంగానికి వ్యయం చేయాలి. ఉత్పత్తి రంగం అభివృద్ధి ద్వారానే రాష్ట్రం అభివృద్ధి అవుతుంది. బడ్జెట్‌ను తిరిగి పరిశీలించడం చాలా అవసరం. ■

మెయిల్ @ నవతెలంగాణ

ఏది ప్రత్యామ్నాయం...?



కట్టా కార్తీక్


కేసీఆర్ వ్యాఖ్యలతో దేశంలో మూడో ప్రత్యామ్నాయ కూటమిపై చర్చ తన పరిధి పెంచుకుంటోంది. మూడో ప్రత్యామ్నాయ కూటమిపై జరగాల్సిన చర్చ ఈ కూటమిలోకి ఎవరు వస్తారు.. ఎవరు లీడ్ చేస్తారు అని కాదు... అసలు ప్రత్యామ్నాయం అంటే ఏమిటి. దేనికి ప్రత్యామ్నాయం అనే విషయాలపై చర్చ జరగాలి. ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తిని దేశ ప్రధానిగా పెట్టడమో.. ఒక పార్టీ స్థానంలో మరో పార్టీ.. ఒక కూటమి స్థానంలో మరో కూటమిని తీసుకురావడమో ప్రత్యామ్నాయం కాదు.

నేడు ప్రజలను రోడ్డున పడేస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయంగా.. విధానాలకు బదులుగా.. వారికి స్వావలంబన చేకూర్చే విధానాలు, దేశాన్ని కొద్దిమంది చేతుల్లో ఉంచే.. నేటి పాలక సిద్ధాంతానికి బదులుగా.. అందరికీ ఆర్థిక, రాజకీయ సామాజిక సమానత్వాన్ని అందించే సిద్ధాంతం ప్రత్యామ్నాయం. ఈ వైపుగా తమ వైఖరి చెప్పకుండా రాజకీయంగా కాంగ్రెస్, బీజేపీని వ్యతిరేకించే పార్టీలే మూడో ప్రత్యామ్నాయం అంటే అది దేశానికి చేయగల మేలు ఏమీ ఉండదు. ఎన్నికలనాడు ఇచ్చిన హామీలు అమలు జరగవు. అవినీతీ, ఆధిపత్యం, నిరంకుశత్వం ఇవీ కాంగ్రెస్, బీజేపీల మీద వీరు చేస్తున్న ఆరోపణలు. నిజానికి ఈ ఆరోపణలకు నేడు థర్డ్ ఫ్రంట్ అంటున్న కేసీఆర్, మమతా బెనర్జీలాంటివారు కూడా ఏమీ మినహాయింపు కాదు కదా.. ఎన్నికల నాడు ఇచ్చిన హామీల విషయంలో దేశంలో ప్రస్తుతం నరేంద్రమోడీ గతంలో కాంగ్రెస్ ఏ రకమైన మోసపూరిత చర్యలకు పాల్పడినారో.. తెలంగాణలో కేసీఆర్ బెంగాల్లో మమత అదే దారిలో వెళ్తున్నారు. అవినీతి విషయంలో కూడా వీరిపై చాలా ఆరోపణలున్నాయి. రాజకీయంగా ఈ పార్టీలు అనుసరించే విధానాల్లో కాంగ్రెస్, బీజేపీలకు పెద్ద తేడా ఏమీ లేదు. ఈ దేశ సంపదను కొద్దిమంది చేతులకే పరిమితం చేసిన.. ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విషయంలో వీరిభావాలు కాంగ్రెస్, బీజేపీల లాంటివే.

ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయకుండా దేశంలో సామాన్యుడికి మేలు చేయడం సాధ్యం కాదు.. ఉదాహరణకు ప్రస్తుతం దేశంలో విద్య, వైద్యం ప్రయివేటీకరణ చేయబడిన తర్వాత, ఒక మధ్య తరగతి వాడి సంపాదనలో 80శాతం వీటికే ఖర్చు అవుతోంది. వీటివల్ల పెరుగుతున్న ఖర్చుల వల్ల మనిషి సంపాదన కోసం ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఒక సగటు మనిషి తనను తాను, తన బంధాలను, మానవ సంబంధాలను మరిచిపోతున్నాడు. దేశంలో పేదరికం విపరీతంగా పెరిగిపోయింది. తక్కువ మందితో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనే ప్రయివేటీకరణ సిద్ధాంతం ఫలితంగా దేశంలో ఉద్యోగాల శాతం తీవ్రంగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో వీటిని అడ్రస్ చేస్తూ, ఈ సమస్యలకు పరిష్కారం చెప్పగలిగేలా మూడో ప్రత్యామ్నాయం ఉండాలి. కాని మూడో ప్రత్యామ్నాయం పేరు చెబుతున్న కేసీఆర్, మమతల దగ్గర వీటికి సంబంధించిన పరిష్కారాలు లేవు. మతోన్మాద చర్యల వల్ల బీజేపీ దేశానికి తీవ్ర నష్టం చేకూరుస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్‌పై ప్రజలలో నమ్మకం పోయింది. నిజానికి వీటికి ప్రస్తుతం ప్రత్యామ్నా యం అవసరం. ప్రజా స్వామ్యంలో రాజకీయ బహుళత్వం మంచిదికూ డా.. కానీ ప్రత్యామ్నాయం అంటే విధానాపరంగా, సిద్ధాంత పరంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చెప్పేదిగా ఉండాలి.

సెల్ : 8498084025

లెనిన్ అంటే భయమెందుకు?



సిహెచ్.మధు

పిరికోడు శత్రువును డైరెక్టుగా ఎదుర్కోలేక ఫొటోను పిచ్చిగా కొట్టడం, ఫొటోను కాలబెట్టడం, ఫొటోను చింపి వేయడం చేస్తుంటాడు. ఇదొక మానసిక ఆనందం. దీన్ని శాడిజం అంటారో, పాడుయిజం అంటారో తెలియదు గానీ పనికిమాలిన చర్య ఇది. కమ్యూనిజం సిద్ధాంతాలను డైరెక్టుగా ఎదుర్కోలేని బీజేపీ అనుచరులు త్రిపురలో కుర్చీ ఎక్కారో లేదో లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు. కమ్యూనిస్టు ఆఫీసుల మీద దాడులు చేశారు. ఎందు కోసం, ఏ ప్రతిఫలం ఆశించి? ఏ రాజకీయంతో చేసారు. ఏ లాభముంది? అర్థం కాదు. ఒక పిచ్చి గర్వం. కమ్యూనిజం పై ఉన్న ద్వేషాన్ని లెనిన్ విగ్రహాన్ని పడగొట్టి సంతృప్తి పొందారు. అధికారం అహం పెంచుతుందంటారు ఇదేనేమో. విగ్రహాలు పగులగొట్టడం ఒక ఫ్యాషన్‌గా మారిపోవ డం కనిపిస్తున్న వర్తమాన భయానక దృశ్యం. ఈ దృశ్యం చరిత్రను విషాదం చేయటమే గాదు. వర్తమాన తరాన్ని తప్పుదారి పట్టిస్తుంది. వర్తమాన తరం సైద్ధాంతిక రహితంగా, పిరికివారుగా, ద్వేషభావం గల వ్యక్తులుగా తయారయ్యే అవకాశముంది. చరిత్ర వక్రదారిపట్టే అవకాశముంది. లెనిన్ విగ్రహం కూల్చివేత చూస్తుంటే ఒక నాటి మురిపానికి మూల మీసాలకు నిప్పు పెట్టుకున్నట్టుగా ఉంది. ఎన్ని నాళ్లు ఉంటుంది అధికారం? ఎన్ని నాళ్లు ఉంటుంది కుర్చీ? మానిక్ సర్కార్‌లాగా 25 ఏండ్లు పరిపాలించగలరా? ఈ ప్రజాస్వా మ్య వ్యవస్థలో ఎన్నికలు జయాపజయాలు సైద్ధాంతికంగా జరగటం లేదు. మతోన్మాద దృష్టి పెరిగింది. అధికారం మీద ఆశ, అధికారం రాగానే దర్పం పెరుగుతున్నది. రాజకీయమనేది జనాన్ని ఒకటిగా ఉంచింది. సమిష్టి చైతన్యం పెంచాలి. మతోన్మాద రాజకీయాలు దుర్మార్గంగా ప్రజలను బలహీ నం చేస్తూ ప్రజల మధ్య చీలిక తెస్తున్నాయి. విగ్రహాల ధ్వంసం అందులో భాగమే.

ఎంతకాలం బీజేపీ త్రిపురను ఏలగలదు. ఇప్పటిదాకా బీజేపీ కంచుకోటగా ఉన్న రాజస్థాన్ ఉప ఎన్నికలలో ఓటమి చవిచూసింది. యూపీ ఉప ఎన్నికల్లో ఓటమిపాలైంది. గుజరాత్‌లో ఎదురుగాలి వీస్తోంది. బీజేపీపై ముఖ్యంగా నరేంద్రమోడీపై నోట్ల రద్దు, జీఎస్టీ వ్యతిరేకత బలంగా ఉంది.

లెనిన్ విగ్రహం కూల్చివేత, త్రిపురలో కమ్యూనిస్టు ఆఫీసులపై దాడులను గమనిస్తే అన్నింటిలో భయం కనిపిస్తోంది. నరేంద్రమోడీ ప్రధానిగా ఉన్నారనే ధైర్యం హిందూ అల్లరిమూకలకు లేదు. కమ్యూనిస్టులంటే భయం. లెనిన్ అంటే భయం. లెనిన్ అంటే భయమెందుకు? కమ్యూనిస్టులంటే బెదురు ఎందుకు? కమ్యూనిజానికున్న సైద్ధాంతిక భావజాల బలం వారిని భయపెడుతున్నది. కమ్యూనిజం సైద్ధాంతిక భావజాలం ప్రపంచంలోని కార్మిక కర్షకులను ఒకటి చేస్తుందని భయం. కార్మిక, కర్షకులు ఒకటైతే తమ దోపిడీకి అడ్డు ఉంటుందని, ప్రధానంగా తమను ఎదుర్కొనే వారు వారేనని వారి భయం. నిజానికి ఈ దేశంలో లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేది కమ్యూనిస్టులే. ఈ దేశంలోని శ్రామిక జనాన్ని ఒక్కటి చేసేది కమ్యూనిస్టులే. కమ్యూనిస్టు పార్టీకి బలమైన సిద్ధాంతం ఉంది. శాస్త్రీయ సిద్ధాంతాన్ని ఆచరించేవారు కమ్యూనిస్టులు. వ్యవస్థ మార్పు కోసం శాస్త్రీయ సైద్ధాంతిక భావజాలం గల వ్యక్తులు కమ్యూనిస్టులు. అందుకే హిందూ ఉన్మాదులకు, కార్పొరేట్ సామ్రాజ్యానికి, దోపిడీ వ్యవస్థకు పెట్టుబడిదారులకు మత సంస్థలకు, మత పార్టీలకు కమ్యూనిస్టులంటే భయం. లెనిన్ రష్యా విప్లవ సూత్రదారి. మార్క్సిజాన్ని ఆచరణలో నిరూపించిన నాయకుడు. కమ్యూనిజానికి ప్రాణం పోసిన వారు మార్క్స్, లెనిన్. లెనిన్ విగ్రహం కూల్చివేతలో అర్థమేమిటో? విగ్రహాలు కూలగొడితే కమ్యూనిస్టులు త్రిపురలో మళ్లీ అధికారంలోకి రారా? 70 ఏండ్ల స్వాతంత్ర్యంలో కాంగ్రెస్, బీజేపీ, సంకీర్ణ ప్రభుత్వాలు ఎన్నో చూశారు. వారి దృష్టిలో అందరూ ఒకేలా కనిపిస్తున్నారు. అందరూ దొంగలు గా కనిపిస్తున్నారు. ఒక్క మానిక్ సర్కార్ మాత్రం 25 ఏండ్లు ముఖ్యమంత్రిగా త్రిపురను పరిపా లించారు. అది ఎలా సాధ్యమైంది. మంచి పరిపాలన, మంచి వ్యక్తిత్వం, మంచి నాయకత్వం అటువంటి నాయకుడు గల పార్టీ నామమాత్రం ఓట్ల శాతంతో ఓడిపోతే లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడమేమిటి?

లెనిన్ అంటే, కమ్యూనిస్టులంటే హిందూ మతోన్మాదులకు, దోపిడీ రాజకీయ పార్టీలకు, కార్పొరేట్ సామ్రాజ్యానికి భయం. ఎందుకూ? కమ్యూనిస్టులు ప్రశ్నిస్తారు, అన్యాయాలపై పోరాడుతారు, దోపిడీపై తిరగబడతారు. ప్రజలను ఒక్కటి చేస్తారు. ఇదీ వాళ్ల భయం. ఈ భయంతోనే లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు.



ఎంతకాలం బీజేపీ త్రిపురను ఏలగలదు. ఇప్పటిదాకా బీజేపీ కంచుకోటగా ఉన్న రాజస్థాన్ ఉప ఎన్నికలలో ఓటమి చవిచూసింది. యూపీ ఉప ఎన్నికల్లో ఓటమిపాలైంది. గుజరాత్‌లో ఎదురుగాలి వీస్తోంది. బీజేపీపై ముఖ్యంగా నరేంద్ర మోడీపై నోట్ల రద్దు, జీఎస్టీ వ్యతిరేకత బలంగా ఉంది. ఇంకో విషయం చరిత్ర నిరూపించింది. భారత ప్రజలు నియంతృ త్వాన్ని అంగీకరించరు. శక్తివంతమైన ఇందిరాగాంధీనే ఓడించారు. నరేంద్రమోడీ ఎంత? మోడీ నియంతృత్వంలో సామాన్య ప్రజల వ్యతిరేక పరిపాలన కనిపిస్తోంది. ఇందిరాగాంధీ నియంతగా ఉండి కూడా సామాన్య ప్రజలను, మహిళలను ఆకర్షించింది.. బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు లాంటి కొన్ని సంస్కరణలు తెచ్చింది. అటువంటి ఇందిరాగాంధీనే ప్రజలు ఓడించారు. నరేంద్రమోడీ ఎంత? నియంతృత్వాన్ని ప్రజలు అంగీకరించరు.

విగ్రహాల ధ్వంసంతో భావాలు నామ రూపాలు లేకుండా పోతాయా? భారతదేశం ప్రజాస్వామ్య దేశం. ఎప్పుడు ఏ పార్టీ అధికారంలో ఉంటుందో తెలియదు. విగ్రహాల కూల్చివేత ప్రారంభిస్తే దేశంలో ఉన్న అన్ని విగ్రహాలు కూల్చివేతకు గురవుతాయా? దేశం ఉంటుందా? అల్లకల్లో లం అవుతుంది. బలహీనమవుతుంది. చీలిక పేలికలవుతుంది. దళితుల మీద దాడులు, మైనార్టీలపై దాడులు, రాష్ట్రాల అధికారాలు తగ్గించటం, స్వతంత్ర వ్యవస్థలను గుప్పిట్లోకి తెచ్చుకోవటం అవినీతి లింకుల లో ప్రతిపక్షాలను జైలులోకి నెట్టడం, కార్పొరేట్ సామ్రాజ్యపు కాపలాదారుగా మారటం, తమిళనాడు స్వయం వ్యక్తిత్వాన్ని దెబ్బ తీయాలనుకోవడం, విభజన హామీల ను తుంగలో తొక్కి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను మోసం చేయడం, కాశ్మీర్‌లో విపరీత నిర్బంధాన్ని పెంచటం, గౌరీ లంకేశ్, కల్బుర్గి లాంటి మేధావులను హత్య చేయటం, జీఎస్‌టీ పేరుతో సామాన్యుడి నడ్డి విరిచి బతుకు బజారుపాలు చేయడం, కార్పొరేట్ సామ్రాజ్య మొండి బాకీలను మాఫీ చేస్తూ ప్రజలపై వివిధ రకాలుగా భారం మోపటం, ఎన్నో అసంతృప్తులు, ఎన్నో ఆగ్రహాలు, ఎన్నో సాగరాలు ప్రజల గుండెల్లో ఉన్నాయి. ప్రజల గుండెలు మండుతున్న నిప్పు కణికలు. సమయం కోసం చూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో లెనిన్ విగ్రహం కూల్చివేత, పెరియర్ రామస్వామి, అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం ఘటనలు మండుతున్న ప్రజల గుండెలపై పెట్రోల్ పోయటం తప్ప వేరు కాదు. పెరియర్ రామస్వామి, అంబేద్కర్‌లు గొప్ప సంస్కర్తలు. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చినా రాకున్నా ఓట్లు పడినా పడకున్నా పదవి ఆశ లేకపోయినా వాళ్లు ప్రశ్నిస్తారు. వాళ్లు ప్రజలను చైతన్యవంతం చేస్తారు. పోరాటాలు చేస్తారు. ఉద్యమాలు చేస్తారు. స్వేచ్ఛను కాంక్షిస్తారు. సమానత్వాన్ని ప్రేమిస్తారు. ఇందు కోసం వాళ్లు త్యాగాలు చేస్తారు. త్యాగం చేసే గుణం ప్రజలను పోరాటానికి సిద్ధం చేసే గుణం ఇతర పార్టీలకు ఉందా? లేదు. మంచి సమాజం కోసం దోపిడీలేని ప్రపంచం కోసం మార్క్సిజం ఒక శాస్త్రీయ దృక్పథం.. అది ఫలిస్తుంది. ఈ దేశంలో కమ్యూనిజం ఎందుకు పనికి రాదు? కమ్యూనిస్టులు స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం కులాలు, మూలాలు లేని సమాజం, శ్రమ దోపిడీ లేని దేశాన్ని కోరుకుంటున్నారు. ఇటువంటి దేశం కావటం ఇష్టం లేనివారు ఈ దోపిడీ ఇలాగే నిరంతరాయంగా అంతులేకుండా కొనసా గించాలని భావించేవారు, అగ్రకులా ధిపత్యం, హిందూ భావజాలం ఇలాగే ఉండాలని భావించేవాళ్లు ఈ దేశానికి కమ్యూనిజం పనికి రాదంటారు. ఇదంతా కాకిగోల. ఎన్నటికైనా కాకిగోల కోకిల పాట ముందు వట్టిదే!

సెల్ : 9949486122



ఏ తల్లీ బాధపడకూడదని...

తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గొప్పగా ఉండాలనుకుంటారు. వాళ్ళకు కాస్త నలత చేసినా తల్లిడిల్లి పోతారు. అలాంటిది పుట్టడమే సమస్యలతో పుడితే... కన్నవాళ్ళకు అది భరించలేని వేదన. అలాంటి కష్టమే వచ్చింది ఆ తల్లికి. మొదట్లో చాలా ఇబ్బంది పడ్డారు. ఆ బాధ నుంచి కోలుకొని కొడుక్కి మంచి జీవితం చూపించాలని తపించారు. తన కెరీర్‌ని పక్కన పెట్టి కొడుకే సర్వస్వంగా తీర్చిదిద్దారు. తను పడ్డ బాధ ఏ తల్లీ పడకూడదని శారీరక సమస్యలతో ఇబ్బంది పడే పిల్లల కోసం ఉచితంగా ఓ ట్రైనింగ్ సెంటర్ పెట్టారు. ఆ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. ఎలా బతుకుతాడో అనుకున్న తన కొడుకే ఇప్పుడు ఆ సెంటర్ బాధ్యతలు చూస్తుంటే ఆ తల్లి ఆనందం వర్ణనాతీతం. కొడుకును చూసి గర్వపడుతున్న ఆ తల్లి డాక్టర్ రజని. ఆమె చెబుతున్న మరికొన్ని విశేషాలు...

మాది తెనాలి. నాన్న లోక భూమారెడ్డి, అమ్మ గంగుబాయి. మా నాన్న గారు లెక్చరర్. నాన్న జాబ్ రీత్యా ఇటు వచ్చేశారు. నాన్న వనపర్తి, నిజామాబాద్, సంగారెడ్డిలలో పని చేశారు. మేం ముగ్గురం. నేను, అక్క, అన్న. అందరం సంగారెడ్డిలోనే పుట్టాం. మా నాన్నకు చదువంటే చాలా ఇష్టం. మా ముగ్గురిని బాగా చదివించి డాక్టర్లను చేశాడు. నేను ఏడో తరగతి వరకు వనపర్తిలో చదివి, ఆ తర్వాత నుంచి ఇంటర్ వరకు నిజామాబాద్‌లో పూర్తి చేశాను. చదువుకునే రోజుల్లో నా పెండ్లి గురించి మేనత్తలు నాన్నను బాగా ఒత్తిడి చేశారు. కానీ నాన్న ఒప్పుకోలేదు. చదువు అయిపోయిన తర్వాతనే పెండ్లి అని కచ్చితంగా చెప్పేశారు. అప్పట్లో కాకతీయ, గాంధీ, ఉస్మానియా మూడే మెడికల్ కాలేజీలు ఉండేవి. నేను గాంధీలో మెడిసన్ పూర్తి చేశాను. మావారు డాక్టర్ సుదర్శన్ రెడ్డి. ఆయన గాంధీలో నాకు సీనియర్. పెండ్లి తర్వాత మావారు ఆర్మీలో మెడికల్ ఆఫీసర్‌గా సర్వీస్ చేశారు.

మొదట్లో కుంగిపోయాం

పెండ్లి తర్వాతనే పీజీ ఆప్తమాలజీకి ప్రిపేర్ అయ్యాను. సీటు వచ్చే నాటికి నాకు డెలివరీ సమయం. దాంతో మా అక్క వెళ్ళి నా పీజీ సీటు గురించి మాట్లాడి ఆపింది. బాబు పుట్టిన తర్వాత కంటిన్యూ చేశాను. బాబు పుట్టిన సంతోషం కొన్ని రోజులు కూడా నిలవలేదు. దేనికీ స్పందించేవాడు కాదు. మూడు నెలలు వచ్చేసరికి మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నాడని అర్థమయింది. విషయం తెలిసి చాలా బాధపడ్డాం. మొదట్లో కుంగిపోయాం. కానీ మేం పట్టించుకోకపోతే బాబు భవిష్యత్ ఏమిటని ట్రీట్ మెంట్ ఇప్పిస్తూ పీజీని కంటిన్యూ చేశాను.

ట్రీట్‌మెంట్‌పైనే దృష్టి

అప్పుడు సరోజిని హాస్పిటల్‌లో పని చేసేదాన్ని. బాబుకు ఏడాదిన్నర నిండినా నడవలేదు. కనీసం పాకేవాడు కాదు. చాలా భయం వేసింది. తెలిసిన డాక్టర్ ఫిజియో థెరఫీ చేయించమన్నారు. ఇక నా జాబ్ మానేసి నా దృష్టి మొత్తం బాబు ట్రీట్‌మెంట్‌పైనే పెట్టాను. ఫిజియోథెరఫీ చేయించిన తర్వాత కాస్త మూమెంట్స్ వచ్చాయి. కండ్లలో లైట్స్ పడితే మెదడులో కదలికలు వస్తాయంటే రాత్రి పూట వెహికిల్ లైట్స్ పడతాయని బయటకు తీసుకెళ్ళేవాళ్ళం. ఏదైనా నోట్లో పెడితే నమిలేవాడు కాదు అలాగే మింగేసేవాడు. నోరు బాగా తెరిచి చాక్లెట్‌ను లోపలకు దోపేవాళ్ళం. అది అతుక్కు పోయేది. అప్పుడు దాన్ని నమలడానికి ప్రయత్నించేవాడు. అలా డాక్టర్లు చెప్పినవి, మాకు తెలిసిన ట్రిక్స్ అన్నింటినీ ప్రయత్నిస్తే కాస్త డెలవప్‌మెంట్ వుంది.

నమ్మకం వచ్చింది

బాబు భవిష్యత్‌లో తన పనులు తాను చేసుకోవాలి. అలాగే సెటిల్ చేయాలి. అందుకే ఎల్వీ ప్రసాద్ రిహేబిటేషన్ సెంటర్‌లో జాయిన్ అయ్యాం. మొదట భయం భయంగా పోయాం. అక్కడ వాళ్ళు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. బాబు కాస్త మంచిగా అవుతున్నాడనే నమ్మకం కలిగిన తర్వాత ఆఫ్తాలజీ పూర్తి చేశాను. మా డ్యూటీకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా టైమింగ్స్ ఎడ్జెస్ట్ చేసుకుని రిహేబిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్ళేవాళ్ళం. మొదటి నుంచి నాకు గైనకాలజీ చేయాలని కోరిక. ఎల్వీ ప్రసాద్‌లో ట్రైనింగ్ తర్వాత బాబును బేగం పేట స్కూల్లో చేర్పించాం. నేను మళ్లీ జాబ్‌లో చేరి సర్విస్ కాడెట్‌గా గైనకాలజీలో పీజీ పూర్తి చేసి ప్రస్తుతం గైనకాలజిస్టుగా చేస్తున్న.

పరిష్కారం ఉంటుంది

సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోవడం నేర్చుకోవాలి. ఓర్పుగా ఉండాలి. మనకు ఓ సమస్య వచ్చిందంటే కచ్చితంగా పరిష్కారం కూడా ఉంటుంది. కాకపోతే కాస్త ఓపిక ఉండాలి. ప్రశాంతంగా ఆలోచించాలి. ముఖ్యంగా ఇలాంటి పిల్లలను పదే పదే మాటలతో వేధిస్తుంటే ఏమీ చేయలేరు. మరింత కుంగిపోతారు. దేనికీ పనికి రాకుండా పోతారు. అదే వాళ్ళను ప్రోత్సహిస్తూ అన్నీ నేర్పిస్తే సాధారణ పిల్లల వలెనే అన్నీ చేయగలుగుతారు. మరో విషయం ఏమిటంటే మామూలు పిల్లలతో చదువుకుంటే వాళ్ళపై వాళ్ళక నమ్మకం వస్తుంది. సమాజంలో అందరితో కలిసి బతికే ధైర్యం వస్తుంది. వాళ్ళను ఎప్పుడూ వేరేలా ట్రీట్ చేయకూడదు. ఫ్రెండ్లీగా చూసుకోవాలి.

ఉచితంగా ట్రైనింగ్ స్కూల్

మావారు ఆర్మీలో ఉన్నప్పుడే ఫ్రీ సర్వీస్ చేసేవాళ్ళం. ఇక బాబు పుట్టిన తర్వాత ఇలాంటి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఎంత బాధపడతారో అర్థం చేసుకున్నా. మేమంటే డబ్బు ఉంది కాబట్టి పెద్ద హాస్పిటల్లో చేర్పించి ట్రైనింగ్ ఇప్పించాం. కానీ పేద వాళ్ళ పరిస్థితి ఏంటి.. ఆ పిల్లల భవిష్యత్ ఏమిటి? ఆ పిల్లల కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాం. మొదట్లో బ్లయిండ్ స్కూల్ పిల్లల కోసం కొన్ని కార్యక్రమాలు చేసేవాళ్ళం. కొంత డబ్బు డొనేషన్‌గా ఇస్తే సరిపోతుందని నేను అనుకునేదాన్ని. కానీ మావారు మనమే స్వయంగా పిల్లల కోసం ఏమైనా చేద్దామన్నానరు. ఆలోచిస్తే ఓ ఆలోచన వచ్చింది. వనస్థలిపురంలో ఉన్న మా స్థలంలో బిల్డింగ్ కట్టించి 2017లో ఓ స్కూలు ఏర్పాటు చేశాం. దానికి మా బాబు 'సుమంత్ ట్రైనింగ్ సెంటర్' అని మా బాబు పేరే పెట్టాం. సమస్యలతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు ఉచితంగా ట్రైనింగ్ ఇస్తున్నాం. ఓ టీచర్‌ని ఏర్పాటు చేశాం. అవసరమైన పరికరాలు కూడా ఉన్నాయి. మరీ పేద వాళ్ళయితే రానుబోను చార్జీలు కూడా మేమే ఇస్తాం. వారికి భోజనం, ఉండటానికి కూడా సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. అలాగే తల్లిదండ్రులకు ధైర్యం చెబుతాం. ట్రైనింగ్ ఇచ్చేటప్పుడు మాతోపాటు సుమంత్ కూడా వచ్చేవాడు. మేం ట్రైనింగ్ ఇస్తుంటే నేను కూడా ఇస్తా అనేవాడు. ప్రస్తుతం తను కూడా ట్రైనింగ్ ఇస్తున్నాడు. ఆ స్కూలు మొత్తం తనే చూసుకుంటున్నాడు.

అందరూ సపోర్ట్ చేశారు

ఒకప్పుడు మాటలు కూడా సరిగా రాని సుమంత్ మాట్లాడుతూ "మా అమ్మానాన్నలు, స్కూల్లో టీచర్లు, ఫ్రెండ్స్ అందరూ నాకు సపోర్ట్ చేశారు. వాళ్ళ హెల్ప్‌తో నేను అన్నీ నేర్చుకున్నాను. కాన్ఫిడెన్స్ వచ్చింది. పదో తరగతి వరకు నార్మల్ సూల్లోనే చదువుకున్నాను. తర్వాత రాయల్ జూనియర్ కాలేజీలో ఇంటర్



చేశాను. నిజాం కాలేజీలో బీఏ సోషియాలజీ, సైకాలజీ, ఫిలాసఫీ సబ్జెక్టులు తీసుకుని డిగ్రీ పూర్తి చేశాను. మా ట్రైనింగ్ సెంటర్‌లో నేను ట్రైనింగ్ కూడా ఇస్తున్నాను" అంటూ గర్వంగా చెబుతున్నాడు.

సేవకే అంకితం

బాబు చిన్నతనంలో మేం చాలా బాధపడ్డాం. మేము అనుభవించిన కష్టం మరే తల్లిదండ్రులకు ఉండకూడదు. ఆ ఉద్దేశంతోనే ఈ స్కూలు పెట్టాం. 'సుమన్ ట్రైనింగ్ సెంటర్' కు బ్లయిండ్, డెఫ్ అండ్ డెమ్, మెంటల్లీ డిజార్డర్ పిల్లలు వస్తున్నారు. ప్రస్తుతం 14 మంది పిల్లలు ఉన్నారు. సుమంత్‌కు ఓ తమ్ముడు ఉన్నాడు. ప్రస్తుతం డెంటల్‌లో పీజీ చేస్తున్నాడు. ఇంకా నా సర్వీస్ నాలుగేండ్లు ఉంది. రిటైర్ అయిన తర్వాత పిల్లలు, వృద్ధులకు సేవ చేయడానికే నా సమయం మొత్తం కేటాయించాలనుకుంటున్నా. ఈ విషయంలో మావారు అన్ని రకాలుగా సపోర్ట్ చేస్తారు. మా సుమంత్ ట్రైనింగ్ సెంటర్ సేవలు పొందాలనుకునే వారు సంప్రదించవలసిన నెంబర్: 8096817081.

సలీమ

పిప్పళ్ల వెంకటేశ్



శ్రీరంగం గోపాలరత్నం (1939 - 1993)

రేడియో 'మీరాబాయి'

Women of the day

అరశతాబ్దం కింద ఆకాశవాణిలో లలిత గీతాలు విన్న శ్రోతలకు పరిచయం అవసరం లేని పేరు శ్రీరంగం గోపాలరత్నం. ఆమె ఆలపించిన అన్నమయ్య పదాలు, క్షేత్రయ్య పదాలు, మీరా భజన గీతాలు మొదలైనవి ఎంతో ప్రాచుర్యం పొందాయి. శాస్త్రీయ, లలిత సంగీతంలో ఆమె ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది.

విజయనగరం జిల్లా పుష్పగిరిలో గోపాలరత్నం జన్మించారు. ఆమె తల్లిదండ్రులు సుభద్రమ్మ, వరదాచార్యులు. తల్లి మేనమామ అప్పకొండమాచార్యులు ప్రముఖ కవి. ఆయన రాసిన రెండు హరికథలను పాలకొల్లులో జరిగిన సభలో ఆమె పాడారు. అప్పుడు ఆమె వయసు తొమ్మిదేండ్లు. ఇదే ఆమె తొలి ప్రదర్శన. ఆమెలోని సంగీత ప్రతిభను, కంఠంలోని మాధుర్యాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ప్రముఖ సంగీత గురువు కవిరాయని జోగారావు వద్ద చేర్చారు. ఆయనే ఆమె ప్రధాన సంగీత గురువు. ఆ తర్వాత ప్రముఖ సంగీత విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు, శ్రీపాద పినాకపాణి వద్ద కూడా సంగీతాన్ని నేర్చుకున్నారు.

విజయవాడ ఆకాశవాణిలో 1957లో నిలయ విద్వాంసురాలిగా చేరారు. అప్పటి నుండి రెండు దశాబ్దాల పాటు శాస్త్రీయ, లలిత సంగీత బాణీలతో శ్రోతలకు వీనుల విందు చేశారు. ఎందరో ప్రముఖ సంగీత సాహిత్య ప్రముఖులతో కలిసి ఆమె ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు. అన్నమయ్య పద్యాలు, క్షేత్రయ్య పద్యాలు, మీరా భజన గీతాలు ఆమె కంఠం నుంచి జాలువారిన మధురగీతాలు. భామా కలాపం యక్షగానం, నౌకా చరితం ఆమె ప్రతిభకు గీటురాళ్ళు. ఆమెకు అత్యంత కీర్తిని తెచ్చినది సంగీత ప్రధానమైన రేడియో నాటకం 'మీరాబాయి'

రేడియోలో ఆమె గానమాధుర్యం విన్న సినీసంగీత దర్శకులు 'శ్రీ వేంకటేశ్వర వైభవం' చిత్రంలో పాడే అవకాశం ఇచ్చారు. 'ఒక పిలుపులో పిలిచితే పలుకుతావటా' అంటూ ఆమె ఆలపించిన పాట తెలుగువారి ప్రతి ఇంటా మారుమ్రోగింది. ఆ తర్వాత 'బికారి రాముడు' చిత్రంలో పాడిన 'నిదురమ్మా నిదురమ్మా' గీతం బహుళ పాచుర్యం పొందింది.

రేడియో, సినిమాల్లో పాడటంతో పాటు ఆమె సంగీతవిద్వాంసురాలిగా కూడా రాణించారు. 1969లో తిరుమల – తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసురాలిగా సేవలందించారు. 1977లో హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడినప్పుడు 'లలిత కళా పీఠాని'కి ప్రత్యేక అధికారిగా పనిచేశారు. గాన కోకిలగా, సంగీత కళానిధిగా, సంగీత రత్నగా బిరుదులు అందుకున్న ఆమెను 1992లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' గౌరవంతో సత్కరించింది.

ఫ్రిజ్ వాడకంలో జాగ్రత్తలు

- కూరగాయలను కడిగి పూర్తిగా తడి ఆరిన తరువాత ఫ్రిజ్‌లో పెట్టాలి.
- మిరపకాయలను ఫ్రిజ్‌లో పెట్టేముందు వాటి తొడిమలు తీసి పెట్టాలి. లేదంటే ఎక్కువ రోజులు నిలువ ఉండవు.
- ఆహార పదార్థాలు, పాలు, పెరుగు, రుబ్బిన పిండి లాంటివి ఫ్రిజ్‌లో ఉంచినపుడు వాటి మీద మూత పెట్టాలి.
- ఆకుకూరల వేళ్ళను కత్తిరించి తడిపోయేలా బాగా ఆరపెట్టి కట్టలను విడదీసి పాలథిన్ కవర్లో పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- వేడి ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టకూడదు.
- ఫ్రిజ్ తలుపులను ఎక్కువసార్లు తీస్తూవేస్తూ ఉండటం, ఎక్కువ సమయం తెరిచి ఉంచడం వలన ఫ్రిజ్ త్వరగా పాడైపోతుంది.



- అరటిపండ్లను ఫ్రిజ్‌లో ఉంచకూడదు. కండెన్సర్ మీద దుమ్ము పేరుకోకుండా శుభ్రం చేయాలి.
- నెలకు రెండుసార్లు డీఫ్రాస్ట్ చేసి ఫ్రిజ్ లోపల శుభ్రం చేసి, బయట కూడా మరకలు, దుమ్ము లేకుండా తుడవాలి.
- ఫ్రిజ్‌లో పాలు, పెరుగు లాంటివి ఒలికితే స్విచ్ ఆఫ్ చేసి శుభ్రం చేసుకోవాలి.
- ఫ్రిజ్‌లో ఆహారపదార్థాలను కూరగాయలను ఏమాత్రం ఖాళీ లేకుండా ఇరికించి పెట్టకూడదు. లోపల గాలి ప్రవేశించేలా ఖాళీ వుండేలా చూడాలి.
- సువాసన వస్తువులను, పూలను ఫ్రిజ్‌లో పెట్టేటప్పుడు వాటి వాసన బయటకు రాకుండా జాగ్రత్తగా కవర్లో పెట్టాలి. ❄



వేసవిలో తాజాగా...

ఎండ వేడికి చర్మం, శిరోజ సౌందర్యం తగ్గుతుంది. చర్మం రంగు మారి ముడతలు పడుతుంది. మెరిసే కురులు బిరుసెక్కి రాలిపోతూ ఉంటాయి. ఈ సౌందర్య సమస్యలకు చెక్ పెట్టాలంటే వేసవిలో కొన్ని బ్యూటీ టిప్స్ తప్పక పాటించాలి.

ముఖం కడగాలి: మైల్డ్ క్లీన్సర్‌తో రోజుకి కనీసం 4 సార్లు ముఖం శుభ్రం చేసుకోవాలి. వారానికి రెండుసార్లు జెల్ బేస్డ్ స్క్రబ్‌తో ముఖం రుద్దుకుంటే మృత కణాలు, సన్ ట్యాన్ తొలగిపోతాయి. ఈ ఎక్స్‌ఫాలియేట్ వల్ల చర్మం తాజాగా తయారవుతుంది.

జుట్టుకు నూనె: వెంట్రుకల కుదుళ్లకు నూనె పట్టించి గంట తర్వాత స్నానం చేయాలి. వారానికి రెండుసార్లు తల స్నానం తర్వాత కండిషనర్ అప్లై చేయాలి. ఇలా చేస్తే ఎండాకాలం వేడి నుంచి వెంట్రుకలకు రక్షణ దొరుకుతుంది.

ఫేస్ ప్యాక్: పెరుగు, గంధం పొడి, టమోటో రసం, కలబంద గుజ్జు... వీటితో ఇంట్లోనే ప్యాక్ తయారు చేసుకుని అప్లై చేసుకోవాలి. ఈ ప్యాక్ చర్మాన్ని శుభ్రపరిచి మెరపునిస్తుంది.

ఫేషియల్ బ్లాటింగ్ పేపర్, సన్‌స్క్రీన్ లోషన్, లిప్ బామ్ పర్సులో వెంట తీసుకెళ్లాలి. వేడికి చర్మం జిడ్డుగా తయారైతే బ్లాటింగ్ పేపర్ అద్దుకోవాలి. ప్రతి నాలుగు గంటలకోసారి సన్‌స్క్రీన్ అప్లై చేయాలి. పెదవులు పొడిబారకుండా లిప్ బామ్ అప్లై చేయాలి. ధూళిని తుడవటానికి వెట్ వైప్స్ ఉపయోగించాలి. ❄

ఆదా చేయడానికి చక్కటి మార్గాలు...



నెల నెల వచ్చే ఆదాయాన్ని, ఖర్చుల మధ్య సమతుల్యతను పాటించే వారు బాగా పొదుపు చేయగలరని నిపుణులు చెబుతున్నారు. మీరు ఎంత సంపాదిస్తున్నారు అనేది విషయం కాదు. ఎక్కువ ఇబ్బందులు పడకుండా ఎంత ఆదా చేస్తున్నారనేది ముఖ్యం. ఎద్దైనా సరే ముందు ఒక బడ్జెట్ తయారు చేసుకొని ఖర్చుల ప్రణాళిక వేసుకోవాలి. లేదంటే డైరీలో రాసుకోవడం వంటివి చేయాలి. సాధారణంగా ప్రతి కుటుంబంలో చిన్న చిన్న ఖర్చులను లెక్క చేయం. కానీ కొంతకాలానికి అవే పెద్ద మొత్తం అయి ఇబ్బంది పెడతాయి. చిన్న ఖర్చులను దృష్టిలో ఉంచుకొని డబ్బుని ఎలా ఆదా చేయాలో తెలుసుకుందాం...

సరుకుల జాబిత...

ప్రతినెల కావలసిన సరుకుల జాబితాను తయారు చేసుకోవాలి. బడ్జెట్ ఎంత అవుతుందో రాసుకోవాలి. లేదంటే అవసరం లేని వస్తువులను కూడా కొంటారు. ఇలా ప్రతినెల సరుకుల జాబితాను తయారు చేసుకోవడం వల్ల అనవసర వస్తువులను కొనకుండా ఉండొచ్చు.

షాపింగ్ చేసే ముందు...

ఆన్‌లైన్ లేదా విడిగా కొనే వాటికి కొంత తేడా ఉంటుంది. కొనాలి అనుకునే వస్తువులను ఏమైన ఎక్కువ తగ్గింపు ధరలు ఉన్నాయేమో పోల్చి చూసుకోవాలి. ఉదాహరణకు మీరు ఒక మొబైల్ కొనాలి అనుకుంటే ఒక ధర మాత్రమే కాకుండా ఆన్‌లైన్‌లో రివ్యూ కూడా చూసుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులపై ఆన్‌లైన్‌లో అప్పుడప్పుడు ఆఫర్లు వస్తుంటాయి. వాటిని వినియోగించుకుంటే మంచిది.

మందులపై ఆదా...

దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అవసరమైన మందుల జాబితాను రాసుకొని, జనరిక్ మందులు వాడటం మంచిది. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జనరిక్ మందుల సరఫరాలను ప్రారంభించారు. వీటిని సైతం కొనుగోలు చేసి మీ బిల్లును తగ్గించుకోవచ్చు.

విలాసాలకు...

విశ్రాంతి కావాలంటే, డిన్నర్ లేదా మూవీకి వెళ్ళాలి అనుకుంటే గాబరా పడి వెళ్ళొద్దు. ఏ రెస్టారెంట్లలో తగ్గింపు ఆఫర్లు ఉన్నాయో సమాచార జాబితాను వెబ్ సైట్లలో చూడాలి. మీరు సినిమా టికెట్లు బుక్ చేసే ముందు ఆ ఆపరేటర్ ఏమైనా కార్డ్స్ పై ఆఫర్లు పెట్టారేమో తెలుసుకుంటే మంచిది.

ఆఫర్లు...

పండుగ సీజన్లలో ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. పండుగ సమయాలలో ఎలక్ట్రానిక్ వస్తువులపై చాలా పెద్ద ఆఫర్లు ఉంటాయి. కొన్ని వస్తుమార్పిడి ఆఫర్లు కూడా ఉంటాయి. అయితే ఏదైన పెద్ద వస్తువు కొనే ముందు నాణ్యతకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎందుకంటే దాని కోసం మళ్ళీ మళ్ళీ ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. ❄

పుట్టెడు దుఃఖంలోనూ టెన్త్ పరీక్షకు హాజరు

- తల్లిదండ్రుల మృతి..
- పరీక్ష హాల్లో పిల్లలు

నవతెలంగాణ-చిగురుమామిడి/యాలాల/ సదాశివనగర్

"రేపటి నుంచి పరీక్షలు బిడ్డా.. బాగా చదువుకో.. ఈ పరీక్షలు మీ జీవితానికి ఎంతో ముఖ్యం.." అని చెప్పిన తల్లిదండ్రులు గుండెపోటుతో మృతిచెందారు.. ఈ క్రమంలో పుట్టెడు దుఃఖంలోనూ మనోధైర్యాన్ని కూడగట్టుకుని పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు ముగ్గురు విద్యార్థులు. ఈ ఘటన కరీంనగర్, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో జరిగాయి. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పెనుకల బాలయ్య(46)కు ఏడాది కిందట ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటు వచ్చింది. ఆ సమయంలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అయితే, బుధవారం రాత్రి బాలయ్యకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. కొడుకు సాయితేజ చిన్న ముల్కనూర్ ఆదర్శపాఠశాలలో పదోతరగతి చదివాడు. గురువారం వార్షిక పరీక్ష. ఒకవైపు తండ్రి మరణం.. మరోవైపు తన భవిష్యత్‌ను నిలబెట్టే పదోతరగతి పరీక్ష కావడంతో సాయితేజ పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష అనంతరం తండ్రి దహన సంస్కారాలు నిర్వహించాడు. బాలయ్య నేత్రాలను హైదరాబాద్ ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్య కళాశాల వైద్యులు సేకరించారు.

వికారాబాద్ జిల్లా యాలాల మండలం నాగసమందర్ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులకు కుమార్తె, కొడుకు ఉన్నారు. వ్యవసాయమే వీరికి జీవనాధారం. గత నెల 18న కుమార్తె వివాహం చేశారు. అప్పులు బాగా పెరిగాయి. మోహన్‌రెడ్డి బుధవారం ఉపాధి హామీ పనికి వెళ్లి ఇంటికి వచ్చాడు. అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు తాండూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం తాండూరు పట్టణంలోనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. కొద్ది సేపటికే మళ్లీ గుండెపోటు రావడంతో మోహన్‌రెడ్డి మృతిచెందాడు. ఇంత బాధను దిగమింగుకుని మోహన్‌రెడ్డి కొడుకు శ్రీనివాస్‌రెడ్డి అగ్గనూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు.

సదాశివనగర్‌లో..

ఉదయమే కుమార్తె పరీక్షకు వెళ్లేందుకు సిద్ధం చేసింది తల్లి.. ఇదే సమయంలో దుబాయ్‌లో ఉన్న భర్తతో ఫోన్‌లో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. అప్పటి వరకు తన భవిష్యత్తు గురించి అన్ని జాగ్రత్తలు చెప్పిన తల్లి విగత జీవిగా పడి ఉండటంతో ఆ బాలిక తట్టుకోలేకపోయింది. అయినా, తల్లి మాటలను గుర్తు చేసుకుని టెన్త్ పరీక్ష రాసింది. ఈ హృదయ విదారకర ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలో గురువారం జరిగింది. సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన రుస్కాన్-అయూబ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. బతుకు దెరువు కోసం అయూబ్ దుబాయ్‌కు వెళ్లగా రుక్సానా పిల్లలతో ఇక్కడే ఉండి వారిని చదివిస్తోంది. పది రోజులుగా అనారోగ్యంగా ఉన్న రుక్సానా గురువారం భర్తతో ఫోన్లో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇంట్లో తల్లి మృతదేహం ఉండగానే.. పెద్ద కుమార్తె ఇర్ఫానా పరీక్ష హాజరై వచ్చింది.

కంప్యూటర్ బేసిక్ కోర్సులకు 'సమ్మర్ క్యాంపు' : నియోకర్సర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నియోకర్సర్ కంప్యూటర్ బేసిక్ కోర్సులపై 'సమ్మర్ క్యాంప్' నిర్వహిస్తుందని డైరెక్టర్ బి బిక్షమయ్య, అడ్మిన్ మేనేజర్ పిఎన్‌మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంప్ ఈ నెల 20 నుంచి ప్రారంభం చేస్తున్నట్టు తెలిపారు. దీంతోపాటు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని వివిధ కంప్యూటర్ కోర్సులను నేర్చుకొనవచ్చునన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, కోర్సుల్లో చేరేవారికి ఎటువంటి వయోపరిమితి లేదన్నారు. ఆసక్తి గలవారు తమ పేర్లను 9494864040, 9494862121, 9494860044 నెంబర్లకు ఫోన్ నమోదు చేసుకోవాలని కోరారు. లేకపోతే నేరుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని నియోకర్సర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పేదలకు మేలు చేయని ప్రభుత్వ విధానాలు

బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

- పాలకుల విధానాల వల్లే బీసీల వెనుకబాటు : గద్దర్

నవతెలంగాణ - చౌటుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పేదలకు ఏమాత్రం ఉపయోగపడేలా లేవని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవాలమ్మనాగారం గ్రామంలో నల్ల అదృష్ట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజాగాయకులు గద్దర్‌తో కలిసి ఆవిష్కరించారు. కాన్షీరాం చిత్ర పటానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా 30 పార్టీలతో బీఎల్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో 17 మందితో మంత్రివర్గం ఉంటే అందులో ఏడుగురు మాత్రమే 93శాతంగా ఉన్న జనాభాకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్నారు. 40వేల జనాభా ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సీఎంగా, ముగ్గురు మంత్రులు ఉంటే ఏ విధంగా సామాజిక న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. ఓటు హక్కును వినియోగించుకొని 52శాతంగా ఉన్న బీసీలు అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా మహిళా వ్యతిరేకిగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బహుజనులకు బీఎల్ఎఫ్ తరపున 60 నుంచి 65 స్థానాలు ఇస్తామనీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు ఆ దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. బహుజనులంతా లెఫ్ట్‌ఫ్రంట్‌ను బలపర్చాలని కోరారు.



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

గద్దర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొరల పాలనకు చరమగీతం పాడాలన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటికో నల్లా, ఉద్యోగం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీసీ వర్గాల ప్రజలు పాలకుల విధానాల వల్ల వెనుకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులను ఓడించి బహుజనులను గెలిపించే విధంగా ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఆటపాట ద్వారా వివరించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. వడ్డేపల్లి నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సర్పంచ్ వర్కాల మహేందర్‌గౌడ్, ఎంపీటీసీ మల్కాపురం నర్సింహా, లింగంగౌడ్, రమేశ్, మల్కాపురం పరమేశ్ పాల్గొన్నారు.

నకిలీ హాల్‌టికెట్లని టెన్త్ పరీక్షకు నిరాకరణ

- ఏడ్చుకుంటూ వెళ్లిన 16 మంది విద్యార్థులు
- మరో ఇద్దరి హాల్‌టికెట్లపైనా తప్పుగా అదే పాఠశాల పేరు
- తమ దృష్టికి రాలేదు: డీఈవో

నవతెలంగాణ - హయత్‌నగర్

ఆ పాఠశాలకు అనుమతి లేదు.. అది తెలియని తల్లిదండ్రుల తమ పిల్లలను చేర్పించారు. అధికారులూ పట్టించుకోలేదు. తీరా పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థుల హాల్‌టికెట్లు నకిలీవని, ఆ పాఠశాల విద్యాశాఖ నుంచి అనుమతి పొందలేదని పరీక్ష రాయనివ్వలేదు. పాఠశాల యాజమాన్యం తప్పిదం వల్ల 16 మంది విద్యార్థులు ఏడుస్తూ వెనుదిరిగారు. వీరితోపాటు మరో పాఠశాలకు చెందిన ఇద్దరి హాల్‌టికెట్లపై కూడా ఆ అనుమతిలేని పాఠశాల పేరే పడటంతో వారినీ రాయ నివ్వలేదు. వివరాల్లోకెళ్తే... హైదరాబాద్‌లోని ఆర్‌కేపురం వద్ద శ్రీద్వారకామయి ప్రయివేటు పాఠశాల ఉంది. ఇందులో పదో తరగతి 16 మంది విద్యార్థులు చదివారు. పది పరీక్షలు గురువారం ప్రారంభం కాగా, ఆ పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఆన్‌లైన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి ఇచ్చింది. అయితే, ఆ పాఠశాలకు అనుమతి లేదని, పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులను అనుమతించొద్దని డైరెక్టరేట్ ప్రభుత్వ ఎగ్జామ్స్ నుంచి జీ మెయిల్ ద్వారా ఆయా సెంటర్లకు మెసేజ్ వచ్చింది. దాంతో ఆయా పాఠశాల నిర్వాహకులు ఆ విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించలేదు. ఖంగుతిన్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులను అడుగుదామని వెళ్తే ఆ పాఠశాలను వేరేవారికి అమ్మినట్టు చెప్పారు. దాంతో విద్యార్థులు ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లారు.



అలాగే, మరో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల హాల్‌టికెట్‌లో దొర్లిన తప్పిదం వల్ల వారూ పరీక్ష రాయలేకపోయారు. సరూర్‌నగర్‌లో ఉండే రోజ్ పాఠశాల స్థానంలో శ్రీద్వారకామయి అని పడటంతో 1823103871 గల తెగిలికర్ అర్జున్, 1823103969 హాల్‌టికెట్ కలిగిన అశ్విన్‌కుమార్‌ను కూడా పరీక్షకు నిర్వాహకులు అనుమతివ్వలేదు. వీరి సెంటర్ మన్సూరాబాద్ లోని ప్రభుత్వ పాఠశాలలో పడింది. పిల్లల తల్లిదండ్రులు రోజ్ పాఠశాల యాజమాన్యాన్ని నిలదీస్తే రేపటి నుంచి మిగతా పరీక్షలు తప్పకుండా రాసేలా చూస్తామని చెప్పడం విశేషం. పాఠశాలకు అనుమతిలేని విషయంపై రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిని 'నవతెలంగాణ' వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని చెప్పారు. అసలు ఫీజులు కట్టని, అనుమతి లేని పాఠశాలకు హాల్ టికెట్లు ఎలా డౌన్‌లోడ్ అయ్యాయో తెలియడం లేదన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

'రజకులను వంచిన టీఆర్ఎస్ సర్కారు'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రజకులకు తగిన బడ్జెట్ కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం రజకులను వంచిందని తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం విమర్శించింది. రాష్ట్రంలో 18 లక్షల జనాభా కలిగిన రజకుల సంక్షేమానికి కేవలం రూ 200 కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించింది. ఈమేరకు గురువారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది కేటాయించిన రూ 250 కోట్లలో రూ 7 కోట్లు మాత్రమే విడుదల చేసిందని పేర్కొన్నారు. రజకులకు రుణాలు కూడా మంజూరు చేయలేదన్నారు. వృత్తిని నమ్ముకున్న రజకులకు ఆధునిక వాషింగ్ మిషన్లు అందిస్తామని, ఇచ్చిన వాగ్దానం గడపదాటలేదన్నారు. నాలుగువేల రజక సొసైటీలు ఫెడరేషన్లకు అనుబంధమైన రుణాల కోసం ఎదురు ఎదురు చూస్తున్నప్పటికీ ఆకర్షించే పథకాలతో మభ్యపెట్టి సన్మానాలు, పాలాభిషేకాలు అభినందన సభలు, వాషింగ్ మిషన్లు ప్రదర్శనలతో కాలయాపన చేస్తూ నమ్మించి మోసం చేసిందన్నారు. గతేడాది ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ వెయ్యి కోట్లు కేటాయించి చైర్మెన్‌ను నియమించి అత్యంత వెనుకబడిన కులాలు వారిని అబ్బురపరించిందని, ఏడాది గడుస్తున్నా ఎంబీసీ జీవితాల్లోకి ఏయే కులాలు వస్తాయో, ప్రకటించకుండా మరోమారు రూ వెయ్యి కోట్లు కేటాయించి ఎంబీసీలను మోసగించడానికి ప్రయత్నిస్తోందన్నారు.

అప్పుల ఊబిలోకి రాష్ట్రం..

- బడ్జెట్‌పై సీపీఐ (ఎం)
- అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ సర్కారు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపిందని సీపీఐ (ఎం) విమర్శించింది. ఏటా రూ.32 వేల కోట్ల మేర అప్పులు చేస్తున్న ప్రభుత్వం.. ఈ యేడాది మార్చి నాటికి రూ.1.51 లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపింది. ఇది రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని.. ముమ్ముందు ప్రజలపై మరిన్ని భారాలు పడనున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు అంతంతమాత్రంగానే నిధులను కేటాయించారని తెలిపారు. అందువల్ల అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్‌లో వాటిని పొందుపరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలకు రూ.5,919 కోట్లే కేటాయించారని పేర్కొన్నారు. మరోవైపు గత నాలుగేండ్లలో ఎస్సీలకు కేటాయించిన రూ.40,527 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు, రూ.25,067 కోట్ల బడ్జెట్ నిధుల్లో 60 శాతం కూడా ఖర్చు చేయలేదని వివరించారు. గిరిజనుల పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదని పేర్కొన్నారు. సబ్‌ప్లాన్, బడ్జెట్‌లో కలిపి నాలుగేండ్లలో రూ.37 వేల కోట్లను కేటాయించారు.. కానీ వీటిని ఖర్చు చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల వారితో చర్చించి.. బడ్జెట్‌లో పొందుపరచాలని తమ్మినేని కోరారు.

పట్టణాలకు అరకొరే.. -పట్నం

రాష్ట్ర బడ్జెట్‌లో పట్టణాల అభివృద్ధి, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమ రంగాలకు అరకొరగానే నిధులను కేటాయించారని 'పట్నం' రాష్ట్ర అధ్యక్షులు కె.వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి డిజి నర్సింహారావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇలాంటి నామమాత్రపు కేటాయింపుల వల్ల బంగారు తెలంగాణ సాధ్యం కాదని పేర్కొన్నారు.



ఏజెన్సీకి రవాణా సౌకర్యాలు మెరుగు

మణుగూరు-కొల్హాపూర్ రైలు ప్రారంభోత్సవంలో ఎంపీలు

నవతెలంగాణ-మణుగూరురూరల్

మణుగూరు-కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా ఏజెన్సీ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్ అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. త్వరలోనే కొవ్వూరు లైన్‌ను కూడా సాధిస్తామన్నారు. పాండురంగాపురం-భద్రాచలం రైల్వే లైనుకు అనుమతులు ఇవ్వకుండా బీజేపీ అడ్డుకుంటోందని అన్నారు. త్వరలోనే మణుగూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును కూడా సాధిస్తామని చెప్పారు. మణుగూరు -కొల్హాపూర్ రైలు ఐదు రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. దీని ద్వారా ఈ ప్రాంతం వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఏడీఆర్ఎం శైలేంద్రసింగ్, డీసీఎం సుఏస్ దీపక్ పాల్గొన్నారు.

కెనాల్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు

నవతెలంగాణ-వర్ని

నిజాంసాగర్ కెనాల్‌లో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో గురువారం జరిగింది. వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణ పురానికి చెందిన సోయల్(17), ప్రభురాజ్(18) ఇంటర్ పరీక్షలు రాశారు. బుధవారం పరీక్షలు ముగియడంతో గురువారం మరో ముగ్గురు స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు నిజాంసాగర్ ప్రధాన కెనాల్‌కు వెళ్లారు. ఐదుగురు కెనాల్‌లో దిగి స్నానం చేస్తున్న క్రమంలో సోయల్, ప్రభురాజ్ ఇంకొంత ముందుకు వెళ్లారు. వీరిద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోయారు. మొగతా వారికి కూడా ఈత రాకపోవడంతో రక్షించాలని కేకలు వేశారు. సమీపంలో ఉన్న పశువుల కాపరులు ముగ్గురినీ బయటకు లాగారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం జాలర్లు వెతుకుతున్నారు.

ఎన్ఎస్‌టీఎస్ఈ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సొంతం

నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్(ఎన్‌టీఎస్ఈ) లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటారు. యునిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది నిర్వహించే ఈ పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు10లోపు 29 టాప్ ర్యాంకులను సాధించారు. అలాగే 50లోపు టాప్ ర్యాంకుల్లో 189 ర్యాంకులు, 100లోపు ర్యాంకుల్లో 387 జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 2, 4, 7 తరగతుల్లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌ను నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షకు జాతీయ స్థాయిలో 15లక్షల వరకు విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ అభినందించారు.

అసెంబ్లీ వద్ద పీడీఎస్‌యూ ఆందోళన

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ నేతలు గురువారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు, విద్యార్థి సంఘం నేతలకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేసి, గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, బి రాము మాట్లాడుతూ...రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని అనేక కమిషన్‌లు, నివేదికలు సూచిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.16వేల కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటన్నారు. అరెస్ట్ అయిన వారిలో సంఘం రాష్ట్ర నాయకులు సౌందర్య, నాగేశ్వర్‌రావు, గణేశ్, రాకేశ్, భాస్కర్, సంధ్య తదితరులున్నారు.

కార్మిక వ్యతిరేక బడ్జెట్ : సీఐటీయూ

బడ్జెట్‌లో కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం సాయిబాబు విమర్శించారు. ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని అభిప్రాయపడ్డారు. కార్మిక సంక్షేమానికి, స్కీం వర్కర్ల వేతనాల కోసం, అసంఘటిత రంగ కార్మికుల కోసం ఏ మాత్రం నిధులు కేటాయించలేదని అన్నారు. కార్మిక, ఉపాధి శిక్షణ శాఖకు గతేడాది కంటే 29 కోట్లు తక్కువగా కేటాయించారని తెలిపారు. మూతపడ్డ బిల్ట్, సిర్పూర్ పేపర్ మిల్లులు, నిజాం షుగర్స్ పరిశ్రమలను తెరిపించి, కార్మికుల ఉపాధి కోసం ఒక్క పైస కూడా కేటాయించలేదని విమర్శించారు.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్: ఎస్ఎఫ్ఐ

2018-19 సంవత్సరానికి సంబంధించి కేవలం రూ.16,101 కోట్లు మాత్రమే కేటాయించడం విద్యారంగాన్ని విస్మరించడమేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పేర్కొన్నది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం నాగేశ్వర్‌రావు, కోట రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పిందనీ, కానీ దానికి అనుగుణంగా నిధులు మాత్రం కేటాయించ లేదని విమర్శించారు.



కోఠారి సిఫారసులు అమలు చేయాలి: ఏఐఎస్ఎఫ్

కోఠారి సిఫారసుల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం వేణు, శివరామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ ప్రతుల దహనం కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

విద్యకు అరకొర నిధులే: టీపీటీఎఫ్

బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులే కేటాయించారని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండల్‌రెడ్డి, ఎం శ్రీనివాసులు తెలిపారు. 2.70లక్షల మంది చదువుతున్న గురుకులాలకు రూ.2,823కోట్లు కేటాయిస్తే, 58.66లక్షల మంది చదివే సర్కారు పాఠశాలలకు రూ.10,830కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు.

కేజీని వదిలేసిన బడ్జెట్: టీఎస్‌యూటీఎఫ్

నాలుగేండ్ల నుంచి కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పిన సర్కార్, ప్రస్తుత బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే చేయలేదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి అన్నారు. మానవ వనరుల అభివృద్ధిలో కీలకమైన విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత కొరవడిందని చెప్పారు. పాఠశాల విద్యాశాఖకు గతేడాది కంటే 0.6శాతం నిధులు తక్కువ అని పేర్కొన్నారు.

నామమాత్రపు కేటాయింపులు: ఎస్‌టీయూటీఎస్

నామమాత్రపు కేటాయింపులతో విద్యారంగాన్ని ఎలా బలోపేతం చేస్తారని ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి భుజంగరావు, సదానందంగౌడ్ అన్నారు. కోఠారి కమిషన్ 30శాతం కేటాయించమంటే చెప్పినా పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు.

విద్యారంగానికి నిరాశే: పీఆర్‌టీయూటీఎస్

బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యత ఇవ్వడం హర్షనీయమేననీ, కానీ విద్యారంగానికి మాత్రం మరోసారి నిరాశ మిగిల్చారని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యకు ఉమ్మడి రాష్ట్రంలో 13శాతం కేటాయిస్తే, ఈసారి పదిశాతం కూడా దాటలేదని చెప్పారు.

విద్యారంగాన్ని విస్మరించారు: టీటీఎఫ్

బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచంద్రం, రఘునందన్ విమర్శించారు. కేజీ టు పీజీ ఉచిత విద్యకు తగిన నిధులు కేటాయించలేదని అన్నారు.

సురేశ్‌ది కులదురహంకార హత్యే

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తొంబారావుపేట దళిత యువకుడు సురేశ్‌ది కులదురహంకార హత్యేనని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర, జిల్లా ప్రజాసంఘాల నాయకులు గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. హత్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సురేశ్ కులదురహంకార హత్య ఉదంతాన్ని తప్పుదోవ పట్టించడానికే వివాహేతర సంబంధంగా ప్రచారం చేస్తున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన నల్ల గంగారెడ్డి, సంతోష్‌రెడ్డే నిందితులన్నారు. తన బిడ్డ వివాహం జరగకపోవడంతో సురేష్ కారణమని అనుమానించి మాటువేసి వేట కొడవళ్లతో హత్య చేశారన్నారు. గతంలో ఈ అనుమానంతోనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సురేష్‌కు, గంగారెడ్డి కుమార్తెకు ఎలాంటి సంబంధమూ లేదని పోలీసులకు వివరణ ఇచ్చారని తెలిపారు. అయినా, సురేష్‌ను చంపేశారని, అతని కుటుంబానికి అండగా ఉండటానికి, పెత్తందారీ దురహంకారాన్ని ప్రశ్నించడానికి గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 9 జిల్లాల్లో 17 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతో పాటు హత్యానేరం కింద కేసు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి తిప్పారపు సురేష్, జిల్లా కన్వీనర్ అతిక్ తదితరులు ఉన్నారు.


దీక్ష విరమించిన కోమటిరెడ్డి, సంపత్

- నిమ్మరసమిచ్చిన జానా, ఉత్తమ్, భట్టి, షబ్బీర్
- తెలంగాణ విలన్‌ను తరిమేస్తామని హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు విలన్‌లా మారిపోయారని, ఆయనను రాష్ట్రం నుంచి తరిమేస్తేనే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమారెడ్డి చెప్పారు. తెలంగాణకు అసలు విలన్లు టీఆర్ఎస్ నాయకులేనన్నారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్నా నాయకులే పెద్ద విలన్లు అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రానికి పట్టిన శనిని ప్రజలంతా వదిలించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సభ్యత్వాలు రద్దుకు నిరసనగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ చేపట్టిన 48 గంటల ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహార దీక్ష గురువారం సాయంత్రం ముగిసింది. కోమటిరెడ్డికి జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ, సంపత్‌కుమార్‌కు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చిన నిరహారదీక్ష విరమింప చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా వాటిని పక్కన పెట్టి కేవలం కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ ప్రాజెక్టుల పేరుతో వేలకోట్లు దండుకుంటున్న కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్షం లేని అసెంబ్లీ సమావేశాలను ప్రగతిభవన్ లేదా ఫామ్‌హౌస్‌లో నిర్వహించుకోవాలని సూచించారు.అంతకు ముందు నిరహారదీక్షకు టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్, ఐజెయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్, ప్రతిపక్ష నేత జానారెడ్డి, మండలి విపక్ష నేత షబ్బీర్‌ఆలీ, ఎమ్మెల్యేలు డి.కె.అరుణ, జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి, పద్మావతి, రేవంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దొంతిమాదవరెడ్డి, మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.





ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి భారీగా నిధులు

ప్రత్యేకాభివృద్ధి నిధి డబ్బులు ప్రభుత్వ పథకాలకే

ఎస్సీ ప్రత్యేకాభివృద్ధి నిధికి రూ.16,453 కోట్లు

- ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధికి రూ. 9, 693 కోట్లు
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.1450 కోట్లు
- భూ పంపిణీకి రూ.1,469 కోట్లు

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

టీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్‌లలోను ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి వారి జనాభా ప్రకారం నిధుల కేటాయింపులు జరిపింది. కాగితాల్లో కేటాయించిన నిధుల్లో నుంచి సగం నిధులను కూడా ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేయడం లేదు. 2018-19 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేకాభివృద్ధి నిధి కింద రూ.16453 కోట్లు కేటాయించింది.

గత వార్షిక బడ్జెట్ కంటే రూ. 2078 కోట్లు అదనంగా కేటాయించింది. ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధికి 9,693 కోట్లు కేటాయించింది. గత వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే రూ.1,528 కోట్లు అదనంగా కేటాయించింది.

కేటాయిస్తున్న నిధుల్లో నుంచి సగం నిధులను ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి వినియోగించలేదు. గత ఏడాది కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు కాకపోతే మిగిలిన నిధులను క్యారీఫార్వర్డ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో క్యారీఫార్వర్డ్ విషయంపై ఎక్కడా పేర్కొనలేదు. 2017-18 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేకాభివృద్ధి నిధి కింద కేటాయించిన రూ.14,375 కోట్లలో కేవలం రూ. 7, 395 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధి కింద కేటాయించిన రూ.8165 కోట్లలో రూ.3,856 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఎస్సీ ప్రత్యేకాభివృద్ధి నిధి కింద మిగిలిన రూ.6,980 కోట్లు, ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధిలో మిగిలిన రూ.4,309 కోట్ల నిధులను క్యారీఫార్వర్డ్ చేస్తారా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



నాలుగేండ్లలో ఎస్సీ ప్రత్యేకాభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఖర్చు రూ. (కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
20014-15	7,549	1900
2015-16	8089	3000
2016-17	10,483	5,800
2017-18	14,375	6,795

ప్రత్యేకాభివృద్ధి నిధులు.. ప్రభుత్వ పథకాలకే

2018-19 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిండ కేటాయించిన నిధులను ఆయా వర్గాల వారి అభివృద్ధి.. సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేకాభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, సన్న బియ్యం, ఆసర పింఛన్, ప్రాజెక్టులు, కళ్యాణలక్ష్మి, మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలల నిర్వహణ కోసమే పెద్ద ఖర్చు చేయనున్నట్టు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధి పుస్తకంలో పొందుపర్చింది.

ఎస్సీ సంక్షేమానికి రూ.425 కోట్లు

దళిత అభివృద్ధి శాఖకు ఈ బడ్జెట్‌లో ప్రగతి పద్దుకింద రూ.425 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ. 12, 282 కోట్లు కేటాయించింది. నిర్వహణ పద్దు కింద కేటాయించిన నిధులు జీత భత్యాలు, కార్యాలయాల నిర్వహణ కోసం ఖర్చు చేయనున్నారు. 2017-18 వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన రూ.2060 కోట్లు కేటాయించగా అందులో నుంచి కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఎస్సీ సంక్షేమానికి ఖర్చు చేశారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.1450 కోట్లు

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం ఈ బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయించింది. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ప్రస్తుతం పేదింటిలో మహిళల వివాహాల కోసం సర్కారు అందిస్తున్న రూ.71,500 నగదును ఈ ఏప్రిల్ నుంచి రూ.లక్షకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసమే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు జరిపింది.

స్కాలర్‌షిప్‌లకు రూ.3,282 కోట్లు

విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం బడ్జెట్‌లో 3,282 కోట్లు కేటాయించారు. ఈ నిధులను ఇక నుంచి గ్రీన్ నల్‌లో పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి సంవత్సరం సకాలంలో స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఈ బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులను కేటాయించారు.

భూ పంపిణీకి పెరిగిన నిధులు

రాష్ట్రంలో అరకొరగా సాగుతున్న భూ పంపిణీ కోసం బడ్జెట్‌లో రూ.1469 కోట్లు కేటాయించారు. గత నాలుగు బడ్జెట్‌లలో భూ పంపిణీ కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ వచ్చింది. 2018-19 వార్షిక బడ్జెట్‌లో అదనంగా రూ.469 కోట్లు కేటాయించింది.

కేటాయింపులే కానీ.. ఖర్చులేవు : కేవీపీఎస్



ప్రతి బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నాయే తప్ప నిధుల ఖర్చు మాత్రం పెరగడం లేదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు విమర్శించారు. గత సబ్‌ప్లాన్‌లలో ఖర్చు కాని నిధులను క్యారీఫార్వర్డ్ చేసి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ బీసీలకు నిరాశే

బడ్జెట్‌లో రూ.5,929 కోట్లు

- సబ్‌ప్లాన్ ఊసేలేదు
- అమలుకు నోచుకోని బీసీ డిక్లరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీలకు బడ్జెట్ నిరాశే మిగిలించింది. 2017-18 వార్షిక బడ్జెట్‌లో రూ. 5,079 కోట్లు కేటాయిస్తే 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.5,920 కోట్లు కేటాయించారు. బలహీనవర్గాల వారికి భారీ ఆశలు కల్పించి ఈ బడ్జెట్‌లో అదనంగా కేవలం రూ.841 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ బడ్జెట్‌లో భారీ కేటాయింపులు జరు పుతామని ఊదరగొట్టిన ప్రభుత్వం చివరికి ఉసూరుమనిపించింది. బీసీల సమాగ్రభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామన్న హామీని విస్మరించింది. ఎస్సీ, ఎస్టీల తరహాల్లో పూర్తిగా ఫీజులు చెల్లిస్తారని ఆశించిన బలహీనవర్గాల విద్యార్థుల ఆశలను వమ్ము చేసింది. ఫెడరేషన్లకు ఈ బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తారని ఆశించిన చేతి వృత్తిదారులకు చెయ్యిచ్చింది. నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్‌కు పైసా కేటాయించలేదు. వృత్తుల ఆధునీకరణ కోసం ఫెడరేషన్లను బలోపేతం చేస్తామని ప్రకటించిన సర్కారు కేవలం నాయి బ్రాహ్మణ, రజక ఫెడరేషన్లకు మాత్రమే రూ.450 కోట్లు కేటాయించింది. రజక ఫెడరేషన్‌కు గత బడ్జెట్‌లో కేటాయించిన దాని కంటే రూ.50 కోట్లు తక్కువగా కేటాయించి వారి ఆశలపై నీళ్లు చల్లింది. 1.74 లక్షల కోట్ల బడ్జెట్‌లో జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు రూ.5,929 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.229.79 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.5,690 కోట్లు కేటాయించింది.

బీసీ డిక్లరేషన్ హుష్ కాకీ

బీసీల సమస్యలు ఒక్క రోజులో తీరేవికావనీ, బీసీ ప్రజాప్రతినిధులంతా రెండు, మూడు రోజుల పాటు బీసీల ఆర్థిక స్థితిగతులపై చర్చించి వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచనలు చేయండి.. మీరిచ్చిన సూచనలు, సలహాలను వెంటనే అమలు పర్చడానికి జీవోలు విడుదల చేస్తాం.. అవసరమైతే ఒక్క రోజు అసెంబ్లీని నిర్వహించి వాటి అమలుకు అసెంబ్లీ తీర్మానం చేస్తాం" అన్న సీఎం కేసీఆర్ ఈ బడ్జెట్‌లో బీసీ డిక్లరేషన్‌ను పూర్తిగా విస్మరించారు. కనీసం బీసీ సంక్షేమ శాఖ పంపించిన ప్రతిపాదనలను కూడా పరిగణలోకి తీసుకోలేదు. బీసీల అభివృద్ధి కోసం రూ.8075 కోట్లు కేటాయించాలంటూ బీసీ సంక్షేమ శాఖ పంపిచిన ప్రతిపాదనలను కూడా పక్కన పెట్టి కేవలం 5.929 కోట్లు మాత్రమే కేటాయించి బలహీనవర్గాల వారి ఆశలను వమ్ము చేశారు.

ఫెడరేషన్లకు ఎగనామం

కులవృత్తులు, చేతి వృత్తుల వారి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఫెడరేషన్లకు గత నాలుగు బడ్జెట్‌ల తరహాల్లోనే ఈ బడ్జెట్‌లో కూడా పైసా కేటాయించలేదు. దీంతో ఫెడరేషన్లు నిర్వీర్యం చేస్తున్నారన్న దానికి బలం చేకూరుతున్నది. బహుళజాతి వ్యాపార సంస్థల యాజమాన్యాలకు తలొంచే ఫెడరేషన్లకు నిధులు కేటాయింపు జరపలేదన్న విమర్శలు వస్తున్నాయి.

సబ్‌ప్లాన్ ఊసే లేదు

బీసీల సమగ్రాభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ ఏర్పాటు, ప్రతి బడ్జెట్‌లోను రూ.5వేల కోట్లు కేటాయిస్తామని టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చింది. అధికారంలోకి వచ్చిన నాలుగేండ్లలో ఐదు బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన టీఆర్ఎస్ సర్కార్ సబ్‌ప్లాన్ ఊసెత్తలేదు. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తారని ఆశించిన బీసీలకు సర్కారు నిరాశే మిగిలించింది.

ఎంబీసీ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు

ఎంబీసీల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించింది. గత ఏడాది ఆగస్టులో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించింది. కేటాయించిన నిధుల్లో నుంచి రూపాయి కూడా ఎంబీసీల సమగ్రాభివృద్ధి కోసం ఖర్చు చేయలేదు. ప్రధానంగా ఇప్పటికీ ఎంబీసీ జాబితా కూడా రూపొందించలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అయినా నిధులు ఖర్చు చేస్తారా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్‌లో ఎంబీసీల వాటా ఎక్కడ? ఎంబీసీ సంఘం

రాష్ట్రంలో అత్యంత వెనుకబడ్డ కులాలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపిందని ఎంబీసీ సంఘం విమర్శించింది. 1.74 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఎంబీసీలకు వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వార్షిక బెడ్జెట్‌లో బీసీలు, ఎంబీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తక్కువ బడ్జెట్‌తో బీసీ, ఎంబీసీ, సంచార జాతులను ఏరకంగా అభివృద్ధి పరుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంచార జాతుల ప్రత్యేక కార్పొరేషన్ గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు.

నిరాశపర్చిన బడ్జెట్ - నాగరాజు

బడ్జెట్ రజకులను నిరాశపర్చిందని రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. రజక ఫేడరేషన్‌కు నిధులు పెంచాల్సింది పోయి, గత బడ్జెట్‌లో కంటే రూ.50 కోట్లు తక్కువగా కేటాయించడం అన్యాయమన్నారు.

సబ్‌ప్లాన్ ఊసేలేదు - జాజుల శ్రీనివాస్‌గౌడ్

బడ్జెట్‌లో సబ్‌ప్లాన్ ఊసెత్తకపోవడం బీసీలకు ద్రోహం చేసినట్టేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీ కార్పొరేషన్. ఫెడరేషన్లను విస్మరించారన్నారు.


పేదలపై అప్పుల భారం బడ్జెట్‌పై కాంగ్రెస్ ఫైర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఆశనిపాతంలా ఉందని టీపీసీసీ పేర్కొంది. కాగితాల్లోని కేటాయింపులు, ఆచరణకు దూరంగా ఉన్నాయని విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అప్పుల భారం పేదలపై పడుతున్నదని ఆరోపించింది. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చకుండా అప్పుల కుప్పగా మార్చారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. గురువారం గాంధీ భవన్‌లో మండలిలో విపక్షనేత షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే జి చిన్నారెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కమీషన్లకు అనుకూలంగా ఉన్న వాటికే ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందన్నారు. మైనార్టీలకు గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇంతవరకు 50 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల కోసం ప్రభుత్వం ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్టుగా ఉందన్నారు. ఎంబీసీలకు గతబడ్జెట్‌లో ఇచ్చిన వెయ్యి కోట్ల బడ్జెట్ ఇంతవరకు ఖర్చు చేయలేద



న్నారు. ఐటీ రంగానికి, యువతకు, ఎన్ఆర్ఐలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని, దీంతో ఈ రంగాలు కుదేలు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. పెట్టుబడుల పేరుతో రూ.12వేల కోట్లు కేటాయించడం ప్రభుత్వ మోసానికి నిదర్శనమన్నారు. రెండుగదుల ఇండ్లకు కేటాయింపులు జరగలేదని, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. ఎంఐఎం ఇన్నాళ్లూ ముస్లింలపై ఆధారపడి ఎన్ని కల్లో గెలిచిందని, పాతబస్తీలో ఎంఐఎం అభివృద్ధిని అడ్డుకుంటుం దన్నారు. ఇప్పుడు అక్కడ ముస్లిం, హిందువులు ఒక్కటయ్యారన్నారు. అందుకే మరోమారు ప్రభుత్వం మెట్రో ప్రకటన చేసిందని అన్నారు. బడ్జెట్‌ను ప్రభుత్వం గతం కంటే 19శాతం పెంచిం దని, ఆదాయం, రాబడి మాత్రం పెరగ లేదన్నారు. పెంచిన నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం పరోక్షంగా ప్రజలపై పన్ను భారం పెంచాలనే ఆలోచనతో వుందని, అదే సమయంలో అప్పుల భారం ప్రజలపై పడనుందన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మారుస్తున్నారని మండిపడ్డారు. తెలంగా ణకు కాంగ్రెస్ విలన్ అయితే... తెలంగాణ ఎలా వచ్చిం దని, భవిష్యత్తులో హరీశ్‌రావు భయంతో టీఆర్ఎస్ ఎక్కడ రెండుగా చీలుతుందోననే కొత్త రాజకీయ డ్రామాలకు కేసీఆర్ తెరలేపారని అన్నారు. ప్రజలను ఉన్నతస్థాయి నుంచి అగాథంలోకి తీసుకెళ్తుందన్నారు. ప్రభుత్వ దొంగ లెక్కలపై నిలదీస్తామనే భయంతోనే సభనుంచి తమను సస్పెండ్ చేశారన్నారు. దళితులకు మూడెకరాల భూమి కోసం రాష్ట్రంలో ఏడు లక్షల మంది ఎదురు చూస్తున్నారని, అయినా కూడా నిధుల కేటాయింపు మాత్రం వాస్తవాలకు దూరంగా వుందన్నారు. అదనంగా ప్రభుత్వం సృష్టిస్తామన్న లక్ష ఉద్యోగాల సంగతి దేవుడెరుగు... ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలను నాలుగేండ్లైనా భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. గతనాలుగు ఏండ్లుగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లతో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు.



ఇది కమీషన్ల బడ్జెట్ : రేవంత్‌రెడ్డి


బడ్జెట్ పూర్తిగా కమీషన్ల బడ్జెట్‌గా ఉందని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో కేవలం కమీషన్లు ఇచ్చే వారికి, తనకు కావాల్సిన వారికి మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు లెక్కలు చూపుతూ మాయమాటలతో మరోమారు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

మీడియా పాయింట్

కేటాయింపులు సరే... ఖర్చుల సంగతేంటీ?

అంకెలగారడి బడ్జెట్ : ఎమ్మెల్యే సున్నం రాజయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్




బడ్జెట్‌లో కేటాయింపులు సరే, కానీ ఖర్చు చేయని నిధుల సంగతేమిటీ అని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ గత బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధుల్లో రూ.10వేల కోట్లు ఖర్చు చేయాలేని దుస్థితి నెలకొందన్నారు. అదే విధంగా రజకులకు రూ.200 కోట్లు, నాయిబ్రాహ్మణులకు రూ.250 కోట్లు కేటాయించారు కానీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. వామపక్షాల ఉద్యమ పోరాట ఫలితంగా సాధించుకున్న అటవీ హక్కుల చట్టం అటకెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు, ఆదివాసీలను అడవుల నుంచి పోలీసులు తరిమేస్తున్నారని చెప్పారు.వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంలేదని, పెట్టుబడి పథకం కిందికి కౌలు, పోడు, బంజరు భూములు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు జీతాలు పెంచితే సమ్యలన్నీ పరిష్కరించినట్టుగా ప్రభుత్వం భావిస్తుందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా గౌరవించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు.

బకాయిలే రూ. 35వేల కోట్లు : బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి




తెలంగాణ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కింద రూ.35వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం పనితీరు చెప్పేది బారెడు, జరిగేది జానెడు అన్నట్టుందని విమర్శించారు. నాలుగేండ్లలో 25,888 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, ఇంకా 85వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటే ఇంకా 14 ఏండ్లు పడుతుందని అన్నారు. హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని సీఎం చెప్పారని, ఇప్పటి వరకు కట్టింది 750 ఇండ్లు మాత్రమేనన్నారు. గొర్రెల పంపిణీ పథకానికి కేంద్రం ప్రభుత్వం వద్ద రూ.2300 కోట్లు తీసుకొచ్చారని చెప్పారు. పథకాలు పెట్టడం ప్రారంభించి వదిలేయడం సీఎంకు అలవాటయిందన్నారు.

రూ. 4వేల సర్వరోగ నివారిణిలా : టీడీపీ ఎమ్మెల్యే సండ్ర




ప్రభుత్వం ముందు ఏ సమస్య పెట్టినా, పెట్టుబడి పథకం కింద ఇవ్వబోయే 4వేల రూపాయలను సర్వరోగ నివారిణిలా చెబుతుందని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మూడెకరాల భూ పంపిణీ ఇప్పటి వరకు 12వేల మందికే అమలైందన్నారు. ఎంతో మంది దళితులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. రైతు సమన్వయ సమితులు రాబోయే రోజుల్లో బూత్ కమిటీలుగా మారనున్నాయని విమర్శించారు. రాజకీయాల్లో ఇప్పుడున్న కుటుంబ సభ్యులు సరిపోరన్నట్టు మరో వ్యక్తిని రాజ్యసభ సభ్యుడిగా తెరమీదకు తీసుకొస్తున్నారని విమర్శించారు. ఏ శాఖలో చూసిన కేటాయింపులు తప్పా ఖర్చు చేయడం లేదన్నారు.

ఓటుబ్యాంకు రాజకీయాలు వద్దు: టీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య



ఇంటింటికీ నల్లా కనెక్షన్లు 20 ఏండ్ల కిందనే ఉన్నాయని, ఇప్పుడు మీరి ఇచ్చేది ఏందని టీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య సీఎంను ఉద్దేశించి అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయొద్దని కోరారు. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలను విస్తరించారు, ఆఫీసుల్లో కుర్చీలు తప్పా ఉద్యోగులు లేరన్నారు. పరిపాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. అంకెల గారడీగా బడ్జెట్ ఉందన్నారు. 9 ఫెడరేషన్లకు ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.బీసీలు, ఎంబీసీలను ఈ ప్రభుత్వం విడదీసీ మోసం చేస్తుందని తెలిపారు. బడ్జెట్‌ను పునపరిశీలించాలని కోరారు.

పేదల బడ్జెట్ : ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్




తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది పేదల బడ్జెట్ అని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అన్ని కులాలకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్ రూపొందించారని చెప్పారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం సాధించుకున్న తెలంగాణ, ఆ దిశగానే అడుగులు వేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు.

పెంచిన నిధులను ఖర్చు చేయాలి : ఆవాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడ్జెట్‌లో నిధులు పెంచితే సరిపోదనీ, పెంచిన నిధులను ఖర్చు చేయాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ, మహమ్మద్ అబ్బాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి గత బడ్జెట్ కంటే నిధులు పెంచి రూ.2500 కోట్లు కేటాయించారు. కానీ గత బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.1235 కోట్లు కే టాయిస్తే అందులో నుంచి రూ.430 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. కేవలం అంకెల్లో పెంపులు చూపి ఖర్చు చేయకుండా మైనార్టీలను అన్యాయం చేస్తున్నదని విమర్శించారు.

చేతివృత్తుల విస్మరించిన బడ్జెట్ : యంవి రమణ



బడ్జెట్‌లో చేతి వృత్తులను విస్మరించారని తెలంగాణ చేతి వృత్తుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు, చేతి వృత్తులకు లింక్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం రజక, నాయి బ్రాహ్మణ ఫెడరేషన్లకు రూ.500 కోట్లు కేటాయించి రూ. 5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు.

నవచిత్రం

మరో ప్రయోగాత్మక చిత్రం


నారా రోహిత్


విభిన్న కథా చిత్రాలతో ఆకట్టుకుంటున్నారు నారా రోహిత్. ఇండస్ట్రీలో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్న ఆయన తాజాగా ఓ ప్రయోగాత్మక చిత్రంలో మూగవాడిగా నటించబోతున్నారు. ఈ చిత్రానికి పి.బి.మంజునాథ్ దర్శకత్వం వహిస్తుండగా, శ్రీవైష్టవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మిస్తున్నారు. నారా రోహిత్ నటిస్తున్న 18వ చిత్రమిది కావడం విశేషం. 'నారా రోహిత్ నటించే మూగవాడి పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది' అని చిత్ర బృందం తెలియజేసింది. ఉగాది సందర్భంగా ప్రారంభం కానున్న ఈ చిత్రానికి సంగీతం: వికాస్ కురిమెళ్ల, ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: రిచర్డ్ ప్రసాద్.

మెగాస్టార్ ముఖ్య అతిథిగా ప్రీ రిలీజ్ వేడుక

'నేను రూపొందించిన 'నేనొక్కడినే', 'నాన్నకు ప్రేమతో..' చిత్రాలు యుఎస్‌లో చక్కని వసూళ్లను రాబట్టాయి. అక్కడ ఓ వ్యక్తి కలిసి 'మీరు తీసిన సినిమాలు చాలా బాగున్నాయి. మన నేపథ్యంతో, మన సంస్కృతితో సినిమాలెందుకు తీయడం లేదు' అని అడిగాడు. నాకే సిగ్గు అనిపించింది. ఆయన ప్రశ్నకు సమాధానమే ఈ 'రంగస్థలం' చిత్రం' అని దర్శకుడు సుకుమార్ అన్నారు.

రామ్‌చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.నవీన్, రవిశంకర్, మోహన్(సీవీఎం) సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రంగస్థలం'. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో పాటలను ఇటీవల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సుకుమార్ మాట్లాడుతూ, 'ఇప్పటికే విడుదలైన 'ఎంత సక్కగున్నావే..', 'రంగ రంగ రంగస్థలానా..', 'రంగమ్మ మంగమ్మ..' పాటలు శ్రోతలను బాగా అలరిస్తున్నాయి. తాజాగా మరో రెండు పాటలైన 'ఆ గట్టుకుంటావా.. ఈ గుట్టకుంటావా..', ఐటెమ్ సాంగ్ 'జిగేల్ రాణి..' లను జ్యాక్ బాక్స్‌లో విడుదల చేశాం. మరో సర్‌ప్రైజ్ సాంగ్ ఉంటుంది. దాన్ని చంద్రబోస్ పాడారు. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. నేను దాదాపు 28ఏండ్లు పల్లెటూరులోనే పెరగడంతో దానిపై మంచి అవగాహన ఉంది. ఈ సినిమా చేయడం వల్ల నా ఆత్మను వెతుక్కున్నట్టు ఉంది. ఇలాంటి సినిమా చేయాలని ఎప్పట్నుంచో ఉంది. ఇప్పటికి కుదిరింది. నాకు మంచి టెక్నీకల్ టీమ్ దొరకడంతో సినిమా చేయడం చాలా ఈజీ అయ్యింది. ముఖ్యంగా ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ, మోనిక ఆనాటి బ్యాక్‌డ్రాప్ సెట్‌ను అద్భుతంగా వేశారు. అది చూసి నేనే ఆశ్చర్యపోయాను. దేవిశ్రీప్రసాద్, చంద్రబోస్ మంచి క్రియేటివ్ పర్సన్స్. చంద్రబోస్ ప్రతి సాంగ్‌ను పదిపదిహేను నిమిషాల్లోనే రాశారు. పాట రాసిన తర్వాతే ట్యూన్స్ కంపోజ్ చేయడం జరిగింది. 'రంగమ్మ.. మంగమ్మ' పాటలో 'గొల్లబామ' అనే పదం ఓ కీటకానికి సంబంధించినది. వ్యక్తులను ఉద్దేశించినది కాదు. నా సినిమాలో ఐటెమ్ సాంగ్స్ పెద్ద హిట్ అయ్యాయి. దీంతో అప్పట్నుంచి ఆ పాటలు కంపల్సరీగా పెడుతున్నాం. ఈ చిత్రంలోని పాటను కూడా నిర్మాతలకు నచ్చడంతోనే పెట్టాం. కచ్చితంగా అది ఆకట్టుకుంటుంది' అని అన్నారు.

'విడుదలైన పాటలకు శ్రోతల నుంచి విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 18న వైజాగ్‌లోని ఆర్కే బీచ్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తున్నాం. చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. సినిమాపై నమ్మకంతో ఉన్నాం. ఈ నెల 30న సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం' అని నిర్మాత నవీన్ ఎర్నేని తెలిపారు. చంద్రబోస్ చెబుతూ, 'మంచి సాహిత్యానికి, మంచి సంగీతం కుదిరింది. ఇంతమంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. పల్లెటూరు నేపథ్యంలో సినిమా కాబట్టి పదాలను ఈజీగా రాశాను. అవి బాగా కనెక్ట్ అయ్యాయి' అని చెప్పారు. 'నేను పెరిగింది సిటీలోనే అయినా పల్లెటూరును మిస్ అయిన ఫీలింగ్ ఉండేది. ఈ సినిమాలో పల్లెటూరు సెట్ వేయడంతో ఆ కొరత తీరింది. రీసెర్చ్ చేసి సెట్ వేశాను. అది సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది' అని ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు.


'రంగస్థలం' చిత్రంలో రామ్‌చరణ్


'లక్ష్మీ' చిత్రంలో నటించిన బాలలతో శృతి నల్లప్పా, ప్రతీక్ చక్రవర్తి, ప్రభుదేవా, విజయ్, శ్యామ్

నన్నే మించిపోయేలా ఉన్నారు : ప్రభుదేవా

ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ జంటగా విజయ్ దర్శకత్వంలో ప్రమోద్ ఫిల్మ్స్, ట్రిడెంట్ ఆర్ట్స్ పతాకాలపై ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్పా, ఆర్.రవింద్రన్ సంయుక్తంగా తమిళంలో నిర్మిస్తున్న చిత్రం 'లక్ష్మి'. తెలుగులో అదే పేరుతో విడుదల చేస్తున్నారు. డాన్స్ ప్రధానంగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ప్రభుదేవా మాట్లాడుతూ, 'విజయ్‌తో 'అభినేత్రి' సినిమా చేశా. ఆ తర్వాత ఎలాంటి సినిమా చేయాలా అని అనుకుంటున్న టైమ్‌లో ఈ కథ వచ్చింది. స్క్రిప్ట్ బాగా నచ్చడంతో తెరకెక్కించాం. ఎక్స్‌టార్డినరీ స్క్రిప్ట్ ఇది. డాన్స్ ప్రధానంగా సాగుతుంది. ఇటీవల కాలంలో డాన్స్ నేపథ్యంతో కూడిన సినిమా రాలేదు. అందుకే చేశాం. డాన్స్ చిత్రాలకు సంగీతం కీలకం. తమిళంలో 'విక్రమ్ వేదా'కు శ్యామ్ అద్భుతమైన సంగీతం అందించారు. ఆయన ఈ సినిమాకు కూడా మంచి బాణీలను అందించారు. ఇలాంటి సినిమా చేయాలంటే ప్యాషన్ ఉన్న నిర్మాతలు కావాలి. ప్రతీక్, శృతి ఎంతో ప్యాషనేట్‌తో రాజీపడకుండా తెరకెక్కించారు. ఇందులో నటించిన చైల్డ్ ఆర్టిస్టులు అద్భుతం. చిన్న వారైనా ఎక్స్‌ట్రార్డినరీగా డాన్స్ చేస్తున్నారు. వదిలేస్తే నన్నే మించిపోయేలా ఉన్నారు. హిప్‌హాప్ డాన్స్ చేసేవారికి సినిమా డాన్స్ రాదు, కానీ ఇందులో దిత్య అనే అమ్మాయి ఇలా చెబితే అలా పట్టేసి చేసేస్తుంది. అందరూ అద్భుతంగా చేశారు. పిల్లల నుంచి చాలా నేర్చుకున్నాను. డాన్స్‌తోపాటు సినిమాలో చాలా ఎమోషన్స్ ఉంటాయి. కచ్చితంగా తెలుగు ఆడియెన్స్‌కు కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. 'గ్రేట్ డాన్సింగ్ లెజెండ్ ప్రభుదేవాతో మరో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. డాన్స్ నేపథ్యంలో సాగే బ్యూటిఫుల్ ఫిల్మ్ ఇది. మన దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను ఆడిషన్ చేసి చైల్డ్ డాన్సర్లను ఎంపిక చేశాం. టైటిల్‌లో రోల్‌లో దిత్య నటించింది. పిల్లలతో సినిమా చేయడం చాలా ఎంజాయ్ చేశాను. శ్యామ్ మంచి మ్యూజిక్ అందించారు. ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు విజయ్ తెలిపారు. నిర్మాతలు చెబుతూ, 'మాకిది తొలి చిత్రం. ప్రభుదేవాతో వర్క్ చేయడం డ్రీమ్. అది నెరవేరినందుకు హ్యాపీగా ఉంది. దర్శకుడు విజయ్ వండర్‌ఫుల్‌గా సినిమాను తెరకెక్కించారు' అని చెప్పారు. 'ఈ సినిమాకు సంగీతం అందించే ఛాన్స్ ఇచ్చిన దర్శక,నిర్మాతలకు, ప్రభుదేవాకు థ్యాంక్స్' అని సంగీత దర్శకుడు శ్యామ్ చెప్పారు. 'ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవాతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆయన ఎంతగానో సపోర్ట్ చేశారు. విజయ్ సార్ మమ్మల్ని చాలా బాగా చూసుకున్నారు. ఎంతోగానో ప్రోత్సహించారు. డాన్స్ ప్రధానంగా సాగే ఈచిత్రంలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది.' అని చైల్డ్ డాన్సర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రియాంక చోప్రా



బోరుబావి మరణాల నేపథ్యంలో కర్తవ్యం


నయనతార

నయనతార ప్రధాన పాత్రధారిణిగా గోపీనైనర్ దర్శకత్వంలో రూపొంది తమిళనాట ఘన విజయం సాధించిన చిత్రం 'ఆరమ్'. ఈ చిత్రాన్ని నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ శరత్ మరార్‌తో కలిసి ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఆర్.రవీంద్రన్ తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. నేడు(శుక్రవారం) ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ప్రీమియర్ షో వేశారు. సినిమాకు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో, ఈ స్పందనపై నయనతార మాట్లాడుతూ, 'మంచి పాయింట్‌తో ఈ చిత్రాన్ని దర్శకుడు కళ్ళకు కట్టినట్టు తెరకెక్కించిన తీరు ప్రశంసనీయం. మారు మూల పల్లెటూళ్ళలో చిన్న పిల్లలు ప్రమాదవశాత్తు బోరు బావిలో పడిపోతుంటే అటు అధికారులు, ఇటు ప్రజలు ఆ పాపని కాపాడటానికి ప్రయత్నించే తీరు అభినందనీయం. కానీ దానికి కావలసిన వసతులు కల్పించకపోవడం బాధాకరం. ఈ విషయమే నన్ను ఈ చిత్రం చేయడానికి ముందుకొచ్చేలా చేసింది. తెలుగులో జర్నలిస్ట్‌లు చూసి అభినందించడం చాలా హ్యాపీగా ఉంది. వారికి థ్యాంక్స్. ఉగాది సందర్భంగా నేడు సినిమా విడుదలవుతోంది. ప్రతి మనసుకి తప్పకుండా నచ్చుతుందని నమ్ముతున్నా' అని అన్నారు. 'ఆడుకుంటున్న ఓ పాప బోరు బావిలోపడిపోతే అక్కడ జరుగుతున్న ఆపరేషన్‌ను కథా వస్తువుగా తీసుకుని రియలిస్టిక్‌గా, ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకునేలా, అద్భుతమైన నెరేషన్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ ఆపరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ పాత్రలో నయనతార నట విశ్వరూపానికి తమిళ ప్రేక్షకులు జేజేలు కొట్టారు. తెలుగు వారు కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అని నిర్మాతలు చెప్పారు.

కల్పనా చావ్లా బయోపిక్‌లో..!

గత రెండేండ్లుగా హాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రియాంక చోప్రా బాలీవుడ్ చిత్రాలకు దూరమైంది. బాలీవుడ్ సినిమాలో ఎప్పుడు నటిస్తుందా అని అటు అభిమానులు, ఇటు చిత్ర వర్గాల నిరీక్షణకు దాదాపు ఫుల్‌స్టాప్ పడినట్టే. ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడటానికి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ ఏడాది కచ్చితంగా ఓ బాలీవుడ్ సినిమా ఉంటుందని ప్రియాంక చెప్పిన మాటలు ఓ కారణమైతే, అంతరిక్షంలో అడుగిడిన తొలి భారతీయ వ్యోమగామి కల్పనా చావ్లా జీవితం ఆధారంగా తెరకెక్కబోయే బయోపిక్‌లో ప్రియాంక నటించబోతుందనే వార్త మరో కారణం. స్పేస్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డ్ సృష్టించిన కల్పనా చావ్లాగా ప్రియాంక ప్రేక్షకుల ముందుకు రానుండటం ఓ విశేషమైతే, నూతన దర్శకురాలు ప్రియా మిశ్రా ఈచిత్రానికి దర్శకత్వం వహించడం మరో విశేషం. ఓ నూతన చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించబోయే ఈ చిత్రం వచ్చే నెలలోనే పట్టాలెక్కనుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ప్రియాంక ప్రస్తుతం 'క్వాంటికో' సిరీస్‌తోపాటు 'ఎ కిడ్ లైక్ జేక్', 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్రాల్లో నటిస్తోంది.

కృతి సనన్



భీకర యుద్ధాల పానిపట్

ఇటీవల బాలీవుడ్‌లో పీరియాడికల్ డ్రామా నేపథ్యంలో విడుదలైన చిత్రం 'పద్మావత్'. ఎన్నో వివాదాలను ఎదుర్కొని ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రంలో దీపికా పదుకొనె నటన విమర్శకుల్ని సైతం మెప్పించింది. తాజాగా కృతిసనన్ కూడా ఓ పీరియాడికల్ చిత్రంలో నటించబోతోంది. గతంలో 'జోధా అక్బర్', 'మొహెంజోదారో' వంటి పీరియాడికల్ చిత్రాలను తెరకెక్కించిన అశుతోష్ గోవారికర్ తాజాగా 'పానిపట్' పేరుతో మరో పీరియాడికల్ సినిమాని నిర్మిస్తున్నారు. 15 -16వ శతాబ్దాల మధ్య కాలంలో మొఘల్ రాజుల పాలన, జరిగిన యుద్ధాలు, మరాఠ సామ్రాజ్య విస్తరణ ప్రధానంగా ఈ చిత్రం ఉండబోతోందట. మన దేశంలో అత్యంత భీకరమైన యుద్ధాల్లో మొఘల్ రాజుల యుద్ధాలు ప్రసిద్ధి చెందాయి. వాటి ఆధారంగా ఈ భారీ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో మహిళా ప్రధాన పాత్రలో కృతిసనన్‌తోపాటు అర్జున్ కపూర్, సంజయ్‌దత్ నటించనున్నారు. కృతి ఈ చిత్రంతోపాటు 'అర్జున్ పాటియాలా' చిత్రంలో నటిస్తోంది.


'ఉగ్రం' చిత్రంలో జె.డి.చక్రవర్తి

యాక్షన్ కామెడీ థ్రిల్లర్..

జె.డి.చక్రవర్తి హీరోగా అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో నక్షత్ర మీడియా పతాకంపై ఖాసిం సమర్పణలో 'నక్షత్ర' రాజశేఖర్ నిర్మించిన చిత్రం 'ఉగ్రం'. అక్షిత కథానాయిక. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఉగాది సందర్భంగా విడుదల చేయనున్నారు. ఆ విశేషాలను నిర్మాత 'నక్షత్ర' రాజశేఖర్ తెలియజేస్తూ, 'ఇప్పటి వరకు వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన జె.డి.చక్రవర్తి మరో పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్న చిత్రమిది. ఆయన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. మాస్ ఇమేజ్ ఉన్న అమ్మ రాజశేఖర్ చెప్పిన కథ మమ్మల్ని ఎంతో ఇన్‌స్పైర్ చేసింది. యాక్షన్ కామెడీ థ్రిల్లర్‌గా యూత్‌ను ఆకట్టుకునే విధంగా, మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు తెరకెక్కించారు. సంగీతానికి స్కోప్ ఉంటుంది. దర్శకుడి ఊహకు సినిమాటోగ్రాఫర్ అంజి, ఎస్. ముజీర్ మాలిక్ ప్రాణం పోశారు. కమర్షియల్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకిది ఫీస్ట్‌లా ఉంటుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వేసవి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. మనోజ్ నందం, అక్షత, బెనర్జీ, చమ్మక్ చంద్ర, శ్రీరామ్ చంద్ర, టార్జాన్, సంపూర్ణేష్‌బాబు, షానీ, రాజు భాయ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: జాన్ భూషణ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: చిన్నా, ఎడిటింగ్: ఎస్.శ్రీనివాస్.

ఆశ్చర్యపరిచే పాత్ర..


నీత్ నితిన్ ముఖేష్

ప్రస్తుతం 'సాక్ష్యం' చిత్రంతో బిజీగా ఉన్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తాజాగా శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఇటీవలే ప్రారంభమైన ఈ సినిమాను వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంటినేని నిర్మిస్తున్నారు. తాజాగా ఇందులోని కీలక పాత్ర కోసం బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేష్‌ను ఎంపిక చేశారు. ఈ చిత్రం గురించి నిర్మాత నవీన్ తెలియజేస్తూ, 'ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను సరికొత్తగా ప్రజెంట్ చేయనున్నాం. మంచి రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం దర్శకుడు శ్రీనివాస్ అద్భుతమైన కథను సిద్ధం చేశారు. అబ్బూరి రవి, ఛోటా కె.నాయుడు, ఎస్.ఎస్.థమన్, ఛోటా కె.ప్రసాద్, స్టంట్ శివ లాంటి ప్రతిభ కలిగిన సీనియర్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు. తాజాగా ఇందులో నీల్ నితిన్ ముఖేష్ కూడా భాగస్వామి అయ్యారు. ఆయన విలన్ పాత్రలో కాకుండా కథకి చాలా ప్రాధాన్యత కలిగిన పాత్రలో కనిపిస్తారు. ఆయన పాత్ర స్వభావం, తీరుతెన్నులు ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ప్రస్తుతం సినిమా మొదటి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. తదుపరి షెడ్యూల్‌లో నీల్ నితిన్ పాల్గొంటారు. త్వరలోనే ఇందులో నటించే ఇద్దరు కథానాయికల వివరాలు వెల్లడిస్తాం. మంచి కథ, కథనం, సంగీతంతోపాటు ఎన్నో ప్రత్యేకతలతో ఈచిత్రాన్ని రాజీపడకుండా నిర్మిస్తున్నాం' అని అన్నారు.

ఛాలెంజ్‌గా తీసుకున్నాం..


సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే

'కాలేజ్ నేపథ్యంలో సాగే 'కిరాక్ పార్టీ' ప్రతి ఒక్కరికి తమ కాలేజ్ రోజులను గుర్తు చేస్తుంది' అని అంటున్నారు కథానాయికలు సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా. నిఖిల్‌తో కలిసి ఈ ఇద్దరు కథానాయికలు నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా గురువారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు.

సంయుక్త హెగ్డే మాట్లాడుతూ, 'మాది బెంగుళూరు. సైకాలజీ, జర్నలిజం చేశా. తొలిసారిగా కన్నడలో 'కిరిక్ పార్టీ'లో నటించే అవకాశం వచ్చింది. కన్నడంలో నటించిన పాత్రకే తెలుగు వెర్షన్‌లో కూడా తీసుకున్నారు. నాకు తెలిసిన కథ, పాత్ర అయినప్పటికీ చాలా ఛాలెంజింగ్‌గా తీసుకుని చేశా. సత్యగా నా పాత్ర ఫన్, లవింగ్, బబ్లీగా ఉంటుంది. నా రియల్ లైఫ్‌కు దగ్గరగా ఉంటుంది. సినిమాలో చాలా ట్విస్టులుంటాయి. అవి తెరపైనే చూడాలి. 'కిరిక్ పార్టీ'లో కంటే చాలా మెచ్యూర్డ్‌గా నటించాను. తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా నా పాత్ర తీరుతెన్నులు మారుతాయి. మాతృకలో చేసిన పొరపాట్లు ఇందులో రిపీట్ కాకుండా జాగ్రత్త తీసుకున్నా. సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పాను' అని అన్నారు.

'మాది ముంబయి. గతంలో నటించిన టెలివిజన్ సీరియల్స్ నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. వాటిని చూసి ఇందులో కథానాయికగా ఎంపిక చేశారు. హీరోయిన్‌గా నాకిది తొలి సినిమా. ఇందులో నేను మీరా అనే సింపుల్ గర్ల్‌గా కనిపిస్తాను. మంచి ప్రవర్తన కలిగి కాలేజ్‌లో సీనియర్‌గా కనిపిస్తాను. ఈ చిత్ర మాతృకలో రష్మిక పోషించిన పాత్రను తెలుగులో నేను నటించాను. పాత్రను ఎలా చేయాలనేదాని కోసం ఆ సినిమాను చూశా. కానీ ఇందులో నా సొంత స్టైల్‌లోనే నటించాను. నిఖిల్‌తో పనిచేయడం హ్యాపీగా ఉంది. తను చాలా సినిమాలు చేసినప్పటికీ ఎలాంటి ఈగో లేకుండా తనకిది తొలి చిత్రం అన్నట్టుగానే పాత్రలో జీవించేశారు. నా పాత్ర అందరికీ కనెక్ట్ అవుతుంది. కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో యూత్ బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు శరణ్ అత్యద్భుతంగా తెరకెక్కించారు. కచ్చితంగా సినిమా ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్మకంగా ఉన్నాం' అని సిమ్రాన్ పరీన్జా తెలిపింది.

ఉజ్వల భవిష్యత్‌కు ఊతం

- బడ్జెట్ పద్దు రూ.1,74,453.84 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.1,25,454.70 కోట్లు
- పెట్టుబడి వ్యయం రూ.33,369.10 కోట్లు
- వ్యవసాయానికి పెద్దపీట
- అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు
- ఎన్నికల బడ్జెట్ కాదు..ప్రజాకర్షక బడ్జెట్ : శాసనసభలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తన ఐదో బడ్జెట్‌ను రూ.1,74,453.84 కోట్లుగా శాసనసభలో ప్రవేశపెట్టింది. ఈ మేరకు గురువారం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సభకు సమర్పించారు. రెవెన్యూ వ్యయం రూ.1,25,454.70 కోట్లు అయితే, పెట్టుబడి వ్యయం రూ.33,369.10 కోట్లుగా తెలియజేశారు. రెవెన్యూ మిగులు రూ. 5,520.41 కోట్లు ఉండగా, సొంత ఆదాయం రూ.73,751.88 కోట్లు అని, కేంద్రం నుంచి ఆశిస్తున్న నిధులు రూ. 29,041.88 కోట్లుగా పేర్కొన్నారు. అనేక ప్రతికూల పరిస్థితులు, అస్పష్టతలు, అనుమానాలు, సవాళ్ల మధ్య ఏర్పడిన కొత్త రాష్ట్రం అనతికాలంలోనే అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని వివరించారు. ప్రజాసంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణల్లో తెలంగాణ చూపిన మార్గమే తమకు ఆదర్శమని ఇతర రాష్ట్రాలు భావిస్తున్నాయని తెలియజేశారు. వర్తమానంలో సాధిస్తున్న విజయాలు, భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ఆత్మవిశ్వాసంతో నేడు రాష్ట్ర సమాజం తొణికిసలాడుతున్నదని వివరించారు. ఆ విశ్వాసమే ప్రాతిపదికగా బంగారు తెలంగాణ నిర్మాణానికి, రాష్ట్ర ప్రజల సమగ్రాభివృద్ధికి సమర్పిస్తున్న ఈ బడ్జెట్‌కు అమోదం తెలియజేయాలని శాసనసభ్యులకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ప్రసంగం ఆయన మాటల్లోనే... వివారాలు ఇలా ఉన్నాయి.

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్‌కు 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఊతమిస్తుంది. ఇది ఎన్నికల బడ్జెట్ కాదు...ప్రజాకర్షక బడ్జెట్ . సంక్షేమం, అభివద్ధి ఫలాలను ప్రజలకు అందించాలనే సీఎం ఆశయానికి అద్దంపడుతూ బడ్జెట్‌ను రూపొందించాం. రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర స్థూలఉత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించాం. సమైక్య రాష్ట్రంలో 2013-14 సంవత్సరంలో 5.4శాతం మాత్రమే ఉన్న జీడీపీ వ ద్ధి రేటు రాష్ట్రం ఏర్పడ్డాక ప్రతియేటా పెరుగుతూ వస్తున్నది, 2016-17లో రాష్ట్ర జీడీపీ వద్ధి రేటు 10.1 శాతంగా నమోదు కాగా, 2017-18లో వ ద్ధిరేటు 10.4 శాతంగా ఉంటుందని అంచనా వేశాం. రెండంకెల వద్ధిరేటు సాధించినందుకు ఆనందంగా ఉంది. జాతీయ వ ద్ధిరేటుతో పోలిస్తే మన రాష్ట్ర వ ద్ధిరేటు మెరుగ్గా ఉండటం మంచి పరిణామం. వ్యవసాయ రంగంలో అభివ ద్ధి 2017-18లో 6.9శాతానికి చేరుకుంది. తయారీ రంగంలో 7.5 శాతం వ ద్ధి రేటు సాధించాం. రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్‌రంగంలో సంస్కరణలు తెచ్చాం. సాగునీరు, నిరంతర విద్యుత్‌తో వ్యవసాయంలో గణనీయ వృద్ధి కనిపిస్తున్నది. దీనివద్ధి 6.9 శాతంగా ఉంది. తలసరి ఆదాయం రూ.1,75,534గా ఉంటుందని అంచనా వేస్తున్నాం. కొత్త పారిశ్రామిక విధానంతో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని, ఎకరానికి రూ.4వేల చొప్పున రెండు పంటలకు ఇవ్వనున్నాం. పెట్టుబడి సాయానికి బడ్జెట్లో రూ.12 వేల కోట్లు కేటాయించాం. వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి దిశగా రైతులను, రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నాం.

బడ్జెట్ స్వరూపం

రూ.1,74,453.84 కోట్లతో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.1,25,454.70 కోట్లు కాగా, రెవెన్యూ మిగులు రూ. 5,520.41 కోట్లు అయితే, కేపిటల్ వ్యయం రూ.33,69.10 కోట్లుగా ఉంది. అలాగే పంట పెట్టుబడి పథకానికి రూ.12 వేల కోట్లు, రైతు బీమా పథకానికి రూ.500 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.552 కోట్లు, బిందు సేద్యానికి రూ.127 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్రం నుంచి రూ. 29,041.88 కోట్ల నిధులను ఆశిస్తున్నాం.

ఐటీ రంగానికి 289 కోట్లు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగంలో రాష్ట్రం దూసుకుపోతున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఐటీ విధానంతో ఎన్నో ప్రపంచ అగ్రశ్రేణి ఐటీ సంస్థలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించాయి. ఈ బడ్జెట్‌లో ఐటీ రంగానికి రూ. 289 కోట్లు కేటాయించాం. గూగుల్, డిలాయిట్, ఫేస్‌బుక్, కాగ్నిజెంట్, ఒరాకిల్, ఆపిల్, సేల్స్‌ఫోర్స్, అడోబ్ వంటి ఐటీ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం వరుసగా మూడేండ్ల పాటు జాతీయ సగటును అధిగమించింది. గతేడాది జాతీయ సగటు వ ద్ధి శాతం 10 శాతమైతే, తెలంగాణ రాష్ట్రం 13.85 శాతం వ ద్ధి సాధించింది. వరంగల్, కరీంనగర్, ఖమ్మంలలో ఐటీ హబ్ విస్తరణకు ప్రభుత్వం ముమ్మరంగా కషి చేస్తుంది. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాఫ్ట్‌వేర్ అభివ ద్ధి సంస్థలను, బీపీవో సంస్థల స్థాపనను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇందులో భాగంగా జనగామ, కరీంనగర్, ఖమ్మంలో కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. టీ హబ్‌తో దాదాపు 200 స్టార్టప్ కంపెనీలు ప్రేరణ పొందాయి. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు సందర్భంగా చేసిన వాగ్దానం మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం వీ-హబ్‌ని ఆవిష్కరించింది. మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహించేందుకుగాను వీ-హబ్ పని చేస్తున్నది. వీ-హబ్‌కు ప్రారంభ పెట్టుబడిగా రూ. 15 కోట్లు కేటాయించాం.

విద్యుత్ రంగానికి రూ. 5,650 కోట్లు

విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం అనూహ్యమైన ప్రగతిని సాధించింది. ఈ బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి రూ. 5,650 కోట్లు ప్రతిపాదించాం. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. దీంతో వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమస్థానంలో నిలిపాం. రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 31 మెగావాట్ల సౌర విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండేది. తాజాగా 3,283 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఏకైక రాష్ట్రంగా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాం. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా అభివ ద్ధి చేసేందుకు ప్రభుత్వం 28,275 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తున్నదిజ ఇప్పటికే 15,344 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెచ్చాం.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర బడ్జెట్‌లో అణగారిన వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధిని ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో ఎస్సీల ప్రగతి నిధికి రూ. 16,453 కోట్లు, ఎస్టీల ప్రగతి నిధికి రూ. 9,693 కోట్లు ప్రతిపాదించాం. అలాగే ఎస్సీల సంక్షేమం కోసం రూ. 12,709 కోట్లు, ఎస్టీల సంక్షేమం కోసం రూ. 8,063 కోట్లు కేటాయించాం. దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ కోసం రూ. 1,469 కోట్లు ఇచ్చాం. గత 45 నెలల సమయంలో 4,939 మంది దళితులకు 12,745 ఎకరాల భూపంపిణీ చేశాం. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ఎస్సీల కోసం 104, ఎస్టీల కోసం 53 గురుకుల పాఠశాలలు స్థాపించాం. ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలు పడుతున్న అవస్థలు గమనించిన ప్రభుత్వం, వారి కోసం పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేసింది. తొలి దశలో ఎస్సీల కోసం 30, ఎస్టీల కోసం 22 గురుకుల డిగ్రీ కాలేజీలను ప్రారంభించింది. ఎస్సీ గురుకులాలకు రూ. 1,221 కోట్లు, ఎస్టీ రెసిడెన్షియల్ సంస్థలకు రూ. 401 కోట్లు కేటాయించాం.


జర్నలిస్టుల సంక్షేమానికి 75 కోట్లు

సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం పట్ల శ్రద్ధ పెట్టిన ప్రభుత్వం, జర్నలిస్టుల సంక్షేమంపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ కనబరుస్తుంది. ఈ బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి రూ. 75 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ. 130 కోట్ల నిధిని సమకూర్చింది. ఈ నిధి ద్వారా అకాల మరణానికి గురైన జర్నలిస్టుల కుటుంబానికి లక్ష రూపాయాల ఎక్స్‌గ్రేషియాతో పాటు, ప్రతి నెలా జీవనభతిని కల్పిస్తున్నది. అలాగే న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్లు, బ్రహ్మణుల సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించాం. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్లు, రజకుల ఫెడరేషన్‌కు రూ. 200 కోట్లు, నాయిబ్రహ్మణుల ఫెడరేషన్‌కు రూ. 250 కోట్లు, బీసీల అభివ ద్ధికి రూ. 5,920 కోట్లు ఇచ్చాం.

హోంశాఖకు...

రాష్ట్రంలో పోలీసు శాఖను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆధునీకరించింది. శాంతి భద్రతలను మెరుగుపరిచాం. ఈ బడ్జెట్‌లో హోంశాఖకు రూ. 5,790 కోట్లు కేటాయిస్తున్నాం.

పోలీసు శాఖలో అవసరమైన సిబ్బంది నియామకాలు జరపడంతో పాటు, కావాల్సిన వాహనాలు, ఆధునిక సాంకేతిక పరికరాలు అందించి ఈ శాఖను పటిష్టం చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 7 పోలీసు కమిషనరేట్లతో పాటు 27 కొత్త పోలీసు సబ్ డివిజన్లు, 29 సర్కిళ్లను, 103 పోలీసు స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



కళ్యాణలక్ష్మి...షాదీముబారక్

ఆడ పిల్లల వివాహాలు చేయలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే పేద తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతున్నది. 2018-19 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 1,450 కోట్లు కేటాయించాం. బాల్య వివాహాలు నిరోధించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతున్నది. తొలుత ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు వర్తింపచేసిన ఈ పథకాన్ని, ఆ తర్వాత బీసీలు, అగ్రకులాల్లో ఉన్న పేదలకు కూడా వర్తింపజేశాం. ఇప్పటి దాకా కల్యాణలక్ష్మి పథకం కింద 2,12,126 మంది, షాదీముబారక్ కింద 78,003 మంది ప్రయోజనం పొందారు.

సాగునీటి రంగానికి రూ. వేల కోట్లు

రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. అందుకు ఈ బడ్జెటే నిదర్శనం. ఈ బడ్జెట్‌లో అత్యధిక నిధులు నీటిపారుదల రంగానికి కేటాయించారు. గోదావరి, క ష్ణా నదులపై నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ. 25 వేల కోటు ఇచ్చింది. ఈ రెండు నదులపై 23 భారీ, 13 మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. మరో రెండేండ్లల్లో రిజర్వాయర్లు, కాల్వలతో సహా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 36.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టాం. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్‌తో పాటు నల్లగొండ జిల్లాకు వరప్రదాయినిగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొద్ది నెలల వ్యవధిలోనే వాటర్ పంపింగ్ పాక్షికంగా ప్రారంభించబోతున్నాం. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే పూర్వపు పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. ఈ ఏడాది వర్షాకాలం పంట నాటికి 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనుంది. వలస జిల్లాగా పేరొందిన పాలమూరు జిల్లాకు, ఫ్లోరైడ్ బాధిత పాత నల్లగొండ జిల్లాకు, తీవ్ర కరువు ఎదుర్కొంటున్న పాత రంగా రెడ్డి జిల్లాల్లోని బీడు భూములకు సాగునీరు అందించేందుకు శాశ్వత పరిష్కారంగా పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా నిర్మిస్తున్నాం.

పౌల్ట్రీతో లాభం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా పౌల్ట్రీ పరిశ్రమ అభివ ద్ధి చెందింది.. రాష్ట్రం 'ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియా'గా పేరు పొందింది.. ఈ బడ్జెట్‌లో పౌల్ట్రీ రంగానికి రూ. 109 కోట్లు చూపాం. కోళ్ల దానా ఉత్పత్తిలో, కోడి పిల్లల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పౌల్ట్రీ పరిశ్రమ మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. కోళ్ల పరిశ్రమకు ప్రభుత్వం సబ్సిడీపై కరెంట్‌ను అందిస్తున్నారు. ఈ పరిశ్రమను మరింత ప్రోత్సహించడానికి మరిన్ని చర్యలు చేపడతాం.

'గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టానికిచర్యలు'

అభివ ద్ధి ఎప్పుడైనా పునాదుల నుంచే ప్రారంభం కావాలి. నగరీకరణను మాత్రమే అభివ ద్ధి అనుకుంటాము. అది తప్పు . గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం కల్పించే విధంగా ప్రణాళికలను అమలు చేస్తున్నాం. వ్యవసాయాభి ద్ధికి అవసరమైన చర్యలు చేపడుతూనే, వ్యవసాయ అనుబంధ రంగాలకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ వ త్తుల మీద ఆధారపడిన వర్గాల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించాం. ఇందులో భాగంగా గొల్ల కురుమల సంప్రదాయ వ త్తి గొర్రెల పెంపకానికి సంబంధించి మొదటిదశలో 4 లక్షల కుటుంబాలకు 84 లక్షల గొర్రెల పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 2 లక్షల 35 వేల కుటుంబాలకు 75 శాతం సబ్సిడీపై 50 లక్షల గొర్రెలను పంపిణీ చేశాం. గంగపుత్ర, ముదిరాజ్, బోయ, బంటు కులస్తులు చేపలు పట్టడమే వ త్తిగా జీవిస్తున్నారు. వీరి సంక్షేమంలో భాగంగా ప్రతీ సంవత్సరం 3,20,000 టన్నుల చేపలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. పట్టిన చేపలు అమ్ముకోవడానికి వీలుగా జిల్లాకు ఒకటి చొప్పున 31 హోల్‌సేల్ చేపల మార్కెట్‌లు, 200 రిటైల్ మార్కెట్‌లు నిర్మిస్తాం. పౌల్ట్రీ పరిశ్రమ మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పొందుతారు. కోళ్ల పరిశ్రమ అభివ ద్ధికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 109 కోట్లను ఇచ్చాం.

అసెంబ్లీలో ఈటల...మండలిలో కడియం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ శాసనసభలో ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, శాసనమండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి బడ్జెట్‌ను సమర్పించారు.

సభ సోమవారానికి వాయిదా

శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని ఒక గంట 20 నిమిషాల పాటు మంత్రి ఈటల రాజేందర్ సభలో చదివి వినిపించారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తికాగానే ఉభయసభలు ఈ నెల 18 వరకు వాయిదా వేశారు. సభ్యులు బడ్జెట్ పుస్తకాలు చదువుకోవడానికి వీలుగా మరుసటిరోజు సమావేశాలకు సెలవు ఇవ్వడం ఆనవాయితీ. అంటే ఈ నెల 16వ తేదీ శుక్రవారం సమావేశాలు నిర్వహించరు. ఈ నెల 18 ఆదివారం కావడం, ఆ రోజు ఉగాది పండుగ ఉండటంతో సెలవు ప్రకటించారు. కాగా 17వ తేదీ శనివారం తొలుత సమావేశాలు కొనసాగించాలని షెడ్యూల్ రూపొందించారు. శనివారానికి ఒకరోజు ముందు సెలవు, తరువాత రోజు ఉగాది పండుగ ఉండటంతో శనివారం కూడా సెలవు ఇస్తే సభ్యులకు అనుకూలంగా ఉంటుందని బీఏసీ సమావేశాల్లో అన్ని పార్టీల నేతలు స్పీకర్‌ను కోరడంతో ఏకంగా స్పీకర్ సానుకూలంగా స్పందించి, సోమవారానికి సభను వాయిదా వేసినట్టు అసెంబ్లీ అధికార వర్గాలు చెప్పాయి.

బడ్జెట్‌పై మంత్రి ఈటల సతీమణి జమున స్పందన

ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమున పేర్కొన్నారు. సామాన్య ప్రజానీకానికి దగ్గరలో బడ్జెట్ ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, సన్నబియ్యం వంటి గొప్ప పథకాలు సీఎం కేసీఆర్ తీసుకురావడం గర్వించదగ్గ విషయమని అభిప్రాయపడ్డారు.

బాలికపై లైంగికదాడి

నవతెలంగాణ-ములుగు

బాలికపై ఓ దుర్మార్గుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం బహిలంపూర్ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక(15) బయటకు పోతుండగా గమనించిన స్థానిక యువకుడు వెంబడించాడు. ఎవరూ లేనిది చూసి పాడుబడ్డ గుడిసెలోకి బలవంతంగా లాక్కెళ్లాడు. బాలిక అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి లైంగిక దాడి చేశాడు. అనంతరం పరారయ్యాడు. బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. వారు స్థానికులతో కలిసి ఆ యువకున్ని పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచార మందించారు. వర్గల్ సీఐ శివలింగం గ్రామానికి చేరుకుని స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అడవిబిడ్డలకు పంటలక్ష్మి దూరం

మొదటిపేజీ తరువాయి

ప్రకటించిన పంటలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి.

హద్దులు గుర్తింపు పేరుతో దగా...

ఇప్పటికే పలుజిల్లాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉమ్మడిగా దాడులు చేస్తున్నారు. అటవీ భూములకు హద్దులు నిర్ణయించే పేర పోడు భూముల్లోకి వెళ్లకుండా కందకాలు తవ్వుతున్నారు. అడ్డొచ్చిన వారిపై కేసులు బనాయిస్తున్నారు. ముఖ్యంగా మంచిర్యాల, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వందలాది మందిపై కేసులు పెట్టి జైళ్లకు పంపారు. హరితహారం పేరుతో మొక్కలు నాటేందుకని మరో రకమైన అడ్డంకులు సృష్టిస్తూ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న పోడుసాగుదారునికి ఒక్కొక్కరికి గరిష్టంగా పదెకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని చట్టం చేసినా తెలంగాణలో అమలు కావట్లేదు. ఏజెన్సీ ప్రాంతంలోనూ గిరిజనులు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న పరిస్థితీ ఉంది. కౌలు రైతులకు ఈ పథకం వర్తింప జేయక పోవడంతో అనేక మంది గిరిజనులు పంటలక్ష్మి పథకానికి దూరం అవుతున్నారు. తమకూ ఈపథకం వర్తింప జేయాలని గిరిజన కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పోడు రైతులకూ అందేలా చూడాలి : భీమ్‌రావు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి

పంటలక్ష్మి పథకాన్ని అటవీహక్కుల చట్టం ప్రకారం హక్కుపత్రాలున్న గిరిజనులకూ ఎకరానికి రూ.4వేల ప్రోత్సాహం అందేలా కృషి చేయాలి. 1970కి ముందున్న దళిత, గిరిజనులు, బీసీలకు వర్తింపచేయాలి. హక్కుపత్రాలు అందనివారికి వెంటనే మంజూరు చేయాలి. ఏజెన్సీలోని కౌలు రైతులకూ వర్తింపజేయాలి.

భారతీయులు సంతోషంగా లేరు

మొదటిపేజీ తరువాయి

ఐక్యరాజ్యసమితి బుధవారం విడుదల చేసింది. ప్రపంచంలో అన్ని దేశాల్లోకెల్లా ఫిన్‌లాండ్ ప్రథమ స్థానంలో ఉంది. జీవన ప్రమాణం, సామాజిక మద్దతు, అవినీతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐక్యరాజ్యసమితి ఈ నివేదికను తయారు చేసింది. ఫిన్‌లాండ్‌లో రాజకీయ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల సంతోష కరమైన జీవితం గడుపుతున్నామని అందువల్లే ఇది సాధ్యమైందని ఆ దేశానికి చెందిన సోఫియా హోల్మ్ అనే యువతి తెలిపారు.

చర్చించకుండానే మరో రెండు బిల్లులు

మొదటిపేజీ తరువాయి

తూట్లు పొడుస్తోంది. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అశాస్త్రీయంగా, అన్యాయంగా చేశారన్న టీడీపీ ఎంపీ, మాజీ మంత్రి వైఎస్ చౌదరి చేసిన వ్యాఖ్యలు రాజ్యసభలో దుమారం రేపాయి. చౌదరి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. విపక్షాల ఆందోళన నడుమ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం గురువారం మరో రెండు బిల్లులను ఆమోదించుకుంది. గ్రాట్యుటీ చెల్లింపుల(సవరణ) బిల్లు, నిర్దిష్ట పరిహారం(సవరణ) బిల్లులను మూజువాణి ఓటుతో కేంద్రం ఆమోదింపజేసుకుంది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే రిజర్వేషన్ అంశంపై టీఆర్ఎస్, హోదాపై టీడీపీ, కావేరీ నదీ నిర్వహణ బోర్డుపై అన్నాడీఎంకే, పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, సీపీఐ(ఎం) ఆందోళన చేపట్టాయి. టీఆర్ఎస్ ఎంపీలు వినోద్, కవిత, బూర నర్సయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. దీంతో సభను స్పీకర్ సుమిత్రా మహాజన్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. అంతకముందు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ 'మహా పంచాయతీ' అని, అన్ని అంశాలను చర్చించేందుకు తాము సిద్ధమని చెప్పారు. వెల్‌లో ఆందోళన చేస్తున్న సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని కోరారు. వాయిదా అనంతరం సభ ప్రారంభమవగానే.. గ్రాట్యుటీ చెల్లింపుల బిల్లును స్పీకర్ ఆమోదానికి తీసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాధిత్యా సింధియా మాట్లాడుతూ.. ఇది కీలకమైన బిల్లు అని, ప్రతి ఒక్కరూ దీనిపై మాట్లాడాల్సిన అవసరముందని అన్నారు. బిల్లులను చర్చించకుండా ఈ విధంగా ఆమోదించడం సరికాదని అన్నారు. కాగా గ్రాట్యుటీ బిల్లుపై కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ సభలో మాట్లాడారు. గ్రాట్యుటీ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచుతూ సవరణ బిల్లును ప్రవేశపెట్టినట్టు చెప్పారు. అలాగే ప్రసూతి సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు చేశామని చెప్పారు. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం-1975కు సవరణగా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో బీజేపీకి మెజార్టీ సంఖ్యాబలం ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. అనంతరం నిర్దిష్ట పరిహారం(సవరణ) బిల్లును సైతం ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించారు. కాగా చర్చ చేపట్టకుండా బిల్లులను ఏకపక్షంగా ఆమోదించడంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బిల్లు ప్రతులను చించి సభలో తమ నిరసన తెలిపాయి. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో వైఎస్ చౌదరి వ్యాఖ్యల దుమారం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన 'అశాస్త్రీయంగా, తొందరపాటుగా, అన్యాయంగా' చేశారన్న టీడీపీ ఎంపీ, మాజీ మంత్రి వైఎస్ చౌదరీ చేసిన వ్యాఖ్యలు రాజ్యసభలో దుమారం రేపాయి. సభ ఉదయం ప్రారంభమైన తరువాత కేంద్రమంత్రి పదవికి ఎందుకు రాజీనామా చేశారో వివరించేందుకు వైఎస్ చౌదరికి రూల్ 241 కింద చైర్మన్ వెంకయ్యనాయుడు అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఏపీ విభజన అశాస్త్రీయంగా చేశారని చౌదరీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీనామాపై వివరణివ్వకుండా ఇక్కడ రాజకీయాలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ అన్నారు. చౌదరీ తన వ్యాఖ్యలను ఉపసంహ రించుకోవాలని జైరాం రమేష్ డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కేవీపీ ప్లకార్డుతో వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా

వేతనం పెంచాలని 'మున్సిపల్' సమ్మె

- ర్యాలీలు, ధర్నాలు, దీక్షలు
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ-యంత్రాంగం

వేతనాలు పెంపుపై ప్రభుత్వ వివక్షతను నిరసిస్తూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి దిగారు. మున్సిపల్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో విధులను బహిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి, ధర్నాలు చేశారు.కార్మికులపై కక్షసాధింపుగా వ్యవహరిస్తున్న కేసీఆర్ వారి ఆగ్రహానికి గురికాక తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. అలాగే, జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను పాలడుగు భాస్కర్ ప్రారంభించారు. పెద్ద అంబర్‌పేట నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాలోప ఆల్గొన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని ఏండ్ల తరబడి ఉద్యమిస్తున్నా పట్టించుకోకుండా వారిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 14ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఖమ్మం కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌లో సీపీఐ(ఎం), సీపీఐ, న్యూడెమోక్రసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ కార్మికులు విధులకు వెళ్లకుండా కార్యాయాల ఎదుట దీక్షలు చేపట్టారు. నల్లగొండ, మిర్యాలగూడలోని మున్సిపల్ కార్యాలయాలు, దేవరకొండలోని నగరపంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికుల సమ్మెలో కూర్చున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన కార్మికులు దీక్షలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోనూ సమ్మె జరిగింది.నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారని నాయకులు అన్నారు. వేతనాలు పెంచుతామన్న మంత్రి కేటీఆర్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.పెద్దపల్లి జిల్లా రామగుండం, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికుల దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో అధికారపార్టీ అనుబంధ సంఘం టీఆర్ఎస్‌కేవీ కార్మికులూ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనూ సమ్మె జరిగింది. హుజూరాబాద్ నగరపంచాయతీ నగరపంచాయతీ ఎదుట టీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. కుమురం భీం, మంచిర్యాల జిల్లాల్లో ఆయా మున్సిపాలిటీల ఎదుట సీఐటీయూ, హెచ్ఎంఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్య ంలో కార్మికులు వేర్వేరుగా సమ్మె శిబిరాలు ఏర్పాటు చేశారు.

తొలిరోజు సమ్మె విజయవంతం

రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె మొదటి రోజు విజయవంతమైందని తెలంగాణ మున్సిపల్ వర్కర్లు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటి ప్రకటించింది.


బ్రాండెడ్ బాటిల్స్‌లో వ్యర్థాలు

మొదటిపేజీ తరువాయి

న్యూయార్క్‌కు చెందిన పరిశోధకురాలు షెర్రీ మాసన్ స్టడీ చేసిన నివేదికను ఓ ఎన్జీవో విడుదల చేసింది. బ్రెజిల్, చైనా, ఇండియా, ఇండోనేషియా, కెన్యా, లెబనాన్, మెక్సికో, థాయ్‌లాండ్, అమెరికా దేశాల్లో వివిధ ప్రాంతాల్లో సేకరించిన 250 బాటిళ్ల శాంపిల్‌లను పరిశీలించగా అందులో 93శాతం శాంపిల్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించారు. వీటిలో ఆక్వా, ఆక్వాఫినా, దసాని, ఈవియన్, నెస్లె ప్యూర్ లైఫ్, సాన్ పెల్లెగ్రినో, బిస్లేరీ, ఈప్యూరా, గెరాల్‌స్టెయినర్, మినల్బా లాంటి తాగునీటిని అందించే ప్రధాన బ్రాండ్లున్నాయి. బాటిళ్ల ప్యాకేజింగ్ ప్రక్రియలోనే ప్లాస్టిక్ కణాలు నీటిలో కలుస్తున్నాయని ఈ నివేదిక వెల్లడించింది. ప్లాస్టిక్ కణాల తీవ్రత ప్రతి బాటిల్‌లో సున్న నుంచి 10వేల వరకు ఉన్నట్టు తెలిసింది. లీటర్ నీటిలో 100మైక్రాన్‌ల సైజుగల కణాలు సగటున 10.4 ఉండగా, చిన్న కణాలు దాదాపు 325 వరకు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఈ వ్యర్థాల వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదముందని వైద్యులు అంటున్నారు. బాటిల్ వాటర్ కంటే ట్యాప్ వాటర్ చాలా వరకు సురక్షితమని పరిశోధకులు చెబుతున్నారు. ప్లాస్టిక్ మన నిత్యజీవితంలో భాగమైందని, ప్రాథమిక స్థాయిలోనే మనం ప్లాస్టిక్‌ను స్వీకరిస్తున్నామని వివరించారు. దీని నుండి బయటపడి సురక్షిత నీటిని తాగాలని సర్వే బృందం సూచించింది.

అప్పు లక్షా 80 వేల కోట్లు


మొదటిపేజీ తరువాయి



ఇది నమోదు కానుంది. ఇదే సమయంలో అప్పులు కాకుండా మరో రూ.41 వేల కోట్లకు ఈ ఏడాది గ్యారెంటీ ఇవ్వనున్నట్టు సర్కారు పేర్కొంది. ఇందులో సాగునీటి పారుదల (ముఖ్యంగా మిషన్ కాకతీయ) కోసం రూ.16,413 కోట్లు, మిషన్ భగీరథ కోసం రూ.7,031 కోట్లకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుంది. ఇతర పథకాల కోసం రూ.18,094 కోట్లు అవసరమవుతాయని.. వాటికి కూడా గ్యారెంటీ ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది.

మన అప్పులు పెరిగిన తీరు... (రూ.కోట్లలో)	
2015-16	93,115
2016-17	1,27,829
2017-18	1,51,133
2018-19 (అంచనా)	1,80,238

బడ్జెట్ స్వరూపం..



- మొత్తం బడ్జెట్.. రూ.1,74,453కోట్లు
- రెవెన్యూ వ్యయం.. రూ.1,25,454 కోట్లు
- రెవెన్యూ మిగులు రూ.5,520కోట్లు
- ద్రవ్యలోటు అంచనా.. రూ.29,077కోట్లు
- జీడీపీలో ద్రవ్య లోటు 3.45శాతం
- రాష్ట్ర ఆదాయం రూ.73,751కోట్లు
- కేంద్రం వాటా రూ.29,041కోట్లు

విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ ఏర్పాటు

చైర్మెన్‌గా కె ఈశ్వరరావు ఎన్నిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్స్‌గా పనిచేస్తున్న కార్మికుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఐదు కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పాటయ్యాయి. దీనికి తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీగా నామకరణం చేశారు. జేఏసీ చైర్మెన్‌గా కె ఈశ్వరరావు (తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్)ఎన్నికయ్యారు. జేఏసీలో పై సంఘంతో పాటు రిజిస్టర్ యూనియన్లు 1535, హెచ్-43, హెచ్-64, బి-2871 యూనియన్లు ఉన్నాయి. విద్యుత్ సంస్థల్లోని ఆర్టిజన్స్ సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేసే వరకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని జేఏసీ చైర్మెన్ ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

పార్లమెంటరీ

సంప్రదాయాలకు విరుద్ధం : ఏచూరి

చర్చ లేకుండా ద్రవ్య బిల్లును ఆమోదించడంపై..

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో చర్చ జరగకుండా ద్రవ్య బిల్లుకు ఆమోదం పొందటం పట్ల సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని, ప్రజాస్వామ్య వ్యతిరేకమని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగ విలువలకు బీజేపీ తిలోదకాలిచ్చిందని ఏచూరి ట్వీట్ చేశారు. 2018-19 కేంద్ర బడ్జెట్‌కు లోక్‌సభ బుధవారం మధ్యాహ్నం ఆమోదం తెలిపింది. అయితే, చర్చ అవసరం లేకుండా తనకున్న గిలిటెన్ అధికారాన్ని ఉపయోగించిన స్పీకర్ సుమిత్రామహాజన్ బడ్జెట్‌కు మూజువాణి ఓటింగ్ ద్వారా ఆమోదానికి అవకాశం కల్పించారు. ఈ నెలలో రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనరోజు నుంచి ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షం టీడీపీసహా, టీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల ఎంపీలు లోక్‌సభలో వేర్వేరు అంశాలపై నిరసన తెలుపుతున్నారు. దీంతో, పరిస్థితిని ముందే పసిగట్టిన బీజేపీ తమ సభ్యులందరూ సభకు హాజరయ్యేలా ఆదేశిస్తూ విప్ జారీ చేసింది. ద్రవ్య బిల్లులకు రాజ్యసభ ఆమోదం అవసరంలేదన్న విషయం తెలిసిందే.

ప్రగతి లేని రథచక్రం

బడ్జెట్‌లో టీఎస్‌ఆర్టీసీకి మళ్లీ మొండిచేయి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రగతి రథ చక్రానికి సర్కారు బ్రేకులు వేసింది. 2018-19 బడ్జెట్‌లో టీఎస్‌ఆర్టీసీకి ప్రస్తుత ఏడాది మాదిరే వచ్చే ఆర్థిక సంవత్సరానికీ మొండిచేయి చూపింది. 2017-18లో బడ్జెట్లో సర్కారు రూ.వెయ్యి కోట్లు కేటాయించిందంటూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేసి...ఆహా..ఓహో...అంటూ హడావిడి చేసిన కొందరు నేతలు ఇప్పుడు సమాధానాలు వెతుక్కోవలసిన పరిస్థితిని కల్పించింది. 2018-19 బడ్జెట్‌లో టీఎస్‌ఆర్టీసీకి చేసిన కేటాయింపు రూ.975.55 కోట్లు. ఇవన్నీ ఆర్టీసీకి రావల్సిన నిధులే. ఈ మొత్తంలో రూ.520 కోట్లు వివిధ వర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీల క్రింద సంస్థకు రావల్సిన మొత్తం కాగా, మిగిలిన రూ.334 కోట్లు ప్రభుత్వ గ్యారెంటీతో తీసుకున్న రుణాల చెల్లింపులకు సంబంధించినవి మాత్రమే. ఇక కొత్త బస్సుల కొనుగోలుకు సంబంధించి రూ.140 కోట్లను కూడా ప్రభుత్వ గ్యారెంటీ రుణాల్లోనే కలిపేయడం గమనార్హం. ఆర్టీసీ విస్తరణకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం కేటాయించలేదు. పైపెచ్చు గడచిన మూడేండ్ల నుంచి బడ్జెట్ కేటాయింపులకు తగినట్టు నిధుల మంజూరీ కూడా లేదు. 2013-14 నుంచి 2015-16 వరకు (మూడేండ్లు) వివిధ రాయితీల క్రింద ఆర్టీసీకి రావల్సిన సొమ్ము రూ.1500 కోట్లు కాగా...ఇచ్చింది కేవలం రూ.500 కోట్లు మాత్రమే. ఇక 2017-18 బడ్జెట్‌లో రాయితీలుగా కేటాయించిన రూ.520 కోట్లలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న ఈ సమయం వరకు ఇచ్చింది రూ.230 కోట్లు మాత్రమే. అంటే ఈ ఏడాదిలోనే సర్కారు ఇంకా రూ.290 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇక ప్రభుత్వ గ్యారెంటీ రుణాల నిధులు రూ.685 కోట్లు రావల్సి ఉంది. ఇప్పటికీ దీనిపై అతీగతీ లేదు. కొత్త బస్సుల కొనుగోలు కోసం టీఎస్‌ఆర్టీసీకి రూ.140 కోట్లు కేటాయించామని ప్రభుత్వం అనేక వేదికలపై ప్రచారం చేసుకుంది. 2017-18 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చింది కేవలం రూ.70 కోట్లు మాత్రమే. ఇటీవల శాసనమండలి సమావేశాల్లో రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీకి రూ.350 కోట్లు ఇప్పిస్తామని ప్రకటించారు. మిగిలిన బకాయి సొమ్ము గురించి కానీ, అప్పటి వరకు ఆ సొమ్ముకు వడ్డీలు ఎవరు కట్టాలనే దానిపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఇక గ్రేటర్ ఆర్టీసీని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. 2015-16లో జీహెచ్‌ఎంసీ టీఎస్‌ఆర్టీసీకి రూ.336 కోట్లు పలు వాయిదాల్లో ఇచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇదే అంకెను తిరగేసి చెప్తోంది. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో జీహెచ్‌ఎంసీ నుంచి రావల్సిన సొమ్ము సంగతిపై ఎలాంటి స్పష్టత లేదు. మరోవైపు టీఎస్‌ఆర్టీసీలో ఉద్యోగులు, కార్మికుల వేతన సవరణ జరగాల్సి ఉంది. కనీసం దాన్ని దృష్టిలో ఉంచుకొని అయినా ప్రభుత్వం నిధుల మొత్తాన్ని ఏమాత్రం పెంచలేదు. దీంతో అసలు వచ్చే ఆర్థిక సంవత్సంలోనైనా వేతన సవరణ చేస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

ఎవుసంపై ఏదీ చిత్తశుద్ధి!

- పెట్టుబడి పథకానికి చట్టబద్ధతేదీ?
- ఆత్మహత్య చేసుకున్న రైతుల ఊసేలేదు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే వ్యవసాయ రంగంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదనిపిస్తోంది. 2014-15లో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2017-18 వరకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రూ.24,804కోట్లు. ఇందులో రుణమాఫీ కింద రూ.15452 కోట్లు పోతే మిగిలింది రూ.9352 కోట్లు మాత్రమే. ఇందులో విత్తన సబ్సిడీ, ఎరువులు సబ్సిడీ, పత్తి గింజలు, నూనెగింజలు, మొక్కజొన్నల పరిశోధన, ఉద్యోగుల వేతనాలకు మిళితమై ఉన్నాయి. ఉద్యోగుల విషయానికొస్తే 882 మంది వ్యవసాయ అధికారులు, 1112 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు, 30 జిల్లాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందికి చెందిన వేతనాలు కూడా రూ. 9,352 కోట్ల నుంచే ఖర్చు చేయాల్సి ఉంది. వాస్తవంగా రాష్ట్రంలో కోటి 30 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి

ప్రతి ఏటా 250 మండలాల్లో కరువు నెలకొంటుంది. ఏటా రూ.5వేల కోట్ల పంట నష్టం వాటిల్లుతుంది. ఈ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చాలంటే పరిశ్రమలు, సేవా రంగాలను బలోపేతం చేయాలి. ఈ రెండు రంగాలకు మొక్కుబడిగా కేటాయింపులు చేశారు. విద్య, వ్యవసాయ పరిశోధనలకు ఈ బడ్జెట్‌లో రూ. 123 కోట్లు కేటాయించారు. పంటల పెట్టుబడి మద్దతు ధరలు రూ. 8981 కోట్లు, రైతు బీమా పథకానికి రూ. 500 కోట్లు, 522 కోట్లు, బిందు తుంపర సేద్యానికి రూ.127 కోట్ల చొప్పున బడ్జెట్‌లో పేర్కొన్నారు. రైతు భీమా పథకానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు పెడుతున్నట్టు ప్రకటించారు.

కేటాయించిన మేరకు ఖర్చు చేసినట్టయితే అన్ని పథకాలు విజయవంతం అవుతాయని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఎకరానికి రూ. 4వేల చొప్పున రెండు పంటలకు సంబంధించి రూ.8వేల చొప్పున ఇవ్వడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. కానీ ఈ పథకానికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా వచ్చే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పెట్టుబడి పథకానికి చట్టబద్ధత లేకుండా ఎంత కాలం నిర్వహిస్తారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఇది కేవలం ఎన్నిక కోసం అధికార పార్టీ వేసి ఎత్తుగడేనని కొంత మంది రైతులు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వానికి రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలి. పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4వేలు ఇవ్వడం కంటే మార్కెట్‌కు వచ్చిన ధాన్యానికి మద్ధతు ధర లభిస్తేనే రైతులకు అధిక ఆదాయం వచ్చినట్టు అవుతుంది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని సీఎం చెప్పారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతులు చనిపోయారు? ఎంత మందికి ఎక్స్‌గ్రేషియా చెల్లించారు? అనే అంశం ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణలో ఇప్పటి వరకు సుమారు 4వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది.

సంక్షోభాన్ని నివారించని బడ్జెట్

తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్ వ్యవ సాయ సంక్షోభాన్ని ఏ మాత్రం నివారించలేనిదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, కార్యదర్శి టి. సాగర్, ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి అటకెక్కిందన్నారు. పెట్టుబడి పథకం కౌలు రైతులు, పోడు, దేవాదాయ భూములు సాగు చేస్తున్న రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. ఆత్మహత్యల నివారణకు ఈ బడ్జెట్‌లో తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు.

రైతుల ఆదాయంతోనే దేశాభివృద్ధి..

- చర్చనీయాంశమైన మహారాష్ట్ర రైతు ఉద్యమం: కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు
- 'వ్యవసాయం సంక్షోభం - పరిణామాల'పై సెమినార్



నవతెలంగాణ-యాచారం

రైతుల ఆదాయం పెరిగి తేనే దేశం అభివృద్ధి చెందు తుందని కిసాన్ సభ అఖిల భారత మాజీ ఉపాధ్యక్షులు వి.శ్రీనివాస్‌రావు అన్నారు. వ్యవసాయం సంక్షోభం- పరిణామాలపై రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు దయ నీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునే నమ్ముకున్న రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నా పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అష్టకష్టాలుపడి పంటలు పడిస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఫార్మాసిటీ పేరుతో వేలాది ఎకరాలను లాక్కుంటున్న తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎలాంటి భరోసా కల్పిస్తుందో తెలపాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర రైతుల ఉద్యమం దేశంలోనే చర్చనీయాంశంగా మారిందన్నారు. రైతుల ఆందోళనతో బీజేపీ ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వ్యవసాయం రంగంపై జీఎస్టీ ప్రభావం చూపుతోందన్నారు.

కేరళ రాష్ట్రం వ్యవసాయ రంగంలో, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంలో దేశంలోనే ముందుందన్నారు. ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.అంజయ్య, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు, తావునాయక్, ఎమ్మె చంద్రయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక,ఉపాధి శాఖకు తగ్గిన నిధులు

- ప్రగతి పద్దులో రూ.41కోట్ల కోత
- ఉపాధి కల్పన, శిక్షణకు రూ.51 కోట్లు తగ్గింపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బడ్జెట్‌లో కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖకు నిధుల కేటాయింపుల్లో భారీగా కోత పడింది. 2017-18 సంవత్సరంలో నిర్వహణపద్దు రూ.310కోట్లు ఉండగా, ప్రగతిపద్దు రూ.304.11కోట్లు కేటాయించారు. ఈ సంవత్సరం (2018-19లో) మాత్రం నిర్వహణ పద్దు రూ.332.40కోట్లు ఉండగా, ప్రగతిపద్దు రూ.263.92కోట్లకు కుదించారు. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈ శాఖకు రూ.18కోట్లు తక్కువ నిధులు ప్రతిపాదించగా, ప్రగతిపద్దులో మాత్రం భారీగా కోత పెట్టారు. గతేడాది కంటే రూ.41కోట్లు తగ్గించారు. దీని ప్రభావం కార్మిక సంక్షేమంపై తీవ్రంగా పడనున్నది. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమల్లో పనిచేసిన కార్మికుల ఉపాధి గురించి బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. దీనికితోడు అసంఘటిత కార్మికుల గురించి కూడా పట్టించుకోలేదు. ప్రగతిపద్దులో కార్మిక శాఖాధిపతి విభాగానికి రూ.73.14కోట్లు, భీమా వైద్యసర్వీసుల శాఖాధిపతి విభాగంలో రూ.87.66కోట్లు, ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖాధిపతి విభాగానికి రూ.159.26కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఉపాధి కల్పన, శిక్షణ కోసం గతేడాది కంటే రూ.51కోట్లు తక్కువగా ప్రతిపాదించారు. దీనిప్రభావం ప్రధానంగా ఐటీఐలపై పడనున్నది.

విశ్వవిద్యాలయాల ప్రగతి కి నిధులేవి!

- ప్రగతి పద్దులో సగం నిధులకు కోత
- రూ.420 కోట్లకుగాను రూ.210 కోట్లే కేటాయింపు
- వర్సిటీలు అడిగినా పెడచెవిన పెట్టిన సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపింది. ప్రగతి పద్దులో సగం నిధులకు కోత విధించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో విశ్వ విద్యాలయాలకు ప్రగతి పద్దు కింద రూ.420 కోట్లు కేటాయించింది. 2018-19 బడ్జెట్‌లో మాత్రం రూ.210 కోట్లు కేటాయించడం గమనార్హం. అంటే గతేడాదితో పోల్చితే రూ.210 కోట్ల నిధులను తగ్గించింది. విశ్వవిద్యాలయాలు అడిగిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో విశ్వవిద్యాలయాలకు నిర్వహణ, ప్రగతి పద్దు కింద రూ.944 కోట్లు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో నిర్వహణ, ప్రగతి పద్దు కింద రూ.822 కోట్లు కేటాయించడం గమనార్హం. అంటే రూ.122 కోట్లు కోట్లు తగ్గించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రగతి పద్దు కింద రూ.412 కోట్లు కావాలని ప్రతిపాదించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఓయూకు ప్రగతి పద్దు కింద రూ.109.50 కోట్లు కావాలని ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను ఖాతరు చేయకుండా కేవలం రూ.60 కోట్లు కేటాయించడం గమనార్హం. ఓయూకే నిర్వహణ పద్దు కింద రూ.433.85 కోట్లు కావాలని ప్రతిపాదించింది. కానీ బడ్జెట్‌లో రూ.309.53 కోట్లు మాత్రమే కేటా యించింది. శాతవా హన విశ్వవిద్యాల యం ప్రగతి పద్దు కింద రూ.100 కోట్లు కావాలని ప్రతి పాదించింది. 2018-19 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయిం చింది. మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం ప్రగతి పద్దు కింద రూ.80.70 కోట్లు అడిగితే బడ్జెట్‌లో రూ.25 కోట్లు ప్రతిపాదించింది. తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రగతి పద్దు కింద రూ.57.78 కోట్లు ప్రతిపాదించగా, రూ.20 కోట్లు కేటాయించింది. ఇలా అన్ని విశ్వవిద్యాలయాలదీ ఇదే పరిస్థితి. ప్రగతి నిధులు సరిపోను కేటాయించకపోవడంతో విశ్వవిద్యాలయాలు దివాళా తీస్తున్నాయి. మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల విద్యాప్రమాణాలు దిగజారుతున్నాయి. నిధులు సరిపోను లేక విశ్వవిద్యాలయాల ప్రగతి అంతంత మాత్రంగానే ఉండే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే వసతుల్లేక, అధ్యాపకులకు సకాలంలో జీతాలు రాక, విద్యా ర్థులకు మెస్‌చార్జీలు అందక తీవ్ర ఇబ్బందులున్నాయి. చాలీచాలనీ నిధులతో వర్సిటీలను ఎలా బలోపేతం చేస్తుందని విద్యా వేత్తలు ప్రశ్నిస్తున్నారు. విశ్వవిద్యాల యాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందిస్తుందని అడుగు తున్నారు. విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకే తక్కు వ నిధులు కేటాయిస్తోందని, భవిష్యత్తులో ప్రయివేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిం చడంలో భాగమేనని ఆరోపిస్తున్నారు.



సాంకేతిక వర్సిటీలకు ప్రగతి నిధులు సన్నా

సాంకేతిక విశ్వ విద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్ లోనూ ప్రగతి పద్దు కింద ఒక్క రూపా యి కేటాయించలేదు. జేఎన్టీయూ హైదరాబాద్ ప్రగతి పద్దు కింద రూ.246 కేటాయిం చాలని కోరితే ఒక్క రూపాయి ప్రతిపా దించలేదు. బాసర లో ఉన్న రాజీవ్ గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీ యూకేటీ)కి ప్రగతి పద్దు కింద రూ.89.63 కోట్లు కావాలని కోరింది. అయినా రాష్ట్ర ప్రభు త్వం ఒక్క రూపాయి కేటాయించలేదు. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ప్రగతి పద్దు కింద రూ.23 కోట్లు కేటాయించాలని కోరినా మొండిచేయి చూపింది. పరిశ్రమలు వస్తున్నాయని, ఐటీ రంగం విస్తరి స్తోందని, ఉద్యోగావకాశాలు మెరుగవుతున్నాయని పాల కులు గొప్పలు చెప్తున్నారు. అంకురాలు ప్రారంభిస్తున్నా మని, యువతను ప్రోత్సహిస్తున్నామని, అంతా సాంకేతిక యుగంలో ఉన్నామని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగా హన పెంచుకోవాలని అంటున్నారు. కానీ సాంకేతిక విశ్వవిద్యాలయాల అభివృద్ధికి మాత్రం నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నదో అర్థమవుతున్నది.

విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధుల వివరాలు...

విశ్వవిద్యాలయం	2018-19 నిధుల కేటాయింపు (కోట్లలో)		
	నిర్వహణ నిధి	ప్రగతిపద్దు	మొత్తం
ఉస్మానియా	రూ.309.53	రూ.60	రూ.369.53
కాకతీయ	రూ.87.11	రూ.25.30	రూ.112.41
అంబేద్కర్	రూ.10.44	రూ.20	రూ.30.44
పొట్టి శ్రీరాములు	రూ.19.49	రూ.20.02	రూ.39.51
తెలంగాణ	రూ.23.76	రూ.20	రూ.43.76
మహాత్మాగాంధీ	రూ.19.49	రూ.25	రూ.44.49
శాతవాహన	రూ.8.70	రూ.20	రూ.28.70
పాలమూరు	రూ.6.63	రూ.20	రూ.26.63
జేఎన్‌టీయూ	రూ.82.24	----	రూ.82.24
జేఎన్ఏఎఫ్ఏయూ	రూ.10.36	----	రూ.10.36
ఆర్‌జీయూకేటీ	రూ.34.50	----	రూ.34.50
మొత్తం	612.25	రూ.210.32	రూ.822.57

బిజినెస్

సెన్సెక్స్ ▼150
33,685

నిఫ్టీ ▼50
10,360


డాలరుకు రూపాయి విలువ
64.92



బంగారం(10.గ్రా)
రూ. 30,285



వెండి (కేజీ)
రూ. 40,200



కోడిగుడ్లు			
హైదరాబాద్	330	విజయవాడ	317
ఒక్కగుడ్డుకు	3.90	చెన్నై	370
వరంగల్	332	ముంబయి	370



బిగ్‌సీ ద్వారా మార్కెట్లోకి ఎస్9



నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: శాంసంగ్ సంస్థ ప్రతిష్టాత్మకంగా మార్కెట్లోకి తీసుకువచ్చిన శాంసంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ ఫోన్లు తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి వచ్చేశాయి. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన ఫోన్లు శాంసంగ్ కేవలం బిగ్‌సీ ద్వారానే తెలుగు రాష్ట్రాల్లోకి విడుదలచేస్తున్నట్టుగా ఆ సంస్థ వ్యవస్థాపకులు, సీఎండీ బాలు చౌదరి తెలిపారు. ఇది తమకెంతో గర్వకారణంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంచలన మొబైల్స్ కొనుగోలుపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డు లేదా పేటీఎం మాల్ ద్వారా కొనుగోలు చేసిన వారికి రూ.6000 వరకు క్యాష్ బ్యాక్ అందిస్తున్నామని చౌదరి వెల్లడించారు. సులభ వాయిదాల పద్ధతిలో కూడా ఈ ఫోన్లను సొంతం చేసుకొనేలా బిగ్‌సీ తగిన వెసులుబాటును కల్పిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంసంగ్ అఖిల భారత వ్యాపారపు ఉపాధ్యక్షుడు ఉదయ్ భట్, సినీతార సమంత తదితరులు పాల్గొన్నారు.

మూడో సెషన్‌లోనూ నష్టాలే..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాల్లోనే నడిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన బలహీనమైన సంకేతాలతో.. ఉదయం 50 పాయింట్లకు పైగా నష్టాల్లో మొదలైన బీఎస్ఈ సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. చైనా దిగుమతులపై మరింత అమెరికా మరింతగా సుంకం విధించనుందని.. దీంతో ట్రేడ్‌వార్ ముదిరే అవకాశం ఉన్నట్టుగా వార్తలు రావడంతో అమెరికాతో సహా ఆసియా మార్కెట్లు నష్టాల బాటపట్టాయి. ఈ నేపథ్యంలో మొదలైన దేశీయ మార్కెట్లు కూడా నష్టాలతోనే ట్రేడింగ్‌ను ప్రారంభించాల్సి వచ్చింది. బ్యాంకులతో సహా ఆర్థిక సేవల సంస్థల స్టాక్స్ మరింతగా కుంగాయి. దీంతో మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. యూరోపియన్ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ.. దేశీయంగా వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడికి సూచీ నష్టాల నుంచి బయటపడలేకపోయాయి. ఫలితంగా గురువారం నాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ దాదాపు 150 పాయింట్లు పడిపోయి 33,685 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 51 పాయింట్లు కుంగి 10,360 వద్ద ముగిసింది. మదుపరులు ఆచితూచి ట్రేడింగ్ నిర్వహించడం కనిపించింది.

ఎగవేతదారులు ఎగిరిపోకుండా చెక్!

- 91 మంది దేశం దాటేసే అవకాశం
- బడామోసగాళ్ల పేర్లతో జాబితా సిద్ధం
- ఇక విదేశాలకు తరలిపోకుండా చర్యలు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) అతిపెద్ద స్కామ్ వెలుగు చూసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు కనిపిస్తోంది. భారీ ఎత్తున బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని.. వాటిని తిరిగి చెల్లించకుండా విదేశాలకు మకాం మారుస్తున్న నీరవ్ మోడీ లాంటి ఘరానా బాబులకు చెక్ పెట్టేలా కఠిన చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు మోసాలకు పాల్పడేవారు దేశం విడిచి వెళ్లిపోకుండా ఆంక్షలు తీసుకురావాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే దేశం విడిచి పారిపోతారు అని భావిస్తున్న 91 మందితో జాబితాను తయారుచేసినట్టుగా సమాచారం. వీరంతా బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన, మోసపూరిత లావాదేవీలకు పాల్పడిన కేసుల్లో నిందితులు లేదా ఆ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులే. ఈ విషయాన్ని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ అధికారి ఈ విషయాలను వెల్లడించారు. ఇలాంటి కేసులకు సంబంధించి మొత్తం 400 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదార్లను గుర్తించగా.. అందులో 91 మందితో ప్రభుత్వం విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్న వారి జాబితాను తయారుచేసినట్లు తెలుస్తోంది. వీరు దేశం విడిచి వెళ్లకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా.. ఇప్పటికే రూ. 50కోట్లకు పైబడి బ్యాంకు రుణాలు ఇవ్వాలంటే ఆ ఖాతాదారుల పాస్‌పోర్టు వివరాలను ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ ఆ ఖాతాదారులు మోసానికి పాల్పడినట్లు తేలితే సదరు వ్యక్తి పాస్‌పోర్టు వివరాలను బ్యాంకులు విదేశాంగ శాఖకు అందిస్తాయి. అప్పుడు వారు దేశం విడిచి వెళ్లకుండా విదేశాంగ శాఖ నిఘా పెడుతుంది అని సదరు అధికారి తెలిపారు.



ఇప్పటికే 31 మంది దేశం దాటారు..

వివిధ రకాల ఆర్థిక నేరాలకు పాల్పడి.. విచారణను తప్పించుకునేందుకు గాను విదేశాలకు తరలి వెళ్లిన బడాబాబుల సంఖ్య 31కి చేరిందని సర్కారు గురువారం అధికారికంగా వెల్లడించింది. ఇలా విదేశాలకు పారిపోయిన 31 మంది వ్యాపారవేత్తల వివరాలను ప్రభుత్వం గురువారం లోక్‌సభలో వెల్లడించింది. ఈడీ, సీబీఐలు విచారణ చేపట్టిన పీఎన్‌బీ స్కాం నిందితులు నీరవ్, మెహుల్ చోక్సి సహా ఆర్థిక నేరాలకు పాల్పడిన 31 మంది విదేశాల్లో తలదాచుకుటున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ జాబితాలో నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, కుమారుడు నిషాల్, లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా, లలిత్ మోదీ, ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ, సౌమిత్ జెనా, విజయ్‌కుమార్ రెవాభాయ్ పటేల్, సునీల్ రమేష్ రూపాని, సురేందర్ సింగ్, ఆనంద్ సింగ్, హర్‌సాహిబ్ సింగ్, హర్లీన్ కౌర్, జతిన్ మెహతా, చేతన్ జయంతిలాల్ సందేశర, దీప్తి చేతన్, నితిన్ జయంతిలాల్, సవ్యసేథ్, నీలేష్ పరేఖ్, ఉమేష్ పరేఖ్ తదితరులున్నారు. ఇందులో విజయ్ మాల్యా, అశిష్ జబన్‌పుత్ర, పుశ్పేష్ కుమార్ వైద్, సంజయ్ కల్రా, వర్షా కల్రా, ఆర్తి కల్రాల అప్పగింత విషయమై సీబీఐ నుంచి వినతులందాయని మంత్రి చెప్పారు.

పబ్లిక్ ఇష్యు బాటలో క్యాప్‌స్టస్

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న క్యాప్‌స్టన్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సంస్థ నిధుల సమీకరణ కోసం ప్రాథమిక మార్కెట్లోకి రానుంది. దాదాపు రూ.21.19 కోట్ల మేర నిధుల సమీకరణ నిమిత్తం ఈ సంస్థ పబ్లిక్ ఇష్యూకు రానుందని ఆ సంస్థ యాజమాన్యం తెలిపింది. వ్యాపార విస్తరణతో పాటు పెరుగుతున్న నిర్వహణ అవసరాలను తట్టుకొనేందుకు గాను సంస్థ ఐపీఓకు రావాలని భావిస్తున్నట్టుగా కంపెనీ యాజమాన్యం గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపింది. ప్రాథమికంగా ఎన్ఎస్ఈలో నమోదు కావాలన్న భావనతో ఉన్న కంపెనీ ప్రతిపాదిత ఐపీఓలో రూ.10ల ముఖ విలువ కలిగిన దాదాపు 23,04,000 ఈక్విటీ వాటాలను రూ.92ల ధరకు జారీ చేయనున్నట్టుగా సంస్థ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ తెలిపారు. మొత్తం 26.5 శాతం ఈక్విటీ షేరు క్యాపిటల్‌కు సరిపడా మొత్తాన్ని ఆఫర్ ఫర్ సేల్, కొత్త షేర్ల జారీ ద్వారా మార్కెట్లలో అందుబాటులోకి తెనున్నట్టుగా సంస్థ యాజమాన్యం తెలిపింది. తమ కంపెనీ ఈ మార్చి ముగింపు నాటికి దాదాపు రూ.117 కోట్ల స్థూల ఆదాయాన్ని, రూ.6 కోట్ల మేర నికర లాభాన్ని ఆర్జించే అవకాశం ఉన్నట్టుగా కంపెనీ ఎండీ తెలిపారు. ఇష్యూకు ముందు సంస్థ పెయిడప్ క్యాపిటల్ రూ.7.54 కోట్లుగాను.. ఇష్యూ తరువాత రూ.8.54 కోట్లుగాను నిలవనున్నట్టుగాగా శ్రీకాంత్ వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 400 మందికి పైగా క్లయింట్లను కలిగిఉన్న కాప్‌స్టన్ సంస్థలో దాదాపు 6,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.



అదే బ్యాంకులో మరో స్కామ్!



ముంబయి: దేశంలోని బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌కు వేదికగా నిలిచిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ముంబయి శాఖలోనే మరో మోసం వెలుగులోకి వచ్చింది. పీఎన్‌బీ బ్రాడీహౌస్ శాఖలో దాదాపు రూ.9.1 కోట్ల విలువైన స్కామ్‌ను సదరు బ్యాంకు అధికారులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించినట్టుగా సమాచారం. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ మాదిరిగానే.. అధికారుల సహకారంతో చంద్రీ పేపర్ అండ్ అలాయిడ్ ప్రోడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ దాని ప్రమోటర్లు తాజా కుంభకోణానికి పాల్పడినట్టు సమాచారం. అయితే ఈ స్కామ్ సమాచారాన్ని ఇటు పీఎన్‌బీ అధికారులు గానీ.. అటు చంద్రీ పేపర్ సంస్థ ప్రతినిధులు గానీ ధ్రువీకరించలేదు.



నిదురమ్మా.. ఇటు రావమ్మా!

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎంత అవసరమో నిద్ర అంతకన్నా ఎక్కువ అవసరం. మంచి ఆరోగ్యంతో ఉండాలంటే రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం.ఈ ప్రపంచంలో అత్యంత అదృష్టవంతులు ఎవరూ అంటే నిద్రపోయేవాళ్లే అని చెప్పవచ్చు. తిండి లేకుండా అయినా బతకవచ్చు కానీ నిద్రలేకుండా బతకుబండిని లాగడం చాలాచాలా కష్టం. పొద్దున లేచింది మొదలు అనేక ఒత్తిళ్ళతో జీవనం గడిపేవారిలో ఎంతో మందికి నిద్రలేమి ప్రధాన సమస్యగా మారింది. దీనితో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలెన్నో వారిని చుట్టుముడుతున్నాయి. నిద్రలేమి చాలా ఆరోగ్య సమస్యలకు హేతువని వైద్య నిపుణులు హెచ్చరిస్తునే ఉన్నారు. ఈ రోజు 'వరల్డ్ స్లీప్ డే' సందర్భంగా నిద్రకు సంబంధించిన కొన్ని నిజాలు..

ఆరోగ్యానికి, నిద్రకు ప్రత్యక్ష సంబంధం ఉంది. తగినంత నిద్ర లేకపోతే దాని ప్రభావం శరీర ఆరోగ్యంపై పడుతుంది. నిద్ర లేమితో కండ్లు అలసటగా కనిపిస్తాయి. అందవిహీనంగా కనిపిస్తాయి. నిద్రలో అనేక శరీర కణాలు తిరిగి ఉత్తేజితం అవుతాయి. కొత్తకణాలు తయారవుతాయి. అంతేకాదు నిద్రించే సమయంలో మెదడు విశ్రాంతి పొందడం వల్ల మెమరీ పవర్ పెరుగుతుంది. ఏదైన ఒక మంచి పని చేయాలనుకొన్నా, నేర్చుకోవాలనుకొన్నా మంచిగా నిద్రపోయి లేవడం వల్ల కొత్త ఐడియాలతో చురుకుగా పనిచేయగలుగుతారు. ఎక్కువ కాలం జీవించగలుగుతారు. అతి నిద్ర, నిద్రలేమి రెండు ప్రమాదమే. ఆరోగ్యకరమైన సగటు మనిషికి రోజుకు కనీసం ఏడు నుండి ఎనిమిది గంట నిద్ర చాలా అవసరం.

గుండె సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, కీళ్ళనొప్పులు, ప్రీమెచ్యూర్ ఏజింగ్ వంటి సమస్యలన్నీ నిద్రలేమి వల్ల కలుగుతాయని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

చాలామందికి నిద్ర వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుందని తెలుసు. అయితే కొన్ని పరిశోధనల్లో రోజు ఎనిమిది గంటల నిద్రపోయే వారిలో సృజనాత్మకత కూడా ఎక్కువగా ఉంటుందని వెల్లడైంది. తగినంత సమయం నిద్రపోవడంతో మెదడు చురుగ్గా మారి వారిలో సజనాత్మకతను పెంచుతుంది. కొత్త కొత్త ఐడియాలు వస్తాయి.

అథ్లెట్స్ బాగా రాణించాలంటే ఒక అధ్భుతమైన మార్గం నిద్ర అని స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనంలో స్పష్టమైంది. ఏడు నుంచి పది వారాల పాటు ప్రతి రోజూ రాత్రి కనీసం 10గంటలు నిద్రపోవడం వల్ల ఫుట్ బాల్ క్రీడాకారుల్లో యావరేజ్ స్ప్రింట్ అభివద్ధి చెంది పగలు అతి తక్కువ అలసట పొందుతారని, ఆటల్లో రాణిస్తారని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

మీరు బరువు తగ్గడానికి డైట్ ప్లాన్ చేస్తున్నారా? అయితే ఆహారంతో పాటు స్లిపింగ్ టైమ్ కోసం కూడా ప్లానింగ్ చేసుకోవాలి. ఎందుకంటే నిద్ర సమయంలో శరీరంలోని జీవక్రియలన్నీ నియంత్రించబడుతాయి. కొన్ని హార్మోన్లు రక్తంలో కలిసి, ఆకలిని పెంచుతాయి. సరైన నిద్రలేనప్పుడు ఆకలి పెరగడం వల్ల బరువు తగ్గే ఛాన్సే ఉండదు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి కంటి నిండా నిద్ర చాలా అవసరం.

సరైనంత నిద్ర పోవడం వల్ల ఒత్తిడిని కచ్చితంగా తగ్గించుకోవచ్చు. దాంతో బ్లడ్ ప్రెజర్ ను కంట్రోల్ చేసుకోవచ్చు. మంచి నిద్ర వల్ల ఆందోళన తగ్గుతుంది. భావోద్వేగాలను తగ్గించుకొంటారు. బాగా ఆందోళనగా అనిపించినప్పుడు, అలసిపోయినప్పుడు కంటినిండా నిద్రపోతే కలిగే రిలీఫ్‌కు ఏ మందుకు సరితూగవు.



ప్రపంచవ్యాప్తంగా 60ఏండ్లకు పైబడిన వారిలో దాదాపు 40-60శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ స్లీప్ రీసెర్చ్ సొసైటీస్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఎలాంటి కారణం లేకుండానే నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య ఆరు శాతం ఉంది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రపంచ జనాభాలో దాదాపు 30 శాతం మంది నిద్రలేమి సమస్యతో బాధ పడుతున్నారు. అంతేకాదు డిప్రెషన్‌తో బాధపడేవారిలో 90 శాతం మందిలో నిద్రలేమి సమస్య ఉంది. మనదేశంలో నిద్రలేమి సమస్యతో బాధపడేవారిలో 6.5 శాతం మంది మహిళలు, 4.3 శాతం మంది పురుషులు ఉన్నారు.

నిద్రలేమి సమస్య ఎదుర్కొనేవారిలో టైప్ 2 డయాబెటిస్ వస్తుంది. ఇందుకు కారణం..రక్తంలోని ఇన్సులిన్ స్థాయి తగ్గి హార్మోన్లపై ప్రభావం పడుతుంది. సరైన నిద్ర పోవడం వల్ల మధుమేహానికి దూరంగా ఉండవచ్చు. అంతేకాదు సరైన నిద్రలేకపోవడం వల్ల హ దయ వ్యవస్థ మందగిస్తుంది. రక్తనాళాల్లో రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడంతో గుండె సంబంధిత వ్యాధులు రావడానికి కారణం అవుతుంది. అలా అని ఎక్కువ సేపు నిద్ర పోవడం మంచిది కాదు. నిద్ర వల్ల విశ్రాంతిని పొందడమే కాదు మన శరీరంలోని అతి ముఖ్య పనులకు నిద్ర అవసరం అన్నది గుర్తుంచుకోవాలి.

ఎండాకాలంలో

ఎండాకాలంలో ఇంట్లో వేడితో పాటు శరీరంలోనూ అధిక ఉష్ణోగ్రత ఉండటం వల్ల నిద్రపట్టడం చాలా కష్టం. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలంలో హాయిగా సేదతీరవచ్చు.

- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పగటివేళ వీలైనంత ఎక్కువగా ద్రవపదార్థాల్ని తీసుకోవాలి. పండ్లరసాలు, మజ్జిగ లాంటివి తాగాలి. రాత్రి వేళ మెలకువ వచ్చినపుడు చల్లని నీటిని తాగితే నిద్ర పట్టేస్తుంది.
- అందరికీ ఏసీలు అమర్చుకునేంత ఆర్థిక స్తోమత ఉండకపోవచ్చు. తక్కువ ఖర్చుతో ఏసీని ఏర్పాటుచేసుకోవచ్చు. ఇందుకోసం టేబుల్ ఫ్యాన్ ఉంటే సరిపోతుంది. దీనికి ఎదురుగా ఒక బౌల్‌లో కూల్ వాటర్, ఐస్ ముక్కల్ని ఉంచితే గది అంతా చల్లబడుతుంది. హాయిగా నిద్రపోవడం సాధ్యమవుతుంది.
- నైట్‌డ్రస్సుల విషయానికొస్తే శరీరానికి హాయినిచ్చే కాటన్ దుస్తులు ధరించాలి. టీ షర్టులు, పాంట్స్, షార్ట్స్.. ఇలా కాస్త వదులుగా ఉంటే కాటన్ డ్రెస్సులైతే బావుంటుంది. శరీరానికి ఉపశమనం లభిస్తుంది. చక్కని నిద్ర పడుతుంది.
- బెడ్‌షీట్లు, దుప్పట్లు కాటన్‌వి ఉండేలా చూసుకోవాలి. లైట్ కలర్ లో ఉంటే మరీ మంచిది.కంటికి రిలీఫ్ ఇస్తే త్వరగా నిద్రపడుతుంది.
- పొద్దున త్వరగా నిద్ర లేచి తేలికపాటి ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. దీని వల్ల శరీరం ఫిట్‌గా మారుతుంది. అంతేకాదు శరీరం అలసిపోతుంది. దీని వల్ల రాత్రివేళ త్వరగా నిద్రపడుతుంది.



చిన్నారుల్లో సగటు నిద్రవేళలు

వయసు	రోజుకు
మొదటి నెలలో	16-20 గంటలు
రెండవ నెలలో	14-16 గంటలు
3-11నెలల మధ్య	12-15 గంటలు
1-3 ఏండ్ల మధ్య	11-14 గంటలు
3-5 ఏండ్ల మధ్య	10-13గంటలు

వివిధ వయసుల్లో నిద్రించే సమయం

6 - 13	9-11గంటలు
14-17	8-10గంటలు
18-25	7-9గంటలు
26-64	6-8గంటలు
65-	6-7గంటలు

-అమోగ్న

గొంతులో గరగర..!

గొంతులో సమస్య వస్తే నోటి నుంచి మాట సరిగ్గా రాదు. మాట్లాడే సమయంలోనూ.. నిద్రలోనూ గొంతులో గరగర అనిపిస్తుంది. దీంతో చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ సమస్య ఎక్కువగా సీజన్ మారే సమయంలో వస్తుంది. అన్ని వయసుల వారిలోనూ గొంతులో గరగర సమస్య వస్తుంది. ఈ సమస్యకు ముఖ్యకారణం జలుబు, ఫ్లూ, తలనొప్పి, సైనసైటీస్ నొప్పి, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు. గొంతు సమస్య కారణంగా చాలా ఇబ్బందులు వస్తాయి. ఆహారం తినే సమయంలోనే కాదు..నీళ్ల మింగాలన్న చాలా ఇబ్బందిగా ఉంటుంది. గొంతు భాగంలో నొప్పిగా అనిపించి ఆహారం తీసుకోవడం తగ్గించేస్తారు. దీంతో నీరసం వస్తుంది. గొంతులో వచ్చే సమస్యలకు సహజ ఔషదాల ద్వారా చాలా వరకు ఉపశమనం లభిస్తుంది. ఇంట్లో పాటించే చిన్నచిన్న చిట్కాలతో గొంతునొప్పి, గొంతులో గరగరల నుంచి తప్పించుకోవచ్చు.



ఉప్పునీరు..

సాధారణంగా వచ్చే గొంతు నొప్పిని ఉప్పునీరు దివ్యంగా పనిచేస్తుంది. ఒకగ్లాసు గోరువెచ్చని నీటిలో అరటీ స్పూన్ ఉప్పు వేసి ఆ నీటితో రెండుమూడుసార్లు బాగా పుకిలించాలి. ఈ నీటిలో పావు స్పూన్ అల్లంరసం కలిపితే మరింత త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఇది గొంతులో ఏర్పడే గరగర, నొప్పి సమస్యలను తగ్గించే అత్యుత్తమ విధానం.

ఆవిరి పట్టడం..

ఎండాకాలంలో దాహార్తిని తట్టుకోలేక చాలామంది చల్లటినీరు, డ్రింగ్స్ ఎక్కువగా తీసుకుంటారు. అప్పుడే గొంతులో సమస్య ప్రారంభం అవుతుంది.గొంతులో నొప్పి అనిపించగానే.. చల్లటి ద్రావణాలను తాగటం ఆపేసి, గోరు వెచ్చని నీటిని తాగటం ప్రారంభించండి.విజిటబుల్ సూప్స్, శొంఠిమిరియాల కషాయం వంటివి తాగటం వలన గొంతులో వచ్చిన సమస్యను చాలావరకు తగ్గిస్తాయి. అంతేకాదు గొంతు నొప్పి ఎక్కువగా జలుబులోనే వస్తుంది. ఆవిరిపట్టడం ద్వారా చాలావరకు సమస్య తగ్గుతుంది.

ఒక పెద్ద గిన్నెలో నీటిని బాగా వేడి చేయాలి. ఇందులో ఒకస్పూన్ పసుపు వేసి నిండా దుప్పటి కప్పుకోవాలి. బయట గాలి లోపలి రాకుండా, లోపలి ఆవిరులు భయటకు రాకుండా చుట్టూ దుప్పటి కప్పుకోవాలి. వేడినీటి నుంచి వచ్చే ఆవిరిని ముక్కు ద్వారా పీల్చాలి. వేడి ఆవిరులను పీల్చుటం మొదట్లో కొద్దిగా ఇబ్బందిగా ఉన్నా..త్వరగా ఉపశమనం లభిస్తుంది.

తేనె, నిమ్మరసం

గొంతులో కలిగే చికాకులు, సమస్యలను తగ్గించే ఔషధగుణాలు తేనె, నిమ్మరసంలో ఎక్కువగా ఉన్నాయి. ఇంట్లో అందుబాటులో ఉండే వీటిలో తయారుచేసే రుచికరమైన పానీయం గొంత సమస్యలకు చెక్ పెడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అరస్పూన్ నిమ్మరసం, ఒక స్పూన్ తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ పొద్దున, సాయంత్రం తాగితే త్వరగా గొంతు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దగ్గు, ఫ్లూ సమస్యలను కూడా తగ్గిస్తుంది.

వేడి చేయొద్దు!



చాలామంది రాత్రి మిగిలిన ఆహార పదార్థాలను మరుసటి రోజు వేడి చేసి తీసుకుంటారు. ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా కొన్ని పదార్థాల విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. వాటిని మళ్లీ మళ్లీ వేడి చేసి తింటే లేని రోగాలు కొనితెచ్చుకున్నట్టే. అవేమిటంటే..

చికెన్ : దీనిని చాలా మంది మళ్లీ వేడి చేసి తింటారు. అలా చేయడం వల్ల దానిలోని ప్రొటీన్లు పూర్తిగా నశించిపోతాయి. జీర్ణ సంబంధిత సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కడుపులో తిప్పడం, అరగకపోవడం, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయి.

గుడ్లు: కోడిగుడ్లతో చేసిన వంటకాలనూ ఒకసారికి మించి వేడి చేయకూడదు. అలా చేస్తే దానిలోని పోషకాలు టాక్సిన్లుగా మారతాయి. జీర్ణవ్యవస్థ మీద చెడు ప్రభావం చూపిస్తాయి.

మష్రూమ్స్ : ప్రొటీన్లు బాగా దొరికే ఆహారం మష్రూమ్స్. వీటినీ వండిన తర్వాత పదే పదే వేడి చేయటం మంచిది కాదు. అలా చేస్తే ప్రొటీన్లు విషపూరితంగా మారతాయి. అనారోగ్యాలు ఆవరిస్తాయి.

చేప నూనెతో హెల్త్ బెనిఫిట్స్!



ప్రపంచ ఆరోగ్య సంస్థ (world health Organization) చేస్తున్న సిఫారస్సు ప్రకారం వారానికి ఒకటి, రెండు చేపలు తినాలి. అప్పుడే శరీరానికి కావల్సిన ఒమేగా ఫాటీ ఆసిడ్స్ లభిస్తాయి. మరి చేపలు తినడానికి ఇష్టపడని వారు కనీసం చేపనూనెనైనా ఉపయోగిం చాలి. ఎందుకుంటే చేప నూనెలో 30 శాతం ఒమేగా 3 ఫాటీ ఆసిడ్స్ ఉండగా, మిగిలిన 70 శాతం ఖనిజాలతో,పోషకాలతో నిండి ఉంటుంది. చేప నూనె అనేది ఎక్కువ జిడ్డు కలిగిన చేపల కణజాలం నుండి సేకరిస్తారు. ముఖ్యంగా సాల్మన్, వైట్ ఫిష్, హెర్రింగ్, సర్డినెస్, అన్కోవిస్ అనే చేపల నుండి ఈ చేప నూనెని తీస్తారు. చేప నూనెలో అధికంగా ఉండే ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్ అనేక రకాల అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. చేప నూనె అనేక సమర్ధవంతమైన ఆరోగ్య లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది బరువుని తగ్గించుటయే కాకుండా కాన్సర్ వంటి జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది.

గుండె ఆరోగ్యానికి..

గుండెపోటు ప్రపంచంలోని మరణాల ప్రధాన కారణాల్లో ఒకటి. చేప నూనెని తీసుకునే ప్రజలు ఎక్కువగా హ ద్రోగం బారిన పడకుండా ఉన్నారని ఎన్నో నివేదికలు తేల్చాయి. ఈ చేప నూనె శరీరంలో కొవ్వు స్థాయిలను ట్రైగ్లిసరైడ్స్ ను తగ్గించడం మూలంగా అధిక రక్తపోటుని, గుండెపోటును నివారిస్తుంది.

దృష్టి లోపం రాకుండా

కొన్ని పరిశోధనల ప్రకారం ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్ల తగినంత తీసుకోని వ్యక్తులలో కంటి వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటున్నాయని తేలింది. అంతేకాక వీరిలో కంటి చూపు సమస్య వృద్ధాప్యంలో ఎక్కువగా ఉంటుంది. ఇది కంటికి సంబంధించిన వ్యాధులకు దారి తీస్తుంది. చేపలు తినేవారిలో చేపనూనె తీసుకోనేవారిలో కంటి చూపు సమస్యలు చాలావరకు తగ్గుతాయి.

వ్యాధినిరోధక శక్తి..

చేప నూనె తీసుకోవడం ద్వారా వ్యాధి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. సర్వసాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, ఫ్లూ వంటి కొన్ని వ్యాధులను సైతం ఎదుర్కొనగలదు. చేప నూనె వినియోగం వలన జ్వరం, చర్మ వ్యాధులు, అలసట తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అటెన్షన్ డిఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ADHD) వంటి చికిత్సను తగ్గించుటలో ఈ చేప నూనె సహాయపడుతుంది. దీనికి కారణం ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్. ఇది అధిక రక్తపోటు, డైస్లెక్సియా, ఏకాగ్రత కోల్పోవుట, భావోద్వేగ అస్థిరతతో బాధ పడుతున్న వారికి ఎంతగానో మేలు చేస్తుంది .

తామం, చర్మం కమిలిపోయినట్లు మారడం, గాయాలు, దురద, దద్దుర్లు వంటి వివిధ రకాల చర్మ సమస్యల పరిష్కారానికి చేప నూనె ఉపయోగపడుతుంది. చేప నూనెలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ శారీరిక పెరుగుదల, మానసిక అభివృద్ధికి చాలా తోడ్పాటుని ఇస్తాయి. గర్భధారణ సమయంలో తల్లులు తీసుకోవడం ద్వారా తమ శిశువులకి చక్కటి శరీరాక తిని, కంటి చూపుని ఇవ్వగలరని డాక్టర్లు చెప్తారు. అందుకే గర్భిణీలకు ఏ,డి విటమిన్ మాత్రలను ఇస్తారు.

కాన్సర్ కణాలను నాశనం చేయడంలో..

ప్రపంచాన్ని భయపెడుతున్న అనేక రకాల క్యాన్సర్లను నివారించడంలో చేపనూనె ఎంతో ఉపయోగపడుతుంది. చేపనూనె లోని పోషకాలు రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, పెద్దప్రేగు కాన్సర్ వంటి వివిధ రకాలైన క్యాన్సర్లను నివారించడంతో పాటు శరీరంలోని కాన్సర్ కణాలను పూర్తిగా నాశనం చేయడంలో సహాయపడుతుంది. చేప నూనెలో ఉండే ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. క్యాన్సర్ రాకుండా నియంత్రించడంతో పాటు.. క్యాన్సర్ చికిత్సలోనూ మెరుగైన ఫలితాలను ఇస్తుంది.

అధిక బరువును నియంత్రించేలా..

ఊబకాయం ఇతర వ్యాధుల తీవ్రతని పెంచే ఒక ప్రమాదకరమైన వ్యాధి. గుండె జబ్బు,టైప్ 2 మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులకి ప్రధాన కారణం ఈ ఊబకాయంమే. చేప నూనె ఈ ఊబకాయం స్థాయిని పెరగకుండా నివారిస్తుంది. ఉబకాయానికి గురవుతున్నారు అని అనుమానం వస్తే చేపనూనెని తీసుకోవడం మంచిది.

మానసిక సమస్యల నివారణకు..

సాధారణంగా మెదడు పనితీరుకు కూడా ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు చాలా అవసరం. కొన్ని మానసిక రుగ్మతలతో ఉన్న ప్రజలు తక్కువ ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలను తీసుకుంటున్నారని పరిశోధనల ద్వారా స్పష్టమైంది. చేప నూనె తీసుకోవడం ద్వారా , స్కిజోఫ్రీనియా, బైపోలార్ డిజార్డర్స్ వంటి మానసిక వ్యాధులని నివారించవచ్చు అని అనేక అధ్యయనాలు రుజువు చేశాయి.

నొప్పులను నివారించుటలో

చేప నూనెలో సహజ సిద్దంగా ఉండే నొప్పి నివారణా లక్షణాలు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ కలిగించే కొన్ని వ్యాధులను సైతం చికిత్స చేయగలదు. అంతేకాదు బుద్ధిమాంద్యం, మధుమేహం, ఊబకాయం , గుండె జబ్బులు వంటి కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల వలన కలిగే తీవ్రమైన నొప్పులను నివారిస్తుంది.

పీచు ఎక్కువగా..!

నిత్యజీవితంలో మనం తీసుకునే ఆహారధాన్యాలు ఎన్నో దశల్లో పాలిష్ చేసి వస్తాయి. ఈ కారణంగా మన శరీరానికి కావల్సిన ఫైబర్ తక్కువగా అందుతుంది. మనం తీసుకునే ఆహారంలో సూక్ష్మ, స్థూల పోషకాలు ఉన్నా.. తగినంత ఫైబర్ లేకపోవడంతో అనేక సమస్యలు వస్తాయి. మరి ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం ఎంటో తెలుసుకుని.. మన రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే అనేక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

ఫైబర్‌తో కలిసి వుండే ఆహారం వల్ల ఆరోగ్యపరంగా అనేక లాభాలున్నాయి. ఇది ఆహారం పేగులలో సులభంగా జరిగే వీలును కలిగిస్తుంది, అలాగే, పెద్ద ప్రేగులలో జీర్ణమైన తరువాత మిగిలిపోయిన వ్యర్ధ పదార్థాలను త్వరగా బయటకు పంపుతుంది. హైపో కోలెస్టర్ లిమిక్ ఏజెంట్ గా పనిచేస్తూ పిత్తరస లవణాన్ని (బైల్ సాల్ట్) బంధించి కొలెస్ట్రాల్ తగ్గుదలను మెరుగుపరుస్తుంది. అందుచేత, గుండె సంబంధిత వ్యాధులలోఆహార నియమాలను, నిర్వహణను పాటిస్తూ వుండడంలో సహాయపడుతుంది. ఇతర తృణ ధాన్యాలకంటే బియ్యంలో పీచు పదార్థాలు చాలా తక్కువ శాతంలో ఉంటాయి. జొన్నలలో ఈ పీచుపదార్థం 89.2 శాతం, సజ్జలలో 122.3 శాతం మరియు రాగులలో 113.5 శాతం ఉంటుంది.



మనదేశంలో గతంలో ఫైబర్ అధికంగా ఉంటే ముతక ధాన్యం వినియోగం అధికంగా ఉండేది. 1951-55లో ఉన్న 44.6 కి.గ్రా. నుండి 1970-74 కాలం నాటికి 38.5 కి.గ్రా. కు తగ్గిపోయింది. ఇటీవలే విడుదలైన నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో నివేదిక సగటు తృణ ధాన్యాల, చిరు ధాన్యాల వినియోగం తగ్గిపోతున్నదని స్పష్టం చేస్తున్నది. ఇప్పుడిప్పుడే తిరిగి చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మనకు మార్కెటులో కనిపించే రాగులు, సజ్జలు, జొన్నలు వాటిలోని పోషక విలువల గురించి తెలుసుకుందాం.

రాగులు : అత్యంత పోషకాలు ఉన్న చిరుధాన్యంగా రాగులను గుర్తిస్తారు. వంద గ్రాముల రాగులల్లో 344 మిల్లీ గ్రాముల కాల్షియమ్ ఉంటుంది. ఇంత స్థాయిలో కాల్షియమ్ మరే తృణ ధాన్యంలోనూ లేదు. ఐరన్ 3.9 మి.గ్రా వుంటుంది. ఇది కేవలం ఒక బాజ్రా (సజ్జల)లో తప్ప ఇతర తృణ ధాన్యాలన్నింటి కన్నా అధికంగానే ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది పూర్తి ఆరోగ్యకరమైన ఆహారంగా సిఫార్సు చేయబడుతోంది. ఎండాకాలంలో రాగి అంబలి ఎంతో ఆరోగ్యకరంగా గుర్తించబడింది. ప్రస్తుతం రాగులతో రాగిమాల్ట్, రాగి వెర్మిసిల్లి అప్పటికప్పుడు తయారుచేసుకునే ఆహారంగా మార్కెట్లో లభిస్తున్నాయి.

సజ్జలు : రాగుల తర్వాత సజ్జలు అత్యధిక పోషకాలు గల చిరు ధాన్యాలు. 100 గ్రాముల సజ్జల్లో 11.6 గ్రా. ప్రోటీన్ (మాంసక త్తులు), 67.5 గ్రా. పిండి పదార్థాలు, ఐరన్ 8 మి.గ్రా. వుంటాయి. కంటికి అత్యంత భద్రత, రక్షణ కలిగించే 132 మై.గ్రా కెరోటిన్ అనే పదార్థం ఉంటుంది. వీటిని నానపెట్టి తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు లభిస్తాయి. వీటిలో పాటు ఫైబర్ అధికంగా ఉంటుంది.

జొన్న : ఇందులో 10.4 గ్రా. ప్రొటీన్, 66.2 గ్రా. పిండి పదార్థం, 2.7 గ్రా. పీచు పదార్థం మరియు ఇతర సూక్ష్మ మరియు స్థూల పోషక పదార్థాలను కూడా కలిగి వుంటుంది. కొన్ని దేశాల్లో పసిపిల్లలకు పాలకు బదులుగా ఇచ్చే ఆహారాన్ని తయారుచేయడంలో జొన్నలు - అలసందలు, జొన్న - సోయాబీన్స్ ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎంతో బలవర్ధకమైన ఆహారంగా దీన్ని నైజిరియన్స్ భావిస్తారు. మన తాతముత్తాత్తలు కూడా చిరుధాన్యాలనే ఎక్కువగా తీసుకునేవారు. రుచి కన్నా.. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి తృణధాన్యాలను ఆహారంలో చేర్చితే ఫైబర్ ఎక్కువగా శరీరానికి అందుతుంది.



ఫైనల్‌కు చేరేదెవరో

బంగ్లా, శ్రీలంక మధ్య ఆఖరు టీ20 మ్యాచ్ నేడు

- ముక్కోణపు టీ20 సిరీస్
- సాయంత్రం 7 గంటల నుంచి డీ స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-కొలంబో

ముక్కోణపు టీ20 సిరీస్, నిదాస్ ట్రోఫీలో తొలి పోరులో పరాజయం చవిచూసినా హ్యాట్రిక్ విజయాలతో ఇదివరకే భారత్ ఫైనల్లో అడుగుపెట్టింది. నేడు బంగ్లాదేశ్, శ్రీలంకల మధ్య ఆఖరు పోట్టి సమరం జరుగనున్నది. ఈ మ్యాచ్ విజేత ఆదివారం భారత్‌తో ఫైనల్లో తలపడేందుకు అర్హత సాధిస్తుంది. ప్రస్తుతం ఇరు జట్లు ఆడిన మూడేసి మ్యాచుల్లో ఒక్కో విజయంతో పాయింట్ల పట్టికలో రెండేసి పాయింట్లతో సమంగా ఉన్నాయి. శ్రీలంక నెట్ రన్‌రేట్‌లో బంగ్లా కన్నా కాస్త మెరుగ్గా ఉన్నా ఇరు జట్లకూ ఫైనల్ అవకాశాలు సమానంగా ఉన్నాయి. దీంతో నేటి పోరు రసవత్తరం కానున్నది.

చావోరేవో : ఆఖరు మ్యాచ్.. అందునా ఫైనల్ బెర్త్ నిర్ణాయక పోరు కావటంతో బంగ్లాదేశ్, శ్రీలంక జట్లకు ఈ మ్యాచ్‌లోనే చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి. ఇక బంగ్లా జట్టు విషయానికొస్తే కెప్టెన్ షకిబ్ జట్టులోకి రానుండటం వారికి కలిసొచ్చే అంశం. చేతి వేలికి గాయం కారణంగా నిదాస్ ట్రోఫీకి దూరమైన షకిబ్ అల్ హసన్ నేటి కీలక పోరుకు జట్టులోకి తిరిగి రానున్నాడు. ఆల్‌రౌండర్ షకిబ్ వస్తే జట్టుకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో.. కోలుకున్న అతడిని శుక్రవారం మ్యాచ్‌లోకి తీసుకోనున్నట్టు బంగ్లా క్రికెట్‌బోర్డు తెలిపింది. జట్టులో షకిబ్ లేని తరుణంలోనూ బంగ్లా ఆటగాళ్లు బ్యాట్ ఝుళిపిస్తోన్నా, బౌలింగ్ ఆ జట్టుకు తీవ్ర సమస్యగా పరిణమిస్తోంది. బ్యాట్స్‌మెన్‌లో సౌమ్య సర్కార్, లిటన్ దాస్‌లు సహా వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ ఫామ్‌లో ఉన్నారు. పొట్టి ఫార్మాట్‌లో బంగ్లా ఓ మోస్తరు స్కోరు చేయాలంటే వీరు రాణిస్తే చాలు. అసలు చిక్కంతా బౌలింగ్‌తోనే. ముస్తాఫిజుర్ రహమాన్, రూబెల్ హోస్సేన్‌లు నిలకడగా బంతులేయటం అలవర్చుకోవాలి. తాస్కిన్ అహ్మద్, మహ్మదుల్లా మినహా మిగిలిన బౌలర్లు సిరీస్‌లో సింగిల్ వికెట్ సైతం తీసుకోలేదు. బౌలింగ్ పొరపాట్లను సరిదిద్దుకుంటే బంగ్లాకు ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.



శ్రీలంక విషయానికొస్తే ఫామ్‌లో ఉన్న ఓపెనర్ కుశాల్ మెండిస్ కండరాల గాయం నుంచి కోలుకుని బంగ్లాతో సమరానికి సిద్ధమయ్యాడు. బంగ్లాదేశ్ పర్యటనలో ప్రదర్శనతో బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకొచ్చిన మెండిస్ మరోసారి బంగ్లాపై చెలరేగాలని చూస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కుశాల్ పెరీరా సైతం లంకకు కీలకం. ఇద్దరు కుశాల్‌లు ఇప్పటిదాకా విఫలం కాకపోవటంతో బంగ్లా మిడిలార్డర్‌పై పెద్దగా భారం పడలేదు. నేడు సైతం వీరు అదే జోరు కొనసాగించాలని లంక కోరుకుంటుంది. లంక బౌలర్లందరూ మెరుగ్గానే ఉన్నా. కీలక సమయాల్లో బౌలింగ్ భారాన్ని మోయడానికి ఒకరి మీద ఆధార పడే అవకాశం లేదు. అవకాశం చిక్కినపుడు ఒక్కో బౌలర్ రాణిస్తున్నాడు. దీంతో లంక బౌలింగ్ బలంపై ఖచ్చితంగా ఏం చెప్పలేం. ఇరు జట్లు బౌలింగ్ కన్నా బ్యాటింగ్‌లోనే పటిష్టంగా ఉండటంతో ఎవరు చక్కగా బౌలింగ్ చేస్తారో ఆ జట్టుకే విజయావకాశాలు ఉండనున్నాయి.

తుది జట్లు (అంచనా) : శ్రీలంక : దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, దశున్ శనక, దినేశ్ చండిమాల్, ఉపుల్ తరంగ, తిసారా పెరీరా, జీవన్ మెండిస్, అఖిల ధనంజయ, దుశ్మంత చమీరా, నువాన్ ప్రదీప్.

బంగ్లాదేశ్ : తమీమ్ ఇక్బాల్, లిటన్ దాస్, సౌమ్య సర్కార్, షకీబ్ అల్ హసన్, ముష్ఫికర్ రహీమ్, మహ్మదుల్లా, షబ్బీర్ రహమాన్, మెహదీ హసన్/తాస్కిన్ అహ్మద్, రూబెల్ హుసేన్, ముస్తాఫిజుర్ రహమాన్, నురుల్ హసన్.

క్వార్టర్స్‌లో సింధు

ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ప్రీ క్వార్టర్స్‌లో నిచటాన్‌పై 2-1తో విజయం



బర్మింగ్‌హామ్ : తెలుగు తేజం పివి సింధు ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. అయితే తొలి పోరులాగానే సింధు ప్రీ క్వార్టర్స్‌లోనూ కష్ట పడింది. నాల్గో సీడ్ సింధు అన్‌సీడెడ్ క్రీడాకారిణితో మూడు సెట్ల పాటు పోరాడింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్ పోరులో 21-13, 13-21, 21-18తో తాయ్‌లాండ్ చిన్నది నిచటాన్ జిందాపోల్‌పై గెలుపొందింది.

హోరాహోరీగా సాగిన పోరులో సింధు స్వల్ప తేడాతో క్వార్టర్స్‌లో స్థానం సంపాదించింది. భారీ ర్యాలీలతో గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి కంటే ఓవరాల్‌గా కేవలం మూడే పాయింట్లతో గెలుపొందింది. తొలిసెట్‌ను 1-0తో ఆరంభించిన సింధు 1-1, 3-3తో నిచటాన్‌కు అవకాశం ఇచ్చినా ఆపై ఆధిక్యం పెంచుకుంటూ పోయింది. 3-3 స్కోరున్న వేళ వరుసగా ఆరు పాయింట్లు సాధించి 9-3తో ముందంజ వేసింది. ఆపై అదే జోరు కొనసాగిస్తూ 21-13తో తొలి సెట్ సొంతం చేసుకున్నది. రెండో సెట్‌నూ 1-0 ఆధిక్యంతోనే ఆరంభించిన సింధు కాసేపు తడబడింది. 2-2 వరకూ పోటీలో నిలిచినా ఆపై ప్రత్యర్థి వేగాన్ని అందుకోలేదు. 1-12తో ఉన్న పాయింట్ల అంతరాన్ని తగ్గిస్తూ 13-17తో పోటీలోకొచ్చే ప్రయత్నం చేసినా మరోసారి చెలరేగిన నిచటాన్‌కు 13-21తో సెట్ కోల్పోయింది. చెరో సెట్ నెగ్గటంతో నిర్ణాయక మూడో సెట్ హోరాహోరీగా సాగింది. 3-0తో మొదలెట్టిన సింధు 8-4తో దూసుకెళ్లినా 9-9, 12-12, 18-18తో స్కోరు సమం అవుతూ వచ్చింది. ఈ దశలో నేర్పుగా ప్రత్యర్థిని కట్టడి చేసిన సింధు మరో పాయింట్ కోల్పోలేదు. 21-18తో సెట్ నెగ్గి క్వార్టర్స్ స్థానాన్ని గెల్చుకుంది.

ఫెడరర్, హాలెప్ ముందంజ

- ఆండర్సన్, డెల్ పొట్రో కూడా
- ప్లిస్కోవాకు నిరాశ
- ఇండియన్ వెల్స్ మాస్టర్స్



ఇండియన్‌వెల్స్ (అమెరికా) : స్విస్ దిగ్గజం, ప్రపంచ నెంబర్ వన్ రోజర్ ఫెడరర్ ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. మహిళల టాప్ సీడ్ సిమోన హాలెప్ సెమీస్‌లో కాలుమోపింది. చెక్ చిన్నది కరోలినా ప్లిస్కోవా (ఐదో సీడ్)కు క్వార్టర్స్‌లో నిరాశ ఎదురైంది. అన్‌సీడెడ్ నయోమి ఒసాకా (జపాన్) చేతిలో 2-6, 3-6తో ఘోర పరాజయం చవి చూసింది.

వయసు మీద పడే కొద్దీ ఆటలో పదును పెంచుతోన్న ఫెడరర్.. ఫ్రాన్స్ ఆటగాడు జెరెమీ చార్డీను గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో 7-5, 6-4తో ఓడించాడు. రెండు సెట్లనూ బ్రేక్ తర్వాతే నెగ్గిన ఫెడరర్.. పోరును 82 నిమిషాల్లో ముగించాడు. తదుపరి రౌండ్లో కొరియా యువ సంచలనం చంగ్ హ్యూన్‌తో తలపడనున్నాడు. ఆండర్సన్, డెల్ పొట్రోలు చెమటోడ్చి క్వార్టర్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఆల్ అర్జెంటీనా ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో ఆరో సీడ్ డెల్ పొట్రో 3-6, 7(70-6920, 6-3తో సహచర ఆటగాడు లియోనార్డో మేయర్‌పై గెలిచాడు. ఏడో సీడ్ కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా) 4-6, 6-3, 7(8)-6(6)తో 11వ సీడ్ స్పెయిన్ ప్లేయర్ కారెనో బుస్టాను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో సిమోన హాలెప్ సైతం అన్ సీడెడ్ పెట్రా మార్టిచ్ (క్రొయేషియా)ను ఓడించడానికి కష్టపడింది. మూడు సెట్ల పోరులో 6-4, 6(5)-7970, 6-3తో గెలుపొందింది.



ఆసీస్‌దే సిరీస్

రెండో వన్డేలో భారత మహిళల జట్టు ఓటమి



వదోదర : భారత మహిళల జట్టుతో మూడు మ్యాచుల వన్డే సిరీస్ 2-0తో ఆసీస్ సొంతమైంది. గురువారం జరిగిన రెండో వన్డేలో భారత్ 60 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ సిరీస్ కోల్పోయింది. టాస్ నెగ్గిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్నది. ఆసీస్‌కు ఓపెనర్లు శుభారంభాన్ని ఇచ్చారు. తొలి వన్డేలో శతక్కొట్టిన ఓపెనర్ బోల్టన్ (84, 88 బంతుల్లో 12 ఫోర్లు) సహా ఎలైస్ పెర్రి(70 నాటౌట్), బెత్ మూనీ(56)లు రాణించడంతో ఆసీస్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. భారత బౌలర్ శిఖా పాండేకు మూడు, పూనమ్ యాదవ్‌కు రెండు వికెట్లు దక్కాయి. లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్ తడబడింది. 88 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన భారత్ ఆ తర్వాత స్వల్ప వ్యవధిలోనే వికెట్లు కోల్పోతూ వచ్చింది. ఓపెనర్ స్మ తి మంధాన(67) తప్ప మిగతా బ్యాట్స్‌వుమెన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. జట్టులోకి తిరిగొచ్చిన మిథాలీ రాజ్(15) సైతం ఆకట్టుకోలేదు. ఆసీస్ బౌలర్ల ధాటికి భారత్ మరో నాల్గు బంతులుండగానే 227 పరుగులకే కుప్పకూలింది. దీంతో 60 పరుగుల తేడాతో విజయం సాధించిన ఆసీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ దక్కించుకున్నది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును బోల్టన్ అందుకుంది. సిరీస్‌లో నామమాత్రమైన ఆఖరు వన్డే ఆదివారం జరగనున్నది.

జాఫర్ ద్వి శతకం

- తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 598/3
- ఇరానీ కప్



నాగ్‌పూర్ : దేశవాళీ క్రికెట్‌లో రికార్డుల పర్వం లిఖిస్తున్నాడు విదర్భ ఆటగాడు వసీం జాఫర్ (285 బ్యాటింగ్). ఓ పక్క వయసు మీద పడుతోన్న అద్భుతమైన బ్యాటింగ్‌తో అబ్బురపరుస్తున్నాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుతో విదర్భ ఇరానీ పోరులో అజేయ ద్విశతకంతో చెలరేగాడు. ఇరానీ కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేయడంతో పాటు ఇరానీ కప్‌లో వరుసగా ఆరు అర్ధశతకాలు నమోదు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఇరానీ కప్‌లో తొలి రోజు శతకంతో చెలరేగిన జాఫర్.. రెండో రోజు సైతం అదే జోరును కొనసాగించాడు. గణేశ్ సతీష్ (120) సెంచరీతో మెరిశాడు. దీంతో విదర్భ జట్టు అతి భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండో రోజు ఆటముగిసే సమయానికి అపూర్వ వాంఖడే (44 బ్యాటింగ్).. జాఫర్ తోడుగా క్రీజులో కొనసాగుతున్నాడు. విదర్భ మూడు వికెట్ల నష్టానికి 598 పరుగులతో ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నది.

మంజీరా శిఖంలో నల్ల మాఫియా

మంజీరా శిఖంలో నల్ల మాఫియా దందా సాగుతున్నది. పర్యావరణాన్ని కాపాడాలని ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో మొక్కలను నాటుతుండగా, దానికి రెట్టింపు వేగంతో కొంతమంది కాంట్రాక్టర్లు చెట్లను నరికేస్తున్నారు. వాటిని కాల్చి బొగ్గు తయారు చేస్తున్నారు. శివారు ప్రాంతాలనే టార్గెట్‌గా చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా పర్యావరణాన్ని నాశనం చేస్తూ..దొడ్డి దారిన బొగ్గును పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఇన్నాళ్లూ చెట్లపొదల్లో ఉన్న వన్యప్రాణులు నిలువనీడ లేక జనావాసాల్లోకి వెళ్తున్నాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం తాండూరు శివారులో అనుమతుల్లేకుండా బొగ్గు దందా నడుస్తున్నా అటవీ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

అటవీప్రాంతంలో చెట్లు నరికి బొగ్గు తయారీ

- దొడ్డిదారిన పొరుగు రాష్ట్రాలకు తరలింపు
- దెబ్బతింటున్న పర్యావరణం
- ప్రాణాలు కోల్పోతున్న వన్యప్రాణులు
- ప్రేక్షకపాత్రలో అటవీ అధికారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మంజీరా నది నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు సక్రమంగా వెళ్లేందుకు ప్రభుత్వం మంజీరా నదిలో పేరుకుపోయిన సర్కారు తుమ్మ, తుమ్మ, ఇతర చెట్లను తొలగించేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. దీనిలో భాగంగా సదరు కాంట్రాక్టరు తాండూరు గ్రామ శివారులోని మంజీరా నది ఒడ్డున భారీఎత్తున పెరిగిన తుమ్మ చెట్లను జేసీబీల ద్వారా తొలగిస్తున్నారు. ఆ ప్రాంతంలో అటవీ అధికారుల అనుమతుల్లేకుండా బట్టీలను పెట్టకూడదు. కానీ, సదరు కాంట్రాక్టరు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువచ్చి బట్టీలు పెట్టిస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి సుమారు పదిహేను కుటుంబాలు మంజీరా శిఖం భూముల్లో డేరాలు వేసుకొని మూడు నెలల నుంచి బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయి. ఆ బొగ్గును గోనె సంచుల్లో నింపి లారీల ద్వారా రాత్రిపూట మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాలతోపాటు హైదరాబాద్ నగరానికి దొంగచాటుగా తరలిస్తున్నారు. ఈ ప్రాంతం కామారెడ్డి-మెదక్ జిల్లాల శివారు ప్రాంతాల్లో ఉండటంతో ఎవరూ పట్టించుకోరనే ధీమాతో కాంట్రాక్టర్లు ఎలాంటి అనుమతులూ లేకుండా చెట్లు నరికేయడం, వాటితో బొగ్గు తయారు చేసే దందాకు పూనుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఇదంతా తెలిసినా పాలకులు, అటవీశాఖ అధికారులు తమకేమీ తెలియనట్టుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు ఉత్పత్తిలో సదరు కాంట్రాక్టరు నుంచి నాయకులు, అధికారులు భారీఎత్తున ముడుపులు తీసుకొని చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.

దట్టమైన పొగలు.. ప్రాణాలు కోల్పోతున్న వన్యప్రాణులు

మంజీరా శిఖం భూముల్లో బొగ్గు ఉత్పత్తి తయారు చేయడం వల్ల వచ్చే పొగతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం ఓవైపు భారీ ఎత్తున ప్రచారం చేస్తుండగా, దానికి విరుద్ధంగా కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా బొగ్గును తయారు చేస్తూ పచ్చని చెట్లను తగులబెడుతుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా పరిసర ప్రాంతాల్లో ఎన్నోరకాల వన్యప్రాణులు జీవిస్తున్నాయి. చెట్లను నరికివేయడంతో వన్యప్రాణులు ఇతర ప్రాంతాలు, జనావాసాల్లోకి వెళు న్నాయి. బొగ్గు తయారీ పనులు చేస్తున్న కూలీలు అటవీ జంతువులను, పక్షులను వేటాడి చంపేస్తున్నట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి బొగ్గు అక్రమ ఉత్పత్తి, రవాణాను అడ్డుకోవాలని, వన్యప్రాణులను కాపాడాలని పర్యావరణాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.





బొగ్గు ఉత్పత్తికి అనుమతుల్లేవ్

తాండూర్ గ్రామ శివారు మంజీరా నది ఒడ్డున తయారు చేస్తున్న బొగ్గు ఉత్పత్తికి అనుమతులు లేవు. మహారాష్ట్రకు చెందిన గణేష్ అనే వ్యక్తి బొగ్గు ఉత్పత్తి అనుమతి కోసం గత సెప్టెంబరులో అర్జి పెట్టాడు. దీనిపై నివేదికను జిల్లా అటవీశాఖ అధికారికి పంపాం. ఇప్పటివరకు అనుమతులు రాలేదు. అనుమతుల్లేకుండా బొగ్గు ఉత్పత్తి చేస్తే చర్యలు తీసుకుంటాం.

\- అనురాధ, ఫారెస్ట్ రేంజ్ అధికారి, నాగిరెడ్డిపేట్

మోడీ సర్కారుపై 'అవిశ్వాసం'

లోక్‌సభలో వైసీపీ తీర్మానం

- మద్దతివ్వాల్సిందిగా పలు పార్టీలకు అభ్యర్థన



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారుపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఏపీకి ప్రత్యేక హోదాను విస్మరించినందుకు నిరసనగా ఈ తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. శుక్రవారం అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాల్సిందిగా లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం నోటీసు అందజేశారు. అయితే అవిశ్వాస తీర్మానం సభలో ప్రవేశపెట్టాలంటే కనీసం 54 మంది ఎంపీల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో తమ అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాల్సిందిగా ఆ పార్టీ ఎంపీలు గురువారం పలు రాజకీయ పార్టీ నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గేతో పాటు సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాంఏచూరి, బీజేడీ ఎంపీ భర్తృహరి మెహతాబ్, టీఎంసీ ఎంపీ సౌగత్‌రాయ్, టీడీపీ ఎంపీ తోట నరసింహం, ఆప్ ఎంపీ భగవత్‌మన్ తదితరులను కలిసి పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి లేఖను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా కోసం నాలుగేండ్లుగా పోరాటం చేస్తున్నప్పటికీ సాధించలేకపోయామని లేఖలో జగన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హోదా హామీని విస్మరించిన కేంద్రంపై అవిశ్వాసం ప్రవేశపెడుతున్నామని, సభలో మద్దతు ఇవ్వాలని కోరారు.

కాళేశ్వరం కేసు విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు కేసు విచారణ ఏప్రిల్ 11కు వాయిదా పడింది. పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలపై సమాధానం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) సూచించింది. కాళేశ్వరం పర్యావరణ అనుమతులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషనర్ హయతుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం జస్టిస్ జావేద్ రహీం నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. పర్యావరణ అనుమతుల మంజూరులో సరైన ప్రక్రియ అనుసరించలేదని, కాబట్టి వీటిని రద్దు చేయాలని కోరారు.



అందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ సందర్భంగా పిటిషన్ అభ్యంతరాలపై వివరణివ్వాలని తెలంగాణకు ఆదేశించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.